సంగీత మేరు శిఖరాలు
రూ॥ 120/-
పేజీలు: 138


నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

**నేరేడు చెరువులో పడి ఆరుగురు విద్యార్థులు మృతి**
వినాయక నిమజ్జనంలో అపశ్రుతి.. సంగారెడ్డి జిల్లా పెద్దకంజర్ల గ్రామంలో విషాద ఘటన
10


సంపుటి 29, సంచిక: 88 | గురువారం | 17 -09-2026 | హైదరాబాద్
Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar
పేజీలు: 12 | వెల రూ. 5.00

నిర్దిష్ట కాలపరిమితిలోపు

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

ఏ పేదవాడికీ అన్యాయం జరగనివ్వబోం

- 22ఎ పరిధిలో 12 ప్రధాన సమస్యలు గుర్తించాం
- వాటి పరిష్కారానికి సిపిఎల్‌ఎ, న్యాయశాఖ కార్యదర్శి నేతృత్వంలో హైపవర్ కమిటీ నియమిస్తాం
- దేవాదాయ, వక్ఫ్ భూములను చట్టప్రకారం కొనుగోలు చేసి 22ఎ నిషేధిత జాబితా నుంచి తొలగిస్తాం
- అనుమతిపొందిన లే అవుట్‌లలో పెండింగ్ రిజిస్ట్రేషన్లను వారంరోజుల్లో పూర్తిచేస్తాం
- రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ – 22ఎపై స్వల్పకాలిక చర్చలో సిఎం రేవంత్‌రెడ్డి సమాధానం



ప్రజాపక్షం/హైదరాబాద్

దేవాదాయ,వక్ఫ్ భూములను చట్ట ప్రకారం కొనుగోలు చేసిన వాటిని '22 ఎ'నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని, హెచ్ ఎండిఎ, డిటిసిపి అనుమతులు పొందిన లేఅవుట్లలోని పెండింగ్ రిజిస్ట్రేషన్లను వారం రోజుల్లో పూర్తి చేస్తామని, సింగరేణి కార్మికులకు మేలు జరిగేలా ఇంటి పట్టాల విషయంలో నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రిఎ.రేవంత్ రెడ్డి హామీ నిచ్చారు. భూ సమస్యలకు నిర్దిష్ట కాలపరిమితిలోపు శాశ్వత పరిష్కారాన్ని చూపుతామని, ఏ పేదవాడికి అన్యాయం జరగనివ్వబోమని భరోసానిచ్చారు. 22(ఎ) పరిధిలో 12 ప్రధాన సమస్యలను గుర్తించామని, వాటి పరిష్కారానికి సిపిఎల్‌ఎ ,న్యాయ శాఖ కార్యదర్శి తరువాయి 8లో

# కెసిఆర్ ఫామ్‌హౌస్ భూములపై నిజనిర్ధారణ కమిటీ



- కలెక్టర్, రెవెన్యూ అధికారులతో వేస్తున్నట్లు అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన **ఫామ్‌హౌస్‌లో 700 ఎకరాలు ఉందో లేదో తేల్చాలి. అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమిని కెసిఆర్‌కు నోటీసులు జారీచేసి స్వాధీనం చేసుకోవాలని ఆదేశం**
- అర ఎకరం చొప్పున 800 మంది దళిత కుటుంబాలకు పంపిణీ చేయాలని మంత్రులు దామోదర, గడ్డం, పొంగులేటికి సూచన
- నిజనిర్ధారణ కమిటీ 30 రోజుల్లో విచారించి వాస్తవాలు తేల్చాలి. ఆలస్యమైతే అధికారులు, మంత్రులపైనా చర్యలుంటాయని స్పష్టీకరణ

రాష్ట్రంలో భూ కుంభకోణంపై ప్రత్యేక విచారణ కమిటీ

శాసనసభలో సిఎం రేవంత్‌రెడ్డి వెల్లడించిన కెసిఆర్ కుటుంబ సభ్యులు భూముల వివరాలు

| కుటుంబం | కుటుంబ సభ్యులు | ప్రాంతాలు | భూములు |
|---|---|---|---|
| కెసిఆర్ కుటుంబం | కెసిఆర్, ఆయన భార్య | సిద్దిపేట జిల్లా : ఎర్రవల్లి, మిట్టపల్లి, శివార్ వెంకటాపూర్ | 67.13 ఎకరాలు |
| కెటిఆర్ కుటుంబం | కెటిఆర్, ఆయన భార్య శైలిమ, కుమార్తె అలేఖ్య, కుమారుడు హిమాన్షురావు | సిద్దిపేట, రంగారెడ్డి జిల్లాలు : ఎర్రవల్లి, జన్వాడ, మర్కూక్, శివార్ వెంకటాపూర్ | 123.19 ఎకరాలు |
| కవిత కుటుంబం | కవిత, ఆమె భర్త | మహబూబ్‌నగర్, రంగారెడ్డి, జగిత్యాల, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల జిల్లాలు : 8 మండలాలు, 8 గ్రామాలు | 37.26 ఎకరాలు |
| హరీశ్‌రావు కుటుంబం | హరీశ్‌రావు, ఆయన భార్య | రంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలు : మిట్టపల్లి, నందిపల్లి, రామంచ, అజీజ్‌నగర్ | 30.16 ఎకరాలు |
| జోగినిపల్లి కుటుంబం | రవీందర్‌రావు, సంతోష్‌కుమార్, సంతోష్‌కుమార్ భార్య రోహిణి | 5 జిల్లాలు; 9 మండలాలు; 12 గ్రామాలు | 79.20 ఎకరాలు |
| నవీన్‌కుమార్ కొండల్‌రావు కుటుంబం | నవీన్‌కుమార్, కొండల్‌రావు | మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలు; 7 మండలాలు, 9 గ్రామాలు | 101.14 ఎకరాలు |
| మొత్తం | | 9 జిల్లాలు – 24 మండలాలు – 31 గ్రామాలు | 439.30 ఎకరాలు |


ప్రజాపక్షం/హైదరాబాద్

మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆధీనంలో ఉన్న ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌కు సంబంధించి ఏడు వందల ఎకరాల అంశంపైన విచారణ చేపట్టేందుకు కలెక్టర్, రెవెన్యూ అధికారులతో నిజనిర్ధారణ కమిటీ వేస్తున్నట్టు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. 700 ఎకరాల ఫామ్‌హౌస్ కెసిఆర్‌కు ఉందో లేదో తేల్చాలని, అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. కెసిఆర్‌కు నోటీసులు జారీ చేసి, ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. ఆ భూములను అర ఎకరం చొప్పున 8వందల మంది దళిత కుటుంబాలకు పంపిణీ చేయాలని మంత్రులు దామోదర రాజనర్సింహ, తరువాయి 8లో

**ఒకే సర్వేనెంబర్‌లో 1300 ఎకరాల మార్పు**

సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం నెమలిపురి గ్రామంలోని సర్వేనెంబర్ 318/ఆ1లోని 1389.36 ఎకరాల భూమిని గల్లా శ్రీనివాసరావు తండ్రి యోగయ్య తన పేరుమీద పట్టా చేయించుకున్నారు. ధరణి పోర్టల్‌లోని అక్రమాలకు ఇది ఒక ఉదాహరణ... మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దీనిని తిరిగి రిజర్వు ఫారెస్ట్ – అటవీ సరిహద్దు వివాదం కింద మార్చి నిషేధిత జాబితాలో చేర్చాం... – సిఎం

**1947 సెప్టెంబర్ 11న సాయుధ పోరాట పిలుపునిచ్చిన కమ్యూనిస్టు యోధులు**




రావి నారాయణరెడ్డి

బద్దం ఎల్లారెడ్డి

మఖ్దూం మొహియుద్దీన్

## జయ జయ జయహే తెలంగాణ





1948 సెప్టెంబర్ 13న భారత సైన్యం ప్రవేశం

సెప్టెంబర్ 17న భారత యూనియన్‌లో విలీనం

రక్తాక్షరాలతో లిఖించబడిన చిరస్మరణీయమైన చరిత్ర

# చరిత్రను చెరపలేరు




- తెలంగాణ సాయుధ పోరాటం అంటేనే కమ్యూనిస్టుల చరిత్ర
- సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని స్పష్టీకరణ
- భూస్వామ్య, వెట్టిచాకిరి వ్యతిరేక పోరాట చరిత్రను బిజెపి మరుగునపరిచే కుట్ర చేస్తోందని ఆగ్రహం
- మఖ్దూంభవన్‌లో సాయుధ సమరంలోని వీరోచిత ఘట్టాలతో పోరాటయోధుల ఛాయాచిత్రాల ప్రదర్శన

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ సాయుధ పోరాటం అంటేనే కమ్యూనిస్టుల చరిత్ర అని, ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ఆ చరిత్ర నుంచి ఎర్రజెండాను వేరు చేసి చూపడం సాధ్యంకాదని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు.
తెలంగాణ విముక్తి కోసం సాగిన రైతాంగ సాయుధ పోరాటాన్ని మత ఘర్షణగా చిత్రీకరించి, దాని వెనుక ఉన్న భూస్వామ్య వ్యతిరేక, వెట్టిచాకిరీ వ్యతిరేక పోరాట చరిత్రను బిజెపి తన స్వార్థ రాజకీయాలకు కోసం మరుగున పర్చే కుట్ర చేస్తోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించడంతో పాటు ఈ పోరాటంలో అసువులుబాసిన వేలాది మంది అమరుల త్యాగాలను ప్రభుత్వమే అధికారికంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా బుధవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన నాటి సాయుధ సమరంలోని వీరోచిత ఘట్టాలతో పాటు పోరాట యోధుల ఛాయాచిత్రాల ప్రదర్శనను పల్లా వెంకట్‌రెడ్డి, కూనంనేని సాంబశివరావు, ఈ.టి.నరసింహా, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రారంభించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.ఛాయాదేవి, ఎ.రవీంద్రచారి, ఎన్.జ్యోతి, ఆర్.అంజయ్య నాయక్, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు ఎ.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ్మా, తరువాయి 12లో



## తక్షణమే సమగ్ర భూ ఆడిట్


- రాష్ట్రంలో భూ రికార్డులపై నెలకొన్న గందరగోళానికి తెరదించాలి
- సిపిఐ శాసనసభాపక్షనేత కూనంనేని డిమాండ్
- 22ఎ కింద కోటి ఎకరాల ప్రైవేట్ భూములున్నాయనేది అసత్య ప్రచారమని వ్యాఖ్య

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో భూముల రికార్డులపై నెలకొన్న గందరగోళానికి తెరదించేందుకు ప్రభుత్వం తక్షణమే సమగ్ర భూ ఆడిట్ నిర్వహించడంతోపాటు, 22ఎ కింద ఉన్న ప్రైవేట్ భూములపై స్పష్టత తీసుకురావాలని సిపిఐ శాసనసభా పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. శాసనసభలో బుధవారం 22ఎ భూములపై తరువాయి 8లో

## 'యుపిఐ'పై చార్జీలొద్దు

- ఉచితంగానే ఉంచాలని కేంద్ర ప్రభుత్వానికి సిపిఐ డిమాండ్
- అమెరికా ఒత్తిడికి మోదీ సర్కారు మరొకసారి లొంగిపోయిందని ధ్వజం



**న్యూఢిల్లీ :** కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం భారతదేశపు ప్రయోజనాలను కాపాడటానికి బదులుగా మరోసారి అమెరికా ఒత్తిడికి లొంగిపోయి, ప్రభుత్వమే అభివృద్ధి చేసిన చెల్లింపు సాంకేతికత అయిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యుపిఐ) వినియోగంపై ఛార్జీలు విధించడం అత్యంత దారుణమైన చర్య అని సిపిఐ ధ్వజమెత్తింది. విదేశీ కార్పొరేట్ ప్రయోజనాలకు అనుగుణంగా యుపిఐని బలహీనపరచడం శోచనీయమని మండిపడింది. మోదీ ప్రభుత్వం తక్షణమే ఈ ప్రజా వ్యతిరేక నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, యుపిఐని ఉచితంగా ఉంచాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో మోదీ ప్రభుత్వ తరువాయి 12లో

ఇపిఎఫ్‌ఒ వేతన పరిమితి

## రూ.25 వేలకు పెంపు

- కేంద్ర కేబినెట్ నిర్ణయం
- నేటి నుంచే కొత్త విధానం అమల్లోకి : అశ్వినీ వైష్ణవ్

**న్యూఢిల్లీ :** ఇపిఎఫ్‌ఒ వేతనదారులకు కేంద్రం శుభవార్త చెప్పింది. వేతన పరిమితిని రూ. 15వేల నుంచి 25వేలకు పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఉద్యోగుల సామాజిక భద్రతా పరిధిని మరింత విస్తరించే ఉద్దేశంతో ఇపిఎఫ్‌ఒ వేతన పరిమితిని రూ. 15వేల నుంచి 25వేలకు తరువాయి 12లో

భారత నేవీ నౌకను

## 'ఢీ' కొట్టిన పాక్ నౌక

పాక్ 'సిడిఎ' కు భారత్ సమన్లు జారీ

**న్యూఢిల్లీ :** అరేబియా సముద్రంలోని అంతర్జాతీయ జలాల్లో పాకిస్థాన్ నేవీ నౌక ఒకటి భారత నౌకాదళ నౌకను ఢీకొట్టింది. ఈనేపథ్యంలో పాకిస్థాన్ తాత్కాలిక రాయబారి (ఛార్జి డి'అఫైర్స్–సిడిఎ)కి భారత్ బుధవారం సమన్లు జారీచేసింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నివారించడానికి, అన్ని సైనిక విభాగాలు తగిన జాగ్రత్తలు పాటించాలని, ఇరుపక్షాల మధ్య ఉన్న సంబంధిత ఒప్పందాలలోని నిబంధనలను గౌరవించాలని, సంబంధిత పాకిస్థాన్ అధికారులకు తెలియజేయాలని ఆ దౌత్యవేత్తకు సూచించినట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఇఎ) తరువాయి 12లో


ప్రముఖ భారతీయ నటుడు

## అనంత్‌నాగ్‌కు ఫాల్కే అవార్డు

**న్యూఢిల్లీ:** ప్రముఖ భారతీయ నటుడు అనంత్‌నాగ్ (78)కు కేంద్ర ప్రభుత్వం దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించింది.చలనచిత్ర రంగానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ప్రతిష్టాత్మకమైన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును 2024 సంవత్సరానికిగాను ప్రకటించారు. గుజరాత్‌లోని కెవాడియాలో సెప్టెంబరు 22వ తేదీన జరిగే జాతీయ చలనచిత్ర పరిశ్రమ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో ఈ పురస్కారం అందజేస్తారు. ఐదు దశాబ్దాల సినీరంగ ప్రయాణంలో పలు భాషా చిత్రాలలో నటుడుగా తరువాయి 8లో

నిజాం హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం ఒక చారిత్రక ఘట్టం. ఫ్యూడల్ పదఘట్టనల నుంచి ఆ స్వాతంత్ర్య మహోదయాన్ని అధికారికంగా స్మరించుకొని గర్వపడటం తెలంగాణ ప్రజల హక్కు. బ్రిటీష్ వలస పాలన నుంచి భారతదేశం 1947 ఆగస్టు15న స్వాతంత్ర్యం పొందితే నైజాం సంస్థాన ప్రజలు మరో సంవత్సరం తర్వాతగాని స్వేచ్ఛావాయువులు పీల్చుకోలేదు. ఎందుకని? ఈ వాస్తవాన్ని భావితరాలు గుర్తుచేసుకోవలదా? భారత స్వాతంత్ర్య దినాన్ని జరుపుకుంటూ తమ సొంతగడ్డ చరిత్రను మరిచిపోవలసిందేనా? ఇక్కడ మరో విచిత్రం చూస్తాం. నైజాం సంస్థానంలో భాగమైన కర్నాటక జిల్లాలు (కల్యాణ కర్నాటక), మహారాష్ట్రలోని మరాఠ్వాడా జిల్లాలు సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన (1948 ) సెప్టెంబర్ 17వ తేదీని ఎప్పటినుంచో విలీనదినంగా అధికారిక ఉత్సవంగా జరుపుకుంటున్నారు. ఆ సంస్థాన కేంద్రమైన తెలంగాణలో ఆ చారిత్రక ఘట్టాన్ని అధికారికంగా జరిపేందుకు ఇంతవరకు ఏ ప్రభుత్వం సిద్ధపడలేదు. చరిత్రను ఎంతకాలం తొక్కిపెట్టగలరు?

చరిత్ర గమనంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆవిర్భావం, ఆంధ్రతో విలీనంతో ఆంధ్రప్రదేశ్ అవతరణ–విచ్ఛిత్తి, మళ్లీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తదుపరి కెసిఆర్ ప్రభుత్వం 2021 నుంచి భారత యూనియన్‌లో విలీన దినాన్ని సమైక్యతాదినం అంటూ తెలంగాణ వీర చరిత్రను మరుగుపరిచే ప్రయత్నం చేస్తే, ప్రస్తుత కాంగ్రెస్ – రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆ సెప్టెంబర్ 17ను 'ప్రజాపాలన దినోత్సవం'గా జరుపుతోంది. ఈ దోబూచులాటలకు కనిపించే కారణం సుస్పష్టం – భారత యూనియన్‌లో తెలంగాణను అంతర్భాగం చేసేందుకు ఆనాటి ఫ్యూడల్ భూస్వామ్య అణచివేత పరిస్థితులనుబట్టి రైతాంగ సాయుధ పోరాటం నిర్వహించిందీ, అపారమైన త్యాగాలు చేసిందీ కమ్యూనిస్టులు. దాన్ని గుర్తుచేయటం దేశాన్ని దీర్ఘకాలం పాలించిన కాంగ్రెస్‌కు ఇష్టం లేదు. రెండు, ముస్లిం పాలకునికి వ్యతిరేకంగా పోరాటం; తెలంగాణలో, ముఖ్యంగా హైదరాబాద్‌లో ముస్లిం లు లక్షల్లో ఉన్నందున వారికి ఆగ్రహం కలుగుతుందేమోనన్న సందేహం. ముస్లింలకు రాజకీయంగా నాయకత్వ శక్తిగా ఉన్న ఎంఐఎం అలనాటి పరిస్థితుల్లో, రజాకార్ ఖాసిం రజ్వీ ఏర్పాటు చేసిన సంస్థ పేరును స్వీకరించినప్పటికీ, ఇప్పటి నాయకత్వం ఆ వారసత్వానికి ప్రతినిధిగా చెప్పుకుంటుందని భావించలేము. వారు ప్రజాస్వామ్య స్రవంతిలో భాగమైనారు. భారత రాజ్యాంగాన్ని శిరసావహిస్తున్నారు. అందువల్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, వారితో కూడా మాట్లాడి సెప్టెంబర్ 17ను విలీన దినంగా అధికారికంగా నిర్వహించవచ్చు. ఎందుకంటే, అది చారిత్రక వాస్తవం గనుక. ఆనాటి తెలంగాణ పోరాటంతో ఏ మాత్రం సంబంధంలేని ఆర్‌ఎస్‌ఎస్ – బిజెపి వారు 'విమోచన' దినమంటూ, అధికారికంగా జరపాలంటూ ముస్లిం వ్యతిరేక మత విభజన ప్రచారానికి ఈ సందర్భాన్ని ఉపయోగించుకుంటున్నారు. కమ్యూనిస్టులు ఈనాడు ఎన్నో విభాగాలుగా చీలిపోయి, పాత ప్రాభవం, ప్రజాదరణ కోల్పోయినప్పటికీ 'విముక్తి లేదా విలీన దినం'గా అధికారికంగా జరపాలంటున్నారు. కాంగ్రెస్ నోరు మెదపదు. ఇది ఏడు దశాబ్దాలకుపైబడి జరుగుతున్న ఎడతెగని పంచాయతీ. పేరు ఏదైనాకాని సెప్టెంబర్ 17ను అధికారికంగా జరిపి తెలంగాణ ఆత్మగౌరవ చరిత్రను చాటిచెప్పాలి.

## తెలంగాణ విలీనాన్ని అధికారికంగా జరిపేందుకు బెరుకెందుకు?

అంతర్జాతీయ పోరాటాల్లో సువర్ణాక్షరాలతో లిఖించదగిన 'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం' వారసత్వంగా కలిగిన కమ్యూనిస్టులు ఎప్పుడూ చరిత్ర పునశ్చరణే కాకుండా కమ్యూనిస్టు ఉద్యమం ఈనాటి పరిస్థితి గూర్చి లోతుగా చర్చించాలి, గుణపాఠాలు తీసుకోవాలి. ప్రపంచంలో, దేశంలో మితవాద ప్రాబల్యం పెచ్చుపెరుగుతున్న పరిస్థితుల్లో కమ్యూనిస్టు, వామపక్ష ప్రభావం సన్నగిల్లుతున్న వాస్తవం పునరాలోచనను పురికొల్పాలి. వివిధ పేర్లతో ఉన్న కమ్యూనిస్టు పార్టీలు, గ్రూపుల్లో పనిచేస్తున్న నాయకుల నిబద్ధతను, నిజాయితీని ఎవరూ శంకించలేరు. కాని కొత్త తరాలను గణనీయంగా ఎందుకు ఆకర్షించలేకపోతున్నారు. మన దేశంలో వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకిక, మధ్యేమార్గ శక్తుల ప్రభావం తరుగుతూ హిందూ మతోన్మాద శక్తులు ప్రాబల్యం పెంచుకుంటూ అధికారం చెలాయిస్తున్నాయి, విస్తరించుకుంటున్నాయి. రాజ్యాంగ వ్యవస్థలన్నిటినీ చెప్పుచేతల్లోకి తీసుకుని భవిష్యత్‌కు పునాదులు పటిష్టం చేసుకుంటున్నాయి. దీన్ని ఎదుర్కోవటం, వెనక్కి కొట్టటం ఎలా? ఇది నేడు కమ్యూనిస్టు ఉద్యమం ముందున్న ప్రధాన ప్రశ్న. దీనికి సమష్టి కృషి అవసరం. ఉదాహరణకు 10–15 బోర్డులు విడివిడిగా ఉంటూ, అప్పుడప్పుడూ ఉమ్మడి ప్రకటనలు, మొక్కుబడి ఆందోళనలు చేసేకన్నా అందరూ ఒకే బ్యానర్ కిందకు వచ్చి ఒకే పిడికిలి బిగించటం శక్తిమంతం కాదా? విడివిడిగా ఉన్న ప్రజాసంఘాలు, కేడర్లు ఒకే సంఘం కింద చెట్టాపట్టాలేసుకుని ఉద్యమించటం కేడర్లలోనే కాదు, శ్రామికవర్గ ప్రజారాసుల్లోనూ ఆత్మవిశ్వాసం, దృఢసంకల్పం ఇనుమడింపజేయదా? ఇవి ఇప్పుడు కమ్యూనిస్టు ఉద్యమ స్రవంతులు లోతుగా ఆలోచించాల్సిన అంశాలు. కాలం ఎంతో మారింది, టెక్నాలజీ ప్రతిముంగిటికీ చేరి ఆల్ఫా జీ నుంచి జన్ జీ వరకు ప్రభావితమవుతున్నారు. కాని సిద్ధాంత మూలాలు లేని సమీకరణలు తాత్కాలిక ఆకర్షణలు కావచ్చుగాని శాశ్వత ప్రత్యామ్నాయ శక్తి కాలేవు. వారిని భిన్నమార్గాల్లో ఆకట్టుకుని మార్క్సిస్టు – లెనినిస్టు సిద్ధాంతం సరళమైన పరిభాషలో వారికి సుబోధకం చేయవలసిన బాధ్యత కమ్యూనిస్టులపై ఉంటుంది. అందువల్ల వార్షికోత్సవాలు, సంస్మరణ సభలు, అడపాదడపా ఆందోళనలు ఈ కాలం వేగాన్ని అందుకోలేవు. కాబట్టి కమ్యూనిస్టులు ఐక్య కార్యాచరణలకు పరిమితం కాకుండా ఐక్యత గూర్చి గంభీరంగా ఆలోచించాలి. అదే ఈ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట విజయోత్సవం 78వ వార్షికోత్సవం సందర్భంగా శపథం కావాలి!




### మెటాను ఇక సాధారణ మధ్యవర్తిగా పరిగణించలేం

**సోషల్ మీడియా వేదికలపై వినియోగదారులకు ఏ కంటెంట్ లేదా సమాచారం ఎక్కువగా కనిపించాలో/చేరాలో నిర్ణయించడానికి అల్గారిథమ్స్ ఉపయోగిస్తున్నప్పుడు, మెటాను కేవలం సమాచారం చేరవేసే సాధారణ మధ్యవర్తిగా (ఇంటర్మీడియరీ) చూడలేం. అదొక సర్వీస్ ప్రొవైడర్ కిందికి వస్తుంది. అలానే పరిగణించాలి. మిగతా సర్వీస్ ప్రొవైడర్ల మాదిరిగానే మెటాకు కూడా చట్టపరంగా ఎన్నో బాధ్యతలు ఉంటాయి. ఇక మీదట తన ప్లాట్‌ఫామ్ కంటెంట్ విషయంలో మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉంటుంది.**

– ప్రభుత్వ వర్గాలు

# తెలంగాణ నేల తల్లిని విముక్తిచేసిన ప్రజా పోరాటానికి మతంరంగు పులమొద్దు

## సెప్టెంబర్ 17న ప్రజాపాలన దినోత్సవం మహత్తర సాయుధ పోరాట చరిత్రను చీకటి పొరల్లోకి నెట్టడమే

### చరిత్రను వక్రీకరించడం జాతికి ద్రోహం చేయడమే..!



కూనంనేని సాంబశివరావు
ఎమ్మెల్యే
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి

భారత దేశానికి స్వాతంత్రం 1947 ఆగస్టు 15న రాగా బ్రిటీష్ వారు కుట్రతో హైదరాబాద్ సంస్థానాన్ని స్వతంత్ర దేశంగా గుర్తించారు. ఆనాటి హైదరాబాద్ సంస్థానంలో ఇప్పటి తెలంగాణకు చెందిన ఎనిమిది జిల్లాలు, కర్ణాటక రాష్ట్రానికి చెందిన బీదర్, గుల్బర్గా, రాయ్‌చూరు జిల్లాలు, మహారాష్ట్రకు చెందిన ఔరంగాబాద్, పర్బని, నాంధేడ్, బీడ్, ఉస్మానాబాద్ జిల్లాలు కలిసి ఉండేవి. హైదరాబాద్ సంస్థానాన్ని భారత దేశంలో విలీనం చేయాలనే లక్ష్యంతో ఆనాటి ఆంధ్ర మహాసభ అధ్యక్షులు రావి నారాయణరెడ్డి, ఎఐటియుసి అధ్యక్షులు మఖ్దూం మొహిద్దీన్, సిపిఐ తెలంగాణ కార్యదర్శి బద్దం ఎల్లారెడ్డిలు సాయుధ పోరాటానికి పిలుపు నిచ్చారు.

నిజాం ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, ఫ్యూడల్ ప్రభువుల అణచివేత దోపిడీలకు వ్యతిరేకంగా జరిపిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, మాతృ భాష కోసం, భూమి కోసం, భుక్తి కోసం మట్టి మనుషులు చేసిన తిరుబాటు; ధిక్కార స్వరం ఆ పిలుపు. మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి 1947 సెప్టెంబర్ 11న పిలుపు నివ్వడం, కమ్యూనిస్టులు, పేద ప్రజలు వీరోచితంగా పోరాటం చేయడంతో భూస్వాములు హైద్రాబాద్ లాంటి నగరాలకు పలాయనం చిత్తగించడంతో నిజాం ప్రభుత్వం పూర్తిగా బలహీనపడిపోయి హైద్రాబాద్ సంస్థానం కమ్యూనిస్టులు ఆక్రమిస్తారనే భయంతో అప్పటి నెహ్రూ ప్రభుత్వం నిజాం ప్రభువుతో లాలూచిపడటం వలన కేంద్ర సైన్యం కేవలం మూడు రోజుల్లోనే అనగా 1948 సెప్టెంబర్ 17న హైద్రాబాద్ సంస్థానాన్ని భారత దేశంలో విలీనం చేయడం జరిగింది. పాలకుడు ముస్లిం అయినందున ఈ పోరాటానికి ముస్లిం వ్యతిరేక పోరాటంగా మతంరంగు పులిమి చరిత్రను వక్రీకరించడమంటే తెలంగాణ జాతి త్యాగాలను, పోరాట గాథలను చీకటిపొరల్లోకి నెట్టివేసి, విషపూరిత మత విద్వేషాలను ఈనాటి తరం మెదడులోకి ఎక్కించడం వలన జాతికి అపకారం జరుగుతుంది తప్పితే ఉన్నత విలువలతో కూడిన నూతన జాతి నిర్మాణం చేసుకోలేము.

### సాయుధ పోరాట నేపథ్యం

హైదరాబాద్ సంస్థాన రాజు ముస్లిం అయినప్పటికీ జమీందార్లు, జాగిర్దార్లు, భూస్వాములు ఎక్కువ శాతం హిందువులే. ప్రజలపై, పేదవర్గాలపై విరుచుకుపడి దొడ్డి కొమరయ్యను బలితీసుకున్న 40వేల ఎకరాల భూస్వామి విసునూరి రాంచంద్రారెడ్డి , దౌర్జన్యానికి పరాకాష్ట అయిన దుష్ట మహిళ అతని తల్లి జానకమ్మ హిందువులే కదా. ఆ దాడిలో మరణించిన దొడ్డి కొమరయ్య కూడా హిందువే కదా..?. వరంగల్, నల్గొండ జిల్లాలో 1.50లక్షల ఎకరాలు కలిగినటువంటి జెన్నారెడ్డి ప్రతాపరెడ్డి గాని, లక్ష ఎకరాలు కలిగిన ఖమ్మం జిల్లాకు చెందిన కల్లూరి ప్రాంత కాళ్ళూరి దొరగాని హిందువులేకదా..?. 5వేలు, 10వేల ఎకరాలు కలిగిన హిందూ భూస్వాములు వందలాదిమంది ఉండేవారు. వీరు నిజాం నవాబుకు గులాములుగా వ్యవహరించడమే గాక నిజాంను మించిన దౌర్జన్యాలతో అనేక మందిని ఊచకోత కోశారు. మహిళలను వివస్త్రలుగా చేసి ఊరేగింపులు చేయడం, బతుకమ్మలు ఆడించడం, మానభంగాలు చేయడం లాంటి క్రూరమైన నేరాలను చేసిన జమీందార్లు, జాగిర్దార్లు, దేశ్‌ముఖ్‌లలో హిందువులున్నారు, ముస్లిములున్నారు. అదే విధంగా నిజాం రాజు ముస్లిం అయినప్పటికీ పేద ముస్లిముల జీవితాలలో ఎటువంటి మార్పులేదు. తెలంగాణలో భూస్వామ్య ముస్లింలు దాదాపు 2000 కుటుంబాలు కాగా పేద ముస్లింలు లక్షలాది మంది ఉన్నారు. అందులో 20 లక్షల మంది హైదరాబాద్ నగరంలో కడుపేదరికంలో ఉండే వారు. ముస్లింలలో తలారి, షేక్ సిందులు, గ్రామసేవకులు, అతి స్వల్ప ఆదాయాలతో మెకానిక్‌లు, హోటళ్లలో పనిచేయడం, పంచర్‌లు వేయడం, ట్రైలర్లుగా, కూరగాయలు, పండ్లు అమ్ముకొనే వారుగా అతి తక్కువ ఆదాయాలతో కూడిన ముస్లింలు లక్షలాది మంది ఉండేవారు. గ్రామాలలో సెంట్ భూమి కూడా లేని వారు కూడా ఉన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అనేకమంది ముస్లింలు కూడా చిత్రహింసలకు గురికాబడ్డారు. షేక్ బందగీని విసునూరు రాంచంద్రారెడ్డికి చెందిన గుండాలు చంపివేశారు. ఖాసీంరజ్వీ అనే క్రూరుడు మజ్లీస్ పార్టీని స్థాపించి హైద్రాబాద్‌ను స్వతంత్ర ముస్లిం రాజ్యంగా ప్రకటన చేసి రజాకారుల సైన్యాన్ని ఏర్పాటు చేసి రాక్షసుడిలాగ హిందువులపైన దాడులకు పూనుకోవడం జరిగింది. వ్యతిరేకించిన ముస్లీంలను కూడా నిర్దాక్షిణ్యంగా చంపించాడు. ప్రఖ్యాత జర్నలిస్టు సోయబ్ ఉల్లాఖాన్‌ను హైద్రాబాద్ నడిబజార్‌లో రజాకార్లు క్రూరంగా చంపారు. ఈనాటి ఖమ్మం జిల్లా ఆనాటి వరంగల్ జిల్లాలో రజబ్ అలి లాంటి యోధులు నిజాం రాచరికానికి వ్యతిరేకంగా పోరాటం చేశారు. డాక్టర్ రాజ్‌బహదూర్ గౌర్‌తో కలిసి మఖ్దూం మొహియుద్దీన్ ప్రొ॥అల్లంకుంద్ మీరీ, జవ్వాది రజ్వీ,(సాలార్జంగ్ మ్యూజియం ఆనాటి లైబ్రేరియన్) ప్రొ॥ ఖయ్యూంఖాన్ లాంటి అనేక మంది ముస్లీం విద్యావేత్తలు నిజాం రాచరిక పాలనకు వ్యతిరేకంగా కామ్రేడ్స్ అసోషియేషన్‌ను ఏర్పాటు చేశారు. మహ్మద్ రఫీ ఉస్మానియా యూనివర్శిటీలో నిజాంకు వ్యతిరేకంగా జాతీయ జెండాను ఆవిష్కరణ చేశారు. నిజాం వ్యతిరేకపోరాటంలో అగ్రగామిగానున్న అల్లాఉద్దీన్‌ని నిజాం ముష్కరులు చంపివేయడం జరిగింది. ఇలా ఎంతోమంది ముస్లింలు నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నారు. చిత్రహింసలకు, హత్యలకు గురైనారు. సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన ముగ్గురిలో మఖ్దూం మొహియుద్దీన్ ప్రఖ్యాత కవి మరియు విప్లవకారుడు.

### ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర ఏమిటి?

ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగా పేద రైతాంగం జరిపిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని ముస్లింల, హిందువుల పోరాటంగా చిత్రీకరించడం చరిత్రను అవమానపర్చడమే. భూమి కోసం, భుక్తి కోసం, దాస్య విముక్తి కోసం చేసిన పోరాటంలో అణగారిన ముస్లిమైనా, హిందువైనా అన్నదమ్ములే. అణిచివేసే ఫ్యూడల్ ప్రభువులు హిందూవైనా, ముస్లిమైనా వారి వర్గం, వర్గస్వభావమొక్కటే. ఇటువంటి మహోజ్వల పోరాట చరిత్రకు మతం రంగు పులమడానికి ఆనాటి పోరాటంలో ఇసుమంత పాత్ర లేని ఆర్‌ఎస్‌ఎస్ గానీ, ఈనాటి బిజెపి గానీ తమ మత ఉన్మాదంతో ఓట్ల రాజకీయాల నేపథ్యంలో చరిత్రను వక్రీకరిస్తున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ మరియు సంఘ్‌పరివార్‌లు 1925 నుంచి 1947 వరకు ఏనాడూ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన లేదు. అదేవిధంగా తెలంగాణ సాయుధ పోరాటంలో ఆర్‌ఎస్‌ఎస్‌కు కనీస పాత్ర కూడా లేదు. నాగపూర్‌లోని ఆర్‌ఎస్‌ఎస్ కేంద్ర కార్యాలయంపై మూడు రంగుల జాతీయ పతాక ఆవిష్కరణకు కూడా 2001 జనవరి 26 వరకు ఆర్‌ఎస్‌ఎస్ పెద్దలు ఏనాడూ అంగీకరించలేదు. మూడు అనే పదం అశుభానికి సంకేతమని మూడు రంగులతో కూడిన జాతీయ జండా దేశానికి అరిష్టమని వాదించారు. అటువంటి ఆర్‌ఎస్‌ఎస్, దాని ప్రతినిధి అయిన బిజెపిలు మతాలు, కులాలతో సంబంధం లేకుండా అందరూ ఒక్కటై తమ భూమిని తాము కాపాడుకోవడానికి వెట్టి నుండి విముక్తి కావడానికి చేసిన మహత్తర పోరాటానికి నేడు మతం రంగు పులమడానికి ప్రయత్నిస్తున్నారు. రజాకార్ల దాడుల సందర్భంలో హిందూ పురుషులను ముస్లిం మహిళలు, అలాగే ముస్లిం పురుషులను హిందూ మహిళలు తమ కొంగుచాటున దాచిపెట్టి కన్నతల్లులు బిడ్డలను కాపాడుకున్నట్లుగా కాపాడిన ఘటనలు సాయుధ పోరాటంలో ఉన్నాయి. అన్నదమ్ముల్లా కలిసి అన్ని మతాల వారు జరిపిన వీరోచిత పోరాటానికి మతం రంగు పులిమే ఎవరైన దేశ భక్తులు ఎలా అవుతారు? ముస్లిం రాజు అయిన నిజాం నవాబు రాజ్యాన్ని పటేల్ సైన్యం ఓడించి విమోచన చేసినట్లుగా వాదనను చేస్తూ ఈ పోరాటాన్ని ముస్లీం రాజుకు, హిందూ ప్రజలకు జరిగిన పోరాటంగా చిత్రీకరించడానికి బిజెపి ప్రయత్నిస్తున్నది. ప్రజాకంతకుడైన ఒక రాజును యుద్ధంలో ఓడిస్తే అతనిని యుద్ధ ఖైదీగా చూడాలి. అలా గాకుండా నిజాం నవాబుకు రాజప్రముఖ్‌గా హోదా కల్పించడంతోపాటు సంవత్సరానికి కోటి రూపాయల రాజభరణాన్ని ఇస్తూ పటేల్ సైన్యం నిజాం రాజుతో ఒప్పందం చేసుకున్నది. వేలాది మందిని ఊచకోతకోసిన రజాకర్ల నాయకుడైనటువంటి ఖాసీం రజ్వీని పాకిస్తాన్‌కి వెళ్ళిపోయే విధంగా అనుమతించడం లాంటి పరిణామాలు నిజాం రాజు, నెహ్రూ సైన్యం కుమ్మక్కు అయిన్నట్లుగా సూచిస్తున్నాయి. అటువంటప్పుడు యుద్ధం జరిపి విమోచన జరిగినట్లు ఎలా బిజెపి వాళ్ళు పేర్కొంటారు. గాంధీజీని హత్యచేసిన ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించిన సర్దార్ వల్లభాయి పటేల్‌ను కూడా బిజెపి హైజాక్ చేస్తున్నది.

మహత్తర తెలంగాణ సాయుధ పోరాటం హైదరాబాద్ సంస్థానంలో స్వాతంత్ర్యోద్యమాన్ని కీలక మలుపు తిప్పింది. ప్రాణాలు అర్పణ చేసిన 4000 మంది కమ్యూనిస్టులు తమ రక్తంతో తెలంగాణ నేలను ఎర్ర నేలగా మార్చి త్యాగాల అక్షరాలతో చరిత్రలో లిఖించబడ్డారు. మట్టి మనుషుల్ని మహావీరులుగా తయారు చేసిన పోరాటం అది. ఆ పోరాటాల వారసత్వం, దానిగాథలు ఈ నాటికి ఏ గ్రామం వెళ్లినా వినపడతాయి..కనబడతాయి. ఆ తరంలోదాశరధి, మఖ్దూం మోహియుద్దీన్, సుద్దాల హనుమంతు లాంటి మహాకవులకు, ఈతరంలో గద్దర్ లాంటి ప్రజా కళాకారులకు, వేలాది మంది వీరులకు జన్మనిచ్చిన ఉద్యమమిది. ప్రశ్నించే, తిరగబడే తత్వాన్ని తెలంగాణాకు అందించింది. భారతదేశంలో విప్లవాల పురిటిగడ్డ అనగానే తెలంగాణ ముందు వరుసలో ఉంటుంది. సంగీతం నేర్చుకోకపోయినా, సాహిత్యం చదవకపోయినా మట్టి మనుషుల పోరాటాల నుంచి వేలమంది ప్రజా కవులు, ప్రజాగాయకులకు ఈనాటికి జన్మనిస్తున్న విప్లవ మాత మనతెలంగాణ.



నిజాం రాక్షస ప్రభుత్వాన్ని అంతమొందించడానికి సాగుతున్న రైతాంగ పోరాటాన్ని నివారించడానికి భారత యూనియన్ సైన్యాలు1948 సెప్టెంబరు 13న హైదరాబాద్ చేరుకోవడం, సెప్టెంబర్ 17న విలీనం చేస్తున్నట్లు నవాబు ప్రకటించడం జరిగింది. అయితే, అప్పటి వరకు స్వాతంత్ర్యం కోసం ప్రజలను సమాయత్త పరిచి, సంస్థాన విలీన ప్రక్రియను సులభతరం చేసిన కమ్యూనిస్టులపైనే నాటి కేంద్ర హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ తుపాకులు ఎక్కుపెట్టించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో మరణించిన 4000 మందిలో తెలంగాణ విలీనానికి ముందు అతికొద్దిమంది కమ్యూనిస్టులు చనిపోగా విలీనం తరువాత కాంగ్రెస్ నాయకత్వంలోని పటేల్ సైన్యం చేతుల్లో దాదాపు 3000 మందికి పైగా చంపబడ్డారు. కుచ్చుటోపీలు ధరించిన దొరలు ఖద్దర్ టోపీలతో కొత్త అవతారాలతో తిరిగి గ్రామాలలో ప్రవేశించారు. కమ్యూనిస్టులు పేదలకు పంచిన 10 లక్షల ఎకరాల భూములను భూస్వాములకు తిరిగి అప్పజెప్పడానికి, కమ్యూనిస్టుల ఊచకోతకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పూనుకున్నది. ఈ పరిణామాల నేపథ్యంలో కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటాన్ని కొనసాగించింది. చివరకు పలు కోణాలలో చర్చించి 1951 మేలో దానిని విరమించింది.

### 1952 ఎన్నికల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో కమ్యూనిస్టు పార్టీ విజయాలుః

1952 నాటికి సిపిఐ నాయకులు ఎక్కువ మంది జైళ్లలో ఉండటం వలన, ఓటర్ లిస్టులో పేర్లు నమోదు కానందువలన అభ్యర్థులు దొరకని కారణంతో అన్ని స్థానాలకు పోటీ చేయలేకపోయాం. అప్పటికీ పార్టీపైన నిషేదం తొలగలేదు. దాని వలన పిడిఎఫ్ (పీపుల్ డెమోక్రటిక్ ఫ్రంట్) పేరుతో పోటీ చేసిన కమ్యూనిస్టు పార్టీకి 36 సీట్లు రాగా, అన్ని స్థానాలలో పోటీ చేసిన కాంగ్రెస్‌కు కేవలం 38 స్థానాలు మాత్రమే రావడం జరిగింది. అలాగే ఆనాడు ఆంధ్రప్రదేశ్ అనగా ఆంధ్ర, రాయలసీమ మద్రాస్ రాష్ట్రంలో ఉండేవి. ఇటు తెలంగాణ ఉద్యమం ప్రభావం అటు ఆంధ్రప్రదేశ్‌లోని కమ్యూనిస్టు స్ఫూర్తితో ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో సిపిఐ అత్యధికంగా 49 స్థానాలను గెలుపొందడం, కాంగ్రెస్ 47 స్థానాలకు కుదించడం జరిగింది. ఆ విధంగా 1952లో మద్రాస్ రాష్ట్రంలో తెలుగు ప్రాంతమైన ఆంధ్రలో సిపిఐ అత్యధిక స్థానాలు పొందింది. సిపిఐ మొదటిసారి అధికారంలోకి వచ్చే అవకాశం కలిగింది. కానీ కాంగ్రెస్ పార్టీ ఇతర పార్టీలను కలుపుకోని రాజగోపాలచారి ముఖ్యమంత్రిగా అధికారంలోకి రావడం జరిగింది. 1953లో పొట్టి శ్రీరాములు త్యాగంతో ఆంధ్ర రాష్ట్రం విడిపోయిన తరువాత ఎక్కువ స్థానాలు కలిగిన సిపిఐకి అధికారం పొందే అవకాశం మరోసారి వచ్చింది. కానీ పి.వి.జి.రాజు నాయకత్వంలోని సోషలిస్టు పార్టీ, ఎన్.జి.రంగా నాయకత్వంలోని కృషికార్ లోక్‌పార్టీ, ప్రకాశం పంతులు గారి నాయకత్వంలోని ప్రజాపార్టీలు కలిసి కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి రాకుండా చేయడంలో విజయవంతమైనాయి. ప్రకాశం పంతులుగారిని ముఖ్యమంత్రిగా ఆ పార్టీలు ఎన్నుకున్నాయి. తెలంగాణ ఉద్య మ ప్రభావం రెండు రాష్ట్రాల ఎన్నికలలో ఎంతగా ఉన్నదో అర్థమవుతున్నది. రెండు తెలుగు మాట్లాడే ప్రాంతాలలో కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చే అవకాశం ఆనాడే కలిగింది. అలాగే నల్లగొండ లోక్‌సభ స్థానంలో రావి నారాయణరెడ్డి గారికి నాడు భారతదేశవ్యాప్తంగా అమితమైన ఆదరణ కలిగిన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకంటే ఎక్కువ మెజారిటీ లభించడం ద్వారా తెలంగాణ ప్రజలు కమ్యూనిస్టులను ఎంతగా ఆదరించారో అర్థం చేసుకోవచ్చు.

### విలీన దినాన్ని అధికారికంగా నిర్వహించాలి

హైదరాబాద్ సంస్థానంలో భాగంగా ఉండి, దాని విచ్ఛిత్తితో కర్నాటకలోభాగమైన కల్యాణ కర్నాటక, మరఠ్వాడా ప్రాంతాలలో సెప్టెంబర్ 17న హైదరాబాద్ విలీన దినోత్సవాలను ప్రభుత్వాలే ఎప్పటి నుండో నిర్వహిస్తున్నాయి. తెలంగాణా విలీనాన్ని అధికారికంగా జరపడం లేదని సమైక్య రాష్ట్రంలోని ప్రభుత్వాలను దుమ్మెత్తిపోసిన అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ 2021 సంవత్సరం నుండి సమైక్యతా దినోత్సవం పేరుతో తెలంగాణ వీర చరిత్రను కనుమరుగయ్యేలా చేశారు. ఈనాటి కాంగ్రెస్ ప్రభుత్వమైనా విలీన దినోత్సవాన్ని అధికారికంగా కచ్చితంగా నిర్వహించాల్సిన బాధ్యత ఉన్నది. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం సెప్టెంబర్ 17ను 'ప్రజాపాలన దినోత్సవం'గా అన్ని నియోజకవర్గాలలో, ప్రభుత్వ కార్యాలయాల్లో జరుపుతామని ప్రకటించారు. ఇది కొంతమేరకు స్వాగతించవలసిన విషయమే అయినప్పటికి సాయుధ పోరాటానికి తగిన గౌరవం ఈ ప్రకటనలో లేదని అనిపిస్తుంది. సాయుధ పోరాటంతో తెలంగాణ విలీన మరియు స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఆ పేరుతో ధైర్యంగా ఎందుకు జరపలేక పోతున్నారో, అరకొరగా అర్థమనస్సుతో ఎందుకు జరుపుతున్నారో సమాధానం చెప్పాలి. ఆనాడు ఖాసీం రజ్వీ నాయకుడుగా ఉన్న ఈనాటి ఎం.ఐ.ఎం. నేతలకు ఆగ్రహం కలుగుతుందనా? లేక మరేదైనా కారణం ఉన్నదా అనే సమాధానం చెప్పాలి. దీన్ని అసరాగా తీసుకొని ఈనాటి బిజెపి మరియు ఆర్‌ఎస్‌ఎస్‌లు ఆనాటి తెలంగాణ సాయుధ పోరాటాన్ని హిందూ, ముస్లింల మధ్య ఘర్షణలుగా చిత్రీకరించడానికి ప్రయత్నిస్తూ తాము రాజకీయంగా తెలంగాణలో బలపడటానికి ఈ ఘటనను ఉపయోగించుకుంటున్నాయి. ఆనాటి తెలంగాణ పోరాటంలో, అలాగే దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఎటువంటి పాత్ర లేని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు తెలంగాణ పోరాటంలో తమ పాత్ర లేదని ఒప్పుకుంటూనే గత పోరాటాన్ని స్మరించుకోవడం తప్పుకాదని విచిత్ర వాదనలు తీసుకొస్తున్నారు. గత పోరాటాలను, త్యాగాలను న్యాయబద్ధంగా స్వీకరిస్తే తప్పులేదు. కానీ రాజకీయ కుట్రతో పోరాట స్వరూపాన్ని వక్రీకరించి లబ్ధిపొందడానికి ప్రయత్నం చేయడమే పెద్ద తప్పు మరియు ఘోరమైన నేరం. ప్రారంభంలో పేర్కొన్నట్లుగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం పేద, బడుగు, బలహీనవర్గాలు సమిష్టిగా నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, ఫ్యూడల్ ప్రభువుల అణిచివేతలకు, దోపిడీలపై జరిపిన పోరాటం. ఈ పోరాటంలో హిందువులు, ముస్లింలు అన్నదమ్ములవలె పాల్గొన్నారు. ఈ పోరాటానికి మతం రంగు పులమడమంటే రానున్న తరాలకు తెలంగాణ వీర చరిత్రను అందకుండా చేసే కుట్ర ఇందులో దాగివున్నది. కానీ ఈనాటి కాంగ్రెస్ ప్రభుత్వం బిజెపి ఉచ్చులో పడకుండా తెలంగాణ ప్రజల పోరాటాలకు, సాంస్కృతిక, సామాజిక ఉద్యమాలకు ప్రేరణ ఇచ్చిన ఆనాటి తెలంగాణ సాయుధ పోరాట ఫలితమైన విలీన దినోత్సవాన్ని అధికారికంగా జరపాలి. తెలంగాణ సాయుధ పోరాట గాథలు స్ఫురించేలా, అసువులు బాసిన వీరుల, కమ్యూనిస్టుయోధుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకంగా, ధైర్యం గా, అధికారికంగా విలీన దినోత్సవాన్ని జరపాలి. (తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న కమ్యూనిస్టు యోధులను అప్పటి కేంద్ర ప్రభుత్వం గుర్తించి భారత కమ్యూనిస్టు పార్టీ డిప్యూటి ప్రధాన కార్యదర్శిగా ఉన్న నలమల్ల గిరిప్రసాద్ ఆధ్వర్యంలో స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేసి వేలాది మందికి పెన్షన్ సౌకర్యం కల్పించిన విషయాన్ని గుర్తుచేస్తున్నాను.) తెలంగాణ పోరాట చరిత్రను రాష్ట్ర పాఠ్యాంశాల్లో, అలాగే చిత్తశుద్ధి ఉంటే బిజెపి కూడా కేంద్ర పాఠ్యాంశాలలోను చేర్చాలి. సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన త్రిమూర్తులు రావినారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూంమోహియుద్దీన్‌ల విగ్రహాలను ట్యాంక్ బండ్‌పై ఒకే చోట ఏర్పాటు చేయాలి. దొడ్డి కొమరయ్య, షేక్ బందగీ, బొమ్మగాని ధర్మభిక్షం, చాకలి ఐలమ్మ లాంటి యోధల విగ్రహాలను ముఖ్య కూడలిలో ఏర్పాటు చేయాలి. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకంటే అత్యధిక మెజార్టీ సాధించి, ఆయన కోరిక మేరకు పార్లమెంట్ భవనంలోకి మొదటడుగు వేసిన రావి నారాయణ విగ్రహాన్ని పార్లమెంట్‌లో పెట్టాలి. పోరాట కేంద్రాలను భావితరాలవారికి స్మృతి చిహ్నంగా మార్చాలి. విలీన దినోత్సవాన్ని అధికారికంగా జరిపితే దొరలు, దొరతనం ఉన్న పెద్దలు కొంత మంది రాజకీయ నాయకులు మినహా హిందువు అయినా, ముస్లిం అయినా యావత్ తెలంగాణ సమాజం పులకించే హృదయాలతో హర్షిస్తారు. గర్వంగా ఆస్వాదిస్తారు.

ఆనాటి కమ్యూనిస్టుల త్యాగాలు పోరాటాలు లేకుండా విలీనం జరిగేదా? ఆనాటి విలీనం లేకుండా నేటి తెలంగాణ రూపం ఎలా వుండేదో!

# తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

**శాసనసభలో సిపిఐ పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు డిమాండ్**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ భారతదేశంలో విలీనమైన సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా 'తెలంగాణ విలీన దినోత్సవం'గా నిర్వహించాలని సిపిఐ శాసనసభా పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రల్లో ఇదే సందర్భాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నప్పుడు తెలంగాణలో ఎందుకు భయపడాల్సి వస్తోందని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని గుర్తించడం అంటే ఒక రాజకీయ పార్టీని గౌరవించడం కాదని, తెలంగాణ చరిత్ర, సంస్కృతి, ప్రజల త్యాగాలను గౌరవించడంగా చూడాలని అన్నారు. ఆనాటి పోరాటంలో అమరులైన అన్ని వర్గాల ప్రజల త్యాగాలను చరిత్రలో సముచితంగా నమోదు చేయాలని ఆయన కోరారు. ఈ విషయాన్ని శాసనసభలో బుధవారం సాంబశివరావు ప్రస్తావించారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని హిందూ–ముస్లిం ఘర్షణగా కాకుండా భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరి, పేదలపై అణచివేతకు వ్యతిరేకంగా కొనసాగిన ప్రజా పోరాటంగా చూడాలని కోరారు. తెలంగాణ పోరాటానికి పిలుపునిచ్చిన ముగ్గురిలో రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం మొహియుద్దీన్ కూడా ఉన్నారని గుర్తు చేశారు. ఈ పోరాటంలో ప్రముఖ పాత్రికేయుడు షోయబుల్లా ఖాన్, షేక్ బందగి తదితరులు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. ఈ పోరాటంలో హిందువులతో పాటు పెద్ద సంఖ్యలో ముస్లింలు కూడా ప్రాణాలు కోల్పోయారని, ఈ పోరాటాన్ని రెండు మతాల మధ్య జరిగిన ఘర్షణగా చిత్రీకరించడం సరైందికాదన్నారు.'దున్నేవాడిదే భూమి' అనే నినాదంతో పేదలు, రైతులు సాగించిన పోరాటంగా దానిని గుర్తించాలని కోరారు. భూస్వాములకు, పేదలకు మధ్య జరిగిన పోరాటంగా, వెట్టికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంగా, ప్రజల హక్కుల కోసం సాగిన పోరాటంగా చరిత్రలో దాని స్థానాన్ని గుర్తించాలని అన్నారు. సెప్టెంబర్ 17న అధికారిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా తెలంగాణ పోరాటంలో ప్రాణత్యాగం చేసిన వారి చరిత్రను కూడా ప్రజలకు తెలియజేయాలని ఆయన సూచించారు. దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం మొహియుద్దీన్, నల్లమల్ల గిరిప్రసాద్, బొమ్మగాని ధర్మభిక్షం కొమరం భీమ్‌లాంటి ఎందరో త్యాగాలను తెలంగాణ చరిత్రలో భాగంగా గుర్తించాలని పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రభావం తెలంగాణ సాంస్కృతిక, సాహిత్య ఉద్యమాలపై కూడా ఉందని అన్నారు. దాశరథి, సుద్దాల హనుమంతు, గద్దర్, గోరేటి వెంకన్న, అందెశ్రీ, జయరాజ్, సుద్దాల అశోక్ తదితర కవులు, కళాకారులు తెలంగాణ ప్రజా ఉద్యమాలకు తమ రచనలు, కళారూపాల ద్వారా ఊతమిచ్చారని గుర్తు చేశారు.

# మైనారిటీ విద్యార్థులకు మెరుగైన శిక్షణ, కాంట్రాక్టు సిబ్బంది భర్తీ

**మంత్రి అజారుద్దీన్ ప్రకటన**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని మైనారిటీ విద్యార్థుల విద్యాభివృద్ధి, పోటీ పరీక్షల శిక్షణ కోసం మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్టడీ సర్కిళ్లు, కెరీర్ గైడెన్స్ సెల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ తెలిపారు. శాసనసభలో ఎంఐఎం సభ్యుడు కౌసర్ మొహియుద్దీన్, బిజెపి సభ్యుడు పాల్వాయి హరీశ్ బాబు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. మైనారిటీ విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల్లో మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న పోటీ పరీక్షల శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా సివిల్ సర్వీసెస్‌కు 100 మంది విద్యార్థులకు కోచింగ్ అందిస్తున్నామని, ఏఈ (అసిస్టెంట్ ఇంజినీర్) తదితర పరీక్షలకు 153 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. హైదరాబాద్లో 16 నెలల బేసిక్ ఫౌండేషన్ కోర్సును కూడా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సభ్యులు లేవనెత్తిన అంశాలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని, మంత్రి అజారుద్దీన్ హామీ ఇచ్చారు. మైనారిటీ గురుకుల పాఠశాలల్లో రెగ్యులర్ సిబ్బంది నియామక ప్రక్రియను త్వరలో చేపడతామన్నారు. అలాగే వెనుకబడిన జిల్లాల్లోని పరిస్థితులను పరిశీలించేందుకు తనకు వీలైన సమయంలో ఆయా జిల్లాల్లో పర్యటించి అవసరమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లోని బాలుర వసతి పాఠశాలల్లో సిబ్బంది సమస్య ఉందని, బాలుర పాఠశాల 1లో కేవలం తొమ్మిది మంది రెగ్యులర్ సిబ్బంది ఉండగా, 19 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారని హరీశ్‌బాబు తెలిపారు. బాలుర పాఠశాల2లో కూడా ఇదే పరిస్థితి ఉందని, ఒక రెగ్యులర్ ఉద్యోగికి ఇద్దరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉన్న పరిస్థితి నెలకొందని సభ దృష్టికి తీసుకొచ్చారు. మైనారిటీ విద్యా సంస్థల్లో పరిపాలన, పర్యవేక్షణ మెరుగుపడేందుకు రెగ్యులర్ సిబ్బంది నియామకాలు చేపట్టాలని సభ్యులు కోరారు. ముఖ్యంగా వెనుకబడిన జిల్లాల్లో ఉన్న విద్యా సంస్థల పరిస్థితిని పరిశీలించేందుకు మంత్రి స్వయంగా పర్యటించాలని విజ్ఞప్తి చేశారు. ఇదే సందర్భంగా కాగజ్ నగర్‌లో గత ప్రభుత్వం నిర్మించిన ఐటిఐ భవనం ప్రస్తుతం ఖాళీగా ఉందని సభ్యులు ప్రస్తావించారు. ఆ భవనాన్ని అధునాతన సాంకేతిక కేంద్రంగా మార్చి మైనారిటీ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**అసెంబ్లీ మీడియా పాయింట్**

## అసెంబ్లీకి రాకుండా తప్పించుకునేందుకు కారణాలు వెతుక్కొంటున్నారు

**బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై విప్ వేముల విమర్శ**

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ప్రధాన ప్రతిపక్ష బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు 22ఎ చర్చపై అసెంబ్లీ సమావేశాలకు రాకుండా ఉండేందుకు కారణాలు వెతుక్కొంటున్నారని ప్రభుత్వ విప్ వేముల వీరేశం విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బుధవారం ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు జబర్దస్ కార్యక్రమం మాదిరిగా మాక్ అసెంబ్లీ పెట్టి 22ఎ పై మాట్లాడలేదన్నారు. ఆ మాక్ అసెంబ్లీలో కూడా స్పీకర్ దళితుడే ఉన్నందున కెసిఆర్ మాక్ అసెంబ్లీకి కూడా హాజరుకాలేదన్నారు.

**22ఎపై అవాస్తవ ప్రచారం : విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు 22ఎపై అవాస్తవ ప్రచారం చేస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. ధరణితో జరిగిన తప్పులను ప్రభుత్వం సరిదిద్దే ప్రయత్నం చేస్తుంటే నిందలు వేయడం ఆశ్చర్యంగా ఉన్నదన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బుధవారం ఆయన మాట్లాడుతూ హైకోర్టు సూచన మేరకు కొన్ని ప్రైవేట్ భూములు నిషేధిత జాబితాలో పెట్టామన్నారు. కోటి ఎకరాల భూమిని 22ఎలో పెట్టామనడం అవాస్తవమన్నారు. కేవలం 3.60 లక్షల ఎకరాల కోర్టు కేసులు, వివాదాలున్న భూములను మాత్రమే నిషేధిత జాబితాలో పెట్టామని స్పష్టంచేశారు.

**అసెంబ్లీ నిర్వహణ తీరుపై అసంతృప్తి : ఎమ్మెల్యే ఏలేటి**

తెలంగాణ అసెంబ్లీ నడిపే తీరుపై చాలా అసంతృప్తిగాఉన్నామని బిజెపి శాసనసభా పక్ష నాయకులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బుధవారం ఆయన మాట్లాడుతూ మూడున్నర గంటలు మాట్లాడిన ముఖ్యమంత్రి గత ప్రభుత్వం చేసిన అక్రమాలపై చర్యలు ఎందుకు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. లక్షలాది ఎకరాల ప్రభుత్వ భూములను కొల్లగొడితే దానిపై ఎందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవడం లేదన్నారు.

# ఉద్యాన సాగుకు ప్రభుత్వం ఊతం

- ఉద్యాన రంగ అభివృద్ధికి రూ.1,000 కోట్ల కార్యాచరణ
- 2 లక్షల ఎకరాల్లో కొత్తగా పంటలు
- ఆయిల్‌పామ్‌కు ఎకరానికి రూ.46,250 వరకు ప్రోత్సాహకాలు : మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు, పంటల వైవిధ్యీకరణలో భాగంగా ఉద్యాన పంటల సాగును ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సహిస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగుపై సభ్యులు ఆది నారాయణ జారే, బి.మనోహర్ రెడ్డి, గండ్ర సత్యానారాయణ రావు, చిక్కుడు వంశీ కృష్ణ, వేముల వీరేశం, కసిరెడ్డి నారాయణ రెడ్డి అడిగిన ప్రశ్నలకు ఆయన మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్రంలో 2026–27 ఆర్థిక సంవత్సరంలో వివిధ పథకాల కింద అదనంగా 2 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలను సాగులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించామన్నారు. ఉద్యాన రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ పథకాలను అనుసంధానిస్తూ ఈ ఏడాది రూ.1,000 కోట్లతో సమగ్ర కార్యాచరణను అమలు చేస్తున్నామని తెలిపారు. రైతులను పండ్లు, కూరగాయలు, ఆయిల్‌పామ్ వైపు మళ్లించేందుకు విస్తృత అవగాహన, శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పంటల సాగుకు అవసరమైన మొక్కలు, ఎరువులు, మల్చింగ్, షేడ్నెట్, ఫామ్ పండ్లు, శీతల గిడ్డంగులు, శాశ్వత పందిళ్లు, బిందు, తుంపర సేద్యం పరికరాలను నిబంధనల ప్రకారం 40 శాతం నుంచి 90 శాతం వరకు రాయితీపై అందిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మొక్కలు, కోత అనంతర నిర్వహణకు రూ.150 కోట్లు, బిందుతుంపర సేద్యానికి రూ.243 కోట్లు, ఆయిల్‌ఫామ్ అభివృద్ధికి రూ.261 కోట్లు కేటాయించామన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు ఉచితంగా ఫామ్‌పండ్లు తవ్వుకోవచ్చని సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 88,282 మంది రైతులు 3.20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని తుమ్మల తెలిపారు. మొక్కలు, డ్రిప్, మొదటి నాలుగేళ్లకు ఎరువులు, అంతర పంటల సాగు కోసం ఎకరానికి రూ.46,250 వరకు ప్రోత్సాహకాలు ఇస్తున్నామని తెలిపారు. ఆయిల్‌ఫామ్‌కు మార్కెటింగ్ ఇబ్బందులు ఉండవని, కోతుల బెడద కూడా తగ్గుతుందన్నారు. ఆయిల్‌పామ్ చట్టం1993 ప్రకారం ఫ్యాక్టరీ జోన్ కేటాయించిన కంపెనీలు ప్రభుత్వం నిర్ణయించిన ధరకే గెలలను కొనుగోలు చేయాల్సి ఉంటుందని, ప్రస్తుతం టన్నుకు రూ.24,025 ధర అందుతోందని మంత్రి తెలిపారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్‌కు కనీస హామీ ధర ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రస్తుతం అశ్వారావుపేట, అప్పారావుపేట, నర్మెట్ట, అంజనాపురంలలో 4 ఆయిల్‌పామ్ మిల్లులు పనిచేస్తుండగా, కల్లూరుగూడెం, ఇంచెర్ల, పెద్దరాతు, రేగొండ, చిన్నపాక, యాచారం, శంకరంరెడ్డిపల్లి ప్రాంతాల్లో మరో ఆరు మిల్లుల నిర్మాణం వేగంగా జరుగుతోందని, వచ్చే ఏడాదికి ఇవి అందుబాటులోకి వస్తాయన్నారు.

# ఆర్‌డిఒ, తహసీల్దార్ కార్యాలయాలకు కొత్త భవనాలు

**రూ.640 కోట్లతో నిర్మాణాలు : మంత్రి పొంగులేటి**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని తహసీల్దార్ (ఎంఆర్ఒ), రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డిఒ) కార్యాలయాలకు కొత్త భవనాల నిర్మాణం చేపడుతున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. శాసనసభలో సభ్యులు కాంగ్రెస్ డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి, వీర్లపల్లి శంకర్, కాలే యాదయ్య, డాక్టర్ సంజీవ్, బిజెపి సభ్యులు రాకేష్ రెడ్డి, పాయల్ శంకర్, పాల్వాయ్ హరీశ్ బాబు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా అనేక చోట్ల రెవెన్యూ కార్యాలయాలు అద్దె భవనాల్లో, శిథిలావస్థకు చేరిన భవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెవెన్యూ కార్యాలయాల పరిస్థితిని సమీక్షించి, వాటిని గౌరవప్రదంగా ఉండేలా ఆధునిక భవనాలు నిర్మించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ఇందుకోసం సుమారు రూ.640 కోట్లతో నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఇప్పటికే రెండు విడతల్లో పలు కార్యాలయాల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చామని, కొన్ని చోట్ల టెండర్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఎంఆర్ఒ, ఆర్‌డిఒ కార్యాలయాలను ఒకే సముదాయంలో నిర్మిస్తే ప్రజలకు మరింత సౌకర్యంగా ఉంటుందని పలువురు ఎమ్మెల్యేలు చేసిన విజ్ఞప్తులను ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో సమగ్రంగా కార్యాలయాల నిర్మాణం చేపడతామని చెప్పారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, రాకేష్ రెడ్డి, పాయల్ శంకర్, పాల్వాయి హరీశ్ బాబు, శంకర్, నాగరాజు, యాదయ్య, సంజీవరెడ్డి తదితర సభ్యులు తమ నియోజకవర్గాల్లో ఎంఆర్ఒ, ఆర్‌డిఒ కార్యాలయాల ఏర్పాటుపై సభలో ప్రస్తావించారు. ఆయా ప్రాంతాల్లో అవసరాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. కొన్ని ప్రాంతాల్లో అసైన్‌మెంట్ భూముల సమస్యలు ఉన్నాయని, వాటిని పరిశీలించి పరిష్కారం చూపుతామన్నారు. కాలాపూర్‌కు సంబంధించి ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రి, కార్యాలయాల ఏర్పాటుపై వచ్చిన ప్రతిపాదనను కూడా మరోసారి పరిశీలిస్తామని రామ్మోహన్ రెడ్డికి హామీ ఇచ్చారు. ఎంఆర్ఒ, ఆర్‌డిఒ కార్యాలయాలతో పాటు ఎంపిడిఒ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ల నిర్మాణాల అంశాన్ని కూడా సభ్యులు లేవనెత్తారన్నారు. ఒకే ప్రాంగణంలో అన్ని శాఖల కార్యాలయాలు ఏర్పాటు చేయడం కంటే, అందుబాటులో ఉన్న భూమి, అవసరాలను బట్టి ఆయా శాఖలతో సమన్వయం చేసుకుని పరిష్కారం చూపుతామని తెలిపారు. రాకేష్ రెడ్డి ప్రస్తావించిన ప్రాంతంలో ఎంఆర్ఒ, ఆర్‌డిఒ కార్యాలయాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైన ప్రతిచోటా కార్యాలయాల నిర్మాణం చేపడతామని, సభ్యులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ భవనం అసంపూర్తిగా ఉండటంపై ఎమ్మెల్యే పాయల్ శంకర్ అడిగిన ప్రశ్నకు స్పందించిన, కలెక్టరేట్ నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# '22ఎ', రెవెన్యూ వ్యవస్థపై వాడీవేడి చర్చ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శాసనసభలో నిషేధిత భూముల చట్టం 22ఎ, రెవెన్యూ వ్యవస్థపై బుధవారం తీవ్రస్థాయిలో వాడీవేడీ చర్చ జరిగింది. బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వేముల వీరేశం, ఆది శ్రీనివాస్, నవీన్ యాదవ్, రాంచంద్ర నాయక్ ఈ అంశంపై సభలో తమ అభిప్రాయాలను వినిపించారు.

**ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికను బహిర్గతం చేయాలి : ఏలేటి మహేశ్వర్ రెడ్డి**



రాష్ట్రంలో 22ఎ అంశం, ధరణి వ్యవహారంలో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం వెంటనే ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికను బహిర్గతం చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఫోరెన్సిక్ ఆడిట్‌లో లక్షల ఎకరాల భూముల బదిలీలు, వేల కోట్ల రూపాయల ప్రభుత్వ నష్టం బయటపడినట్లు ప్రభుత్వం స్వయంగా పేర్కొన్నప్పటికీ ఇప్పటి వరకు బాధ్యులపై చర్యలు తీసుకోలేదని విమర్శించారు. 23 లక్షల ఎకరాల భూములు వేలాది లావాదేవీల ద్వారా బదిలీ అయినట్లు ప్రభుత్వం చెప్పిందని, అవి ఎవరి పేర్లపై బదిలీ అయ్యాయో వెల్లడించి, అక్రమ రిజిస్ట్రేషన్‌లను రద్దు చేసి, ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరారు. 64 లక్షల లావాదేవీల వల్ల రాష్ట్ర ఖజానాకు వేల కోట్ల రూపాయల నష్టం జరిగిందనే అంశంపైనా ఇప్పటి వరకు ఎలాంటి విచారణ కమిటీ ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. ఫీనిక్స్ టెక్ జోన్‌కు సంబంధించిన భూములు, టిఎస్ఐఐసి పరిధిలోని పరిశ్రమల భూములను డీనోటిఫై చేసి నివాస అవసరాలకు మార్చిన వ్యవహారంపై కూడా ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పరిశ్రమల కోసం కేటాయించిన భూములు రాత్రికి రాత్రే రెసిడెన్షియల్ జోన్‌గా మారడం వెనుక ప్రభుత్వంలో ఉన్న కీలక వ్యక్తుల పాత్రపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే పుప్పాలగూడ, ఇతర ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ తిరస్కరించిన భూములకు తర్వాత అనుమతులు ఎలా లభించాయో ప్రభుత్వం వివరణ ఇవ్వాలన్నారు. ప్రస్తుతం 22ఎ జాబితాలో ఉన్న సాధారణ ప్రజల కాలనీలు, అపార్ట్‌మెంట్‌ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామన్నారు.

**గంగుల, ఎర్రబల్లి , సబితలు భూములు కబ్జా : ఎమ్మెల్యే కె.శంకర్**

శాసనసభలో 22ఎ అంశంపై జరిగిన చర్చలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కె.శంకర్ బిఆర్ఎస్ నాయకులపై భూ అక్రమాలకు సంబంధించిన తీవ్ర ఆరోపణలు చేశారు. గతంలో పనిచేసిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఒక్కొక్కరు 50 నుంచి 500 ఎకరాల వరకు ఆక్రమించారని ఆరోపించారు. కొత్త రెవెన్యూ చట్టం తీసుకువచ్చి వీరి నుంచి భూములను రికవర్ చేయాలని, అప్పుడే తెలంగాణ ప్రజలకు న్యాయం జరుగుతుందన్నా రు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్వగ్రామమైన తిమ్మాపూర్‌లో భూదాన్ ఉద్యమం కింద సుమారు 70 ఎకరాల భూమిని రైతులు దానం చేశారని తెలిపారు. అయితే గత ప్రభుత్వ హయాంలో ఆ భూదాన్ భూముల్లో భాగమైన సుమారు 30 ఎకరాలను ధరణిలో నమోదు చేసి కొందరు వ్యక్తుల పేర్లకు పట్టాలు మంజూరు చేశారని ఆరోపించారు. ప్రస్తుతం ప్రభుత్వం ఆ భూములను మళ్లీ 22ఎ జాబితాలో చేర్చి రక్షణ చర్యలు చేపట్టిందని చెప్పారు. అక్కడ ప్రాతినిధ్యం వహించిన స్థానిక మాజీ మంత్రి సబితా ఇంద్రా రెడ్డికి ఈ 30 ఎకరాల ఆక్రమణతో సంబంధం ఉందో లేదో అసెంబ్లీ వేదికగా స్పష్టం చేయాలన్నారు. శంషాబాద్ మండలం బాద్రుగూడ పరిధిలోని (సర్వే నెంబర్లు 28, 62) సుమారు 650 ఎకరాల ప్రభుత్వ లావానీ భూమిని మాజీ మంత్రులు గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, సబితా ఇంద్రారెడ్డి కుటుంబ సభ్యులు కలసి ఆక్రమించుకున్నారని ఆరోపించారు. 1956 సేత్వార్ ప్రకారం లాతీఫ్ ఉన్నీసా బేగం పేరిట ఉన్న ఈ భూములకు 2006లో సివిల్ కోర్టు డిక్లరేషన్ రాగా, అనంతరం ధరణి లోపాలను ఆసరాగా చేసుకుని సెటిల్‌మెంట్‌లు చేస్తూ రూ.కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను కాజేసారన్నారు. గనులే కాకుండా బిఆర్ఎస్ నేతలు భూములను కూడా మింగేశారని విమర్శించారు. మోయినాబాద్ మండలం అజీజ్ నగర్ (సర్వే నంబర్ 177/3) లోని 3.5 ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూమిని బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఆక్రమించి జిఒ నెంబర్ 111 నిబంధనలకు విరుద్ధంగా ఫామ్ హౌస్ నిర్మించుకున్నారని శంకర్ ఆరోపించారు. ఆ ఫామ్ హౌస్ అసాంఘిక కార్యక్రమాలకు, డ్రగ్స్ పార్టీలకు అడ్డాగా మారిందని, ఇటీవల స్పెషల్ స్క్వాడ్ పోలీసులు దాడులు చేసి పట్టుకున్న విషయాన్ని గుర్తుచేశా రు.

**మాక్ అసెంబ్లీలు పెట్టి నాటకాలాడుతున్నారు : వేముల**


ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్ సభకు రా కుండా తప్పించుకోవడానికే మాక్ అసెంబ్లీల పేరుతో నాటకాలాడుతోందని కాంగ్రెస్ ఎమ్మెల్యే వేముల వీరేశం విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో 18 లక్షల ఎకరాల భూముల సమస్యను పరిష్కరించకుండా జటిలం చేశారని మండిపడ్డారు. ఎల్.బి.నగర్, లయోలా కాలేజ్ భూములు, కాచిగూడలోని వారసులు లేని ఆస్తులను దారదత్తం చేసి ధరణి పోర్టల్ ద్వారా అనేక అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. విఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేసి రెవెన్యూ వ్యవస్థను అస్తవ్యస్తం చేసిన ఘనత బిఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు.



**3.60 లక్షల ఎకరాలు మాత్రమే నిషేధిత జాబితాలో ఉన్నాయి:ఆది శ్రీనివాస్**

22ఎ అంశంపై ప్రతిపక్షాలు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కోటి ఎకరాల భూములను 22ఎలో పెట్టారనడం పూర్తిగా అసత్యమని, కేవలం కోర్టు కేసులు, తీవ్ర వివాదాలు ఉన్న 3.60 లక్షల ఎకరాల భూములను మాత్రమే నిషేధిత జాబితాలో ఉందని స్పష్టం చేశారు. ధరణి పేరు తో గత ప్రభుత్వం దోచుకునే ప్రయత్నం చేసిందని, అధికారుల తప్పిదాల వల్ల జరిగిన పొరపాట్లను తమ ప్రభుత్వం సరిదిద్దుతోందని తెలిపారు.

**నకిలీ పట్టా భూమిని జూనియర్ ఎన్‌టిఆర్‌కు అంటగట్టారు : నవీన్**



22ఎ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికి ప్రతిపక్షాలు కుట్రపూరితంగా ప్రయత్నిస్తున్నాయని కాంగ్రెస్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ అన్నారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం ఈదుల నాగులపల్లి గ్రామంలోని ప్రభుత్వ భూములకు నకిలీ పట్టాలు సృష్టించి, దాదాపు 150 ఎకరాలను ప్రముఖ సినీ నటుడు జూనియర్ ఎన్‌టిఆర్‌తో పాటు మరికొంత మందికి అంటగట్టారని శాసనసభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ భారీ అక్రమ వ్యవహారంపై తక్షణమే పూర్తిస్థాయి విచారణ జరిపి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ చారిత్రక భూ సంస్కరణలను గుర్తుచేశారు. పేదవాడి జీవితాల్లో వెలుగులు నింపేలా కాంగ్రెస్ పార్టీ అనేక సామాజిక, భూ సంస్కరణలు తీసుకువచ్చిందని, భూమి లేని పేదలకు భూములు పంచి లక్షలాది కుటుంబాలకు భరోసాతో పాటు ఉజ్వల భవిష్యత్తును ఇచ్చిందన్నారు. పరిశ్రమలు, కంపెనీలు, భారీ సంస్థలకు భూములు కేటాయించి, ఆ భూమిని దేశ నిర్మాణానికి ఉపయోగించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి భూమి అంటే కేవలం రిజిస్ట్రేషన్ కాగితం మాత్రమే కాదని, అది పేదవాడి భవిష్యత్తు, రైతు హక్కు, దేశ అభివృద్ధికి సూచిక అని నవీన్ యాదవ్ అన్నారు.

# ఆర్‌టిసిని ఆర్థికంగా దెబ్బతీయొద్దు

**• బకాయిలు వెంటనే చెల్లించాలి • శాసనసభలో బిజెఎల్‌పి ఉపనేత పాయల్ శంకర్**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉచిత పథకాల అమలు పేరుతో వాటిని నిర్వహిస్తున్న సంస్థల ను ఆర్థికంగా బలహీనపరిచే పరిస్థితి రాకూడదని బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శాసనసభలో ఆర్‌టిసి అంశంపై మాట్లాడిన ఆయన, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం మంచిదే అయినప్పటికీ, ఆ భారం సంస్థల మనుగడను దెబ్బతీయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో విద్యుత్ సంస్థలతో పాటు ఆర్‌టిసి కూడా ప్రజలకు ఎంతో కీలకమైన సేవలు అందిస్తున్న సంస్థ అని అన్నారు. మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం సంతోషకరమేనని, అయితే ఆర్‌టిసి ఆర్థిక పరిస్థితిని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. దేశంలోని ప్రజా రవాణా వ్యవస్థల్లో తెలంగాణ ఆర్‌టిసికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఇలాంటి గొప్ప రవాణా వ్యవస్థను ప్రభుత్వం కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. గతంలో ప్రభుత్వ కార్యక్రమాలు, సభలు, సమావేశాల కోసం ఆర్‌టిసి బస్సులను పెద్ద సంఖ్యలో వినియోగించుకున్నప్పటికీ, వాటికి చెల్లించాల్సిన అద్దెల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రిటైర్డ్ అయిన ఆర్‌టిసి కార్మికుల కు దాదాపు రూ.1000 కోట్ల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉందని ఆయన తెలిపారు. ఏడు, ఎనిమిదేళ్లుగా ఈ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆర్‌టిసిలో పనిచేసిన వారికి రావాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి ఆర్‌టిసికి రావాల్సిన నిధులను కూడా తక్షణమే మంజూరు చేయాలని కోరారు.

# ఆర్మూర్ ప్రజాసమస్యలపై స్పందించకుంటే రాజీనామాకు సిద్ధం

**శాసనసభలో బిజెపి ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్మూర్ నియోజకవర్గంలోని తీవ్రమైన ప్రజాసమస్యలపై ప్రభు త్వం నిర్లక్ష్యం వహిస్తే తన పదవికి రాజీనామా చేయడానికి కూడా వెనుకాడబోనని బిజెపి సభ్యుడు రాకేష్ రెడ్డి శాసనసభలో ఆవేదన వ్యక్తం చేశారు. శాసనసభ సభాపతిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఆర్మూర్ ప్రాంత సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చొరవ చూపుతుందన్నారు. పరిగి, కొడంగల్ వంటి ప్రాంతాలకు వేల కోట్ల రూపాయల పెట్టుబడులు, నిధులు వస్తున్నందుకు సంతోషమేనని, అయితే వంద సంవత్సరాల చరిత్ర కలిగిన ఆర్మూర్ ప్రాంతాన్ని మాత్రం తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తున్నారని రాకేష్ రెడ్డి ఆరోపించారు. నిజాం సాగర్ నీళ్లతో సస్యశ్యామలంగా వెలిగిన ఆర్మూర్ నేడు తీవ్ర కరువుతో అల్లాడుతోందని సభ దృష్టికి తీసుకెళ్లారు. ఇతర ప్రాంతాలకు ఇచ్చే మాదిరిగానే ఆర్మూర్ నియోజకవర్గానికి కూడా రూ. 27 కోట్లతో కూడిన ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ కాంప్లెక్స్‌ను తక్షణమే మంజూరు చే యాలని విజ్ఞప్తి చేశారు. సభ ముగిసే సమయానికి తనకు మరొక పది నిమిషాల వ్యవధి ఇవ్వాలని, ఆర్మూర్ ప్రజల నిరసనను తెలియజేస్తూ ఈ రోజే తన రాజీనామా లేఖను సమర్పించడానికి కూడా సిద్ధంగా ఉన్నానని వ్యాఖ్యానించారు.

# అవినీతిపై ప్రశ్నిస్తే వ్యక్తిగత దాడులా?

**'సిఎం' చెబుతున్నవి కొత్తవేమీ కాదు**

**బిఆర్ఎస్ ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అవినీతిపై ప్రశ్నిస్తే కెసిఆర్‌పైన, తమపైన సిఎం వ్యక్తిగత దాడులకు పాల్పడుతున్నారని, తమ ఆస్తులన్నీ ఎన్నికల అఫిడవిట్ లో స్పష్టంగా ప్రకటించామని, 'సిఎం' చెబుతున్నవి కొత్తవేమీ కాదని బిఆర్ఎస్ ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ నాయకుడు కేసీఆర్‌పైన అడ్డగోలుగా మాట్లాడుతున్నారని, బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 22 ఎ నిషేధిత జాబితాలో ఉన్న భూములను తొలగించేందుకు కమిటీ వేసి, మార్గదర్శకాలు విడుదల చేస్తామని సిఎం చెబుతున్నారు తప్ప, వీటికి స్పష్టమైన పరిష్కారం చూపలేదని బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు అన్నారు.కలెక్టర్లు దబా దబా సంతకాలు పెట్టి , 1999 నాటి పాత జాబితాను అప్‌లోడ్ చేశారని చెబుతున్న సీఎం, ఆ తప్పు చేసిన అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం విక్రయించిన హెచ్‌ఎండిఎ , యుఎల్‌సి భూములను కూడా నిషేధిత జాబితాలో పెట్టడం వల్లనే ఉద్రిక్త పరిస్థితి ఏర్పడిందని స్వయంగా సిఎం ఒప్పుకున్నారని, ప్రజలకు క్షమాపణలు చెప్పి,ఈ సమస్యలను ఎప్పుటి వరకు పరిష్కరిస్తారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలు, ఆరు గ్యారంటీల అమలుపై బిఆర్ఎస్ ప్రశ్నిస్తుంటే, సిఎం రేవంత్ రెడ్డి డైవర్షన్ రాజకీయాలకు తెరలేపుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే, బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను కుట్రపూరితంగా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేసిందని ఆరోపించారు.


తెలంగాణ ప్రభుత్వం
**పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం**
జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్, పి.ఐ.యు, ఖమ్మం

NIT No 15/2026-27 — e- ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు — dt: 15.09.2026

ఈ దిగువసంతకందారుచే MPLADS పథకము కింద మంజూరైన 01 అభివృద్ధి పనికు గాను అంచనా విలువ రూ.6.00 లక్షలు ఆన్‌లైన్ టెండర్స్ రిజిస్టర్డ్ కాంట్రాక్టర్స్ నుండి పిలువబడుతున్నవి. ఇతర వివరములు https://tender.telangana.gov.in/ నందు ది:17.09.2026 నుండి లభించును.

సం/- DISTRICT P.R. ENGINEER
PIU KHAMMAM

DIPR R.O. No. : 10121-PP/CL/ADVT/2026-27, Date: 16-09-2026

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ : మల్కాజ్‌గిరి జోన్**

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ & సమయం / బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| NIT No. 68/ EE-I/MKJZ/ MMC/2026-27 | నిర్వహణ పనులు ఇతరాలు-7 | రూ. 262.00 లక్షలు | 16.09.2026 ఉ.11.00గం.ల నుండి, 23.09.2026 ఉ.11.00గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-1, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి. |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ http://www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-1, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి.

DIPR R.O. No. : 10047-PP/CL/ADVT/2026-27, Date: 16-09-2026

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
అమీన్‌పూర్ సర్కిల్-47, శేరిలింగంపల్లి జోన్. eec47.ghmc@gmail.com

షార్ట్ టెండర్ నోటీసు నెం. Engg-29/CMC/AMPR-C-47/2026-27, తేది: 16.09.2026

| Sl. No. | NIT No. | పని పేరు / పనుల సంఖ్య | అంచనా విలువ / ఇసివి రూ.లక్షలలో | డౌన్‌లోడ్ ప్రారంభ తేది | బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం | ఇ.ఇ పేరు & చిరునామా |
|---|---|---|---|---|---|---|
| 1 | Engg-29/ CMC/AMPR- C-47/2026- 27, Dated: 16.09.2026 | 01- మల్లికార్జున బ్రమరాంభ టెంపుల్ ప్రక్కన సిసి ప్లాట్‌ఫారం ఏర్పాటు | 17.00 | 17.09.2026 ఉ.10.30 గం.లకు | 21.09.2026 ఉ.10.30 గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అమీన్‌పూర్ సర్కిల్-47, ఫోన్ నెం. 8008103600 & 7995007417 |
| | | మొత్తం రూ.లక్షలలో | 17.00 | | | |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అమీన్‌పూర్ సర్కిల్-47, ఎస్ఎల్‌పి జోన్, సిఎంసి.

DIPR R.O. No. : 10080-PP/CL/ADVT/2026-27, Date: 16-09-2026

## జిఒ 118బాధితులకు న్యాయం చేస్తాం



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్: జిఒ 118 బాధితులకు న్యాయం చేస్తూ, రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారు. ఎల్‌బి నగర్ నియోజకవర్గంలో ఇండ్ల రిజిస్ట్రేషన్ సమస్యతో దాదాపు 9500 మంది బాధితులు ఉన్నారని, 118 జిఒ ద్వారా సమస్యను పూర్తిస్థాయిలో త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కారం చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం పట్ల ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ వైస్ పర్సన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. జిఒ 118 బాధిత కాలనీ అందరికి రెగ్యులరేషన్ చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ సామాన్య, మధ్య తరగతి ప్రజల సంక్షేమం కోసమే పని చేస్తుందని పేర్కొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టులవే ప్రాణత్యాగాలు



ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టులే ప్రాణ త్యాగాలు చేశారని సిపిఐ మండల కార్యదర్శి కావలి సురేష్ అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్ళులర్పించారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రపై బిజెపి నాయకులు వక్రీకరించి మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కావలి నర్సింహ్మ, పి.నీలమ్మ, ఎస్.యాదగిరి, ఎస్.లక్ష్మయ్య,సూర్య పాల్గొన్నారు.

## అర్హులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు



ప్రజాపక్షం/కొత్తూరు: అర్హులైన పేదలందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్నామని కొత్తూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్లారం శేఖర్‌రెడ్డి వివరించారు. బుధవారం కొత్తూరు మండల పరిధిలోని సిద్దాపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ బాసునాయక్ ఆధ్వర్యంలో లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందించారు. కార్యక్రమంలో సిద్దాపూర్ ఉప సర్పంచ్ దుబ్బల యాదయ్య, జీపీఎ రాజు, డీలర్ మాణిక్యం, మాజీ ఎంపిటిసి జంగయ్యతోపాటు వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సంకెపల్లిగూడ రింగు రోడ్డు బాధితులకు న్యాయం చేయండి



ప్రజాపక్షం/షాబాద్: సంకెపల్లిగూడ రేడియల్ రింగు రోడ్డులో భూములు కోల్పోతున్న భూ బాధితులకు న్యాయం చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడిగే గజేందర్ గౌడ్ అన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని సంకెపల్లిగూడ గ్రామంలో రేడియల్ రోడ్డు భూ బాధితులకు భారతీయ కిసాన్ సంఘ్ తరఫున సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, గ్రామస్తులు శ్రీనివాస్ రెడ్డి, లింగం గౌడ్, శారద, స్వరూప, వెంకట్ రెడ్డి, పాండరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ వెలికి తీయడానికి పోటీలు



ప్రజాపక్షం/యాచారం : యాచారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 7 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పద్యాల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒ పాండు రంగా రెడ్డి, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి పద్యం పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టి.లక్ష్మయ్య, వెంకటేశం, విజయలక్ష్మి, జంగయ్య, శ్రీధర్, కుర్మిద్ద పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాండు రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎంబిబిఎస్‌లో సీటు సాధించిన సంజయ్



ప్రజాపక్షం/కేశంపేట: మండల పరిధిలోని లేమామిడి గ్రామానికి చెందిన జ్యోతి విద్యాసంస్థల డైరెక్టర్ దిద్దెల రఘుపతి వరూధిని దంపతుల కుమారుడు సంజయ్ ఎంబిబిఎస్ సీటు సాధించారు. వైద్య విద్యలో సీటు సాధించడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో వైద్యరంగంలో ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు.

## సర్పంచ్‌లకు వృత్తి శిక్షణ సామర్థ్యంపై సమావేశం

ప్రజాపక్షం/శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఈనెల 18 మండల స్థాయి సమీక్ష, సామర్థ్య వృత్తి శిక్షణ అనే అంశంపై మండల సర్పంచ్‌లకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వి.ప్రవీణ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరుకావాలని ఎంపిడిఒ ప్రకటనలో కోరారు.

# మైనారిటీ యువతకు ఉద్యోగాలే లక్ష్యం

### తొలి ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 177 మంది ఎంపిక



ప్రజాపక్షం/హైదరాబాద్ : మైనారిటీ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్ అండ్ కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్ కీలక ముందడుగు వేసింది. మైనారిటీ సంక్షేమ, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ మార్గదర్శకత్వంలో స్టడీ సర్కిల్ తొలిసారిగా నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 177 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఫాక్స్‌కాన్ ఇంటర్‌కనెక్ట్ టెక్నాలజీ (ఎఫ్‌ఐటి) సంస్థ సహకారంతో నిర్వహించిన ఈ డ్రైవ్‌కు 267 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజినీరింగ్, కామర్స్, సైన్స్, మేనేజ్‌మెంట్, పిజితో పాటు వివిధ వృత్తి విద్యా అర్హతలు కలిగిన అభ్యర్థులు ఎంపిక ప్రక్రియలో పాల్గొన్నారు. ఎంపికైన వారిలో 50 మందికి సెప్టెంబర్ 21న తొలి విడత ఆన్‌బోర్డింగ్ నిర్వహించనున్నారు. మిగిలిన 127 మందిని సంస్థ అవసరాలు, షెడ్యూల్‌కు అనుగుణంగా దశలవారీగా విధుల్లోకి తీసుకోనున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ, ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, అన్వర్ ఉల్ ఉలూమ్ కళాశాల, ప్రభుత్వ సిటీ కళాశాలతో పాటు పలు ఇంజినీరింగ్, ఫార్మసీ, డిగ్రీ, పిజి విద్యాసంస్థల విద్యార్థులు ఈ డ్రైవ్‌లో పాల్గొన్నారు. విద్య పూర్తిచేసుకున్న మైనారిటీ యువతను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలతో అనుసంధానించేందుకు భవిష్యత్‌లో మరిన్ని ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లు, కెరీర్ కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. స్టడీ సర్కిల్ డైరెక్టర్ తారిఖ్ అన్వర్, అదనపు డైరెక్టర్ సారా షత్తారి పర్యవేక్షణలో సిబ్బంది, అధ్యాపకుల సమన్వయంతో కార్యక్రమం నిర్వహించారు.

## ముగిసిన ఉచిత కంటి పరీక్షలు



ప్రజాపక్షం/కడ్తాల్: గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి ప్రజలకు కంటి వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా వారి ప్రాంతంలోనే ఉచిత వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌లోని ఎంబిఎ గార్డెన్స్‌లో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సహకారంతో శంకర నేత్రాలయ, చెన్నై వైద్య నిపుణుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరో మెగా ఉచిత కంటి వైద్య శిబిరానికి ఆరో రోజు ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. చివరి రోజు 940 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించగా, 680 మందికి పైగా ఉచిత కంటి అద్దాలు అందించారు. ఆరో రోజు మరో 25 మందిని కంటి శుక్లాల ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో దశరథ్ నాయక్, పోతుగంటి శంకర్, వైస్ ఎంపిపిఆనంద్, సర్పంచ్‌లు సేవ్య నాయక్, ప్రియ రమేష్, శ్రీనునాయక్, పంతునాయక్, హరిచంద్, భూనాద్, ఉపసర్పంచ్ పండునాయక్, వార్డు సభ్యులు నాగార్జున, దేవుల, నాయకులు గోపాల్, శక్రూ,శ్రీను, జగన్, బీక్యా నాయక్ పాల్గొన్నారు.

# సమన్వయంతో నిమజ్జన ఏర్పాట్లు

### సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్



ప్రజాపక్షం/రంగారెడ్డి: వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీసు, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ అధికారులను ఆదేశించారు. నిమజ్జన ఏర్పాట్లపై బుధవారం సైబరాబాద్ పోలీసులు, మున్సిపల్ అధికారులతో సంయుక్తంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం సిపి డాక్టర్ ఎం.రమేష్, జిహెచ్‌ఎంసి కమిషనర్ జి.సృజన, ఇతర మున్సిపల్ ఉన్నతాధికారులతో కలిసి కమిషనరేట్ పరిధిలోని పలు నిమజ్జన ప్రాంతాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఐడిపిఎల్, సూరారం తదితర చెరువుల వద్ద నిమజ్జనం కోసం చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు, మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సిపి సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, బారికేడ్లు, విద్యుత్ దీపాలు, గజ ఈతగాళ్ల ఏర్పాటు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. నిమజ్జన సమయంలో భారీగా తరలివచ్చే భక్తులు, వాహనాల రాకపోకలకు అనుగుణంగా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సిపి సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించాలని, అవసరమైన ప్రాంతాల్లో అదనపు పోలీసు సిబ్బందిని, బారికేడ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షిస్తూ అన్ని శాఖలు సమన్వయంతో విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ జోనల్ కమిషనర్లు, జాయింట్ సిపి సన్‌ప్రీత్ సింగ్, డిసిపి కోటి రెడ్డి, డిసిపి రీతిరాజ్, ట్రాఫిక్ డిసిపి శేషాద్రిణి రెడ్డి, ఎస్‌బి డిసిపి సువేంద్ర, అదనపు డిసిపిలు, ఎసిపిలు, పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు విద్యుత్, మున్సిపల్, రెవెన్యూ, దేవాదాయ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బిఆర్‌ఎస్‌లో ప్రతిఒక్కరికీ సముచిత గౌరవం

### ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
### తుమ్మలూర్‌లో కాంగ్రెస్, బిజెపిల నుంచి బిఆర్‌ఎస్‌లో భారీ చేరికలు




ప్రజాపక్షం/రంగారెడ్డి: బిఆర్‌ఎస్‌లో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, గుర్తింపు కల్పిస్తామని మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం మహేశ్వరం నియోజకవర్గం తుమ్మలూర్ గ్రామంలో బిజెపి కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఆయా పార్టీలకు రాజీనామ చేసి బిఆర్‌ఎస్‌లో చేరారు. గ్రామ బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కటికల శ్రీహరి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో పలువురు గులాబీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ బిఆర్‌ఎస్‌లో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, గుర్తింపు కల్పిస్తామని తెలిపారు. పార్టీలో చేరిన వారు ప్రజలతో మమేకమై గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. తుమ్మలూర్ గ్రామ అభివృద్ధికి సహకారం అందిస్తామని చెప్పారు. తుమ్మలూర్‌లో జరిగిన చేరికలతో పార్టీకి మరింత బలం చేకూరిందన్నారు. రాబోయేరోజుల్లో మరింత మంది నాయకులు, కార్యకర్తలు బిఆర్‌ఎస్‌లో చేరే అవకాశం ఉందని తెలిపారు. బిఆర్‌ఎస్‌లో చేరిన వారిలో మాజీసర్పంచ్ గంట నర్సిరెడ్డి, వార్డు సభ్యులు జెనిగే శివకుమార్, జెనిగే మహేష్, మాజీవార్డు సభ్యులు మద్ది శ్రీధర్‌రెడ్డి, మూల శేఖర్‌గౌడ్, ఏనుగుల రాములు తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ ఆఫీసులకు సొంత భవనాలు మంజూరు చేయండి : ఎమ్మెల్యే శంకర్



ప్రజాపక్షం/షాద్‌నగర్: పరిపాలన సౌలభ్యం కోసం కొత్త పంచాయతీలు, నూతన మండలాలలో సొంత భవనాలు లేక అధికారులు అవస్థలు పడుతున్నారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం శాసన సభ ప్రశ్నోత్తరాల సమయంలో ఈ విషయాన్ని ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళారు. షాద్‌నగర్ డివిజన్‌లోని జిల్లేడు చౌదరిగూడ, నందిగామ మండలాలతో పాటు రెవిన్యూ డివిజన్ కార్యాలయానికి సైతం సొంత భవనం లేదని తెలిపారు. ఫరూఖ్‌నగర్ తహశీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుందని, కొత్త భవనం మంజూరు చేయాలని కోరారు. ఫరూక్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామ సమీపంలోని సెరికల్చర్ శాఖకు చెందిన భవనంలోనే కొనసాగుతుందని, కొత్త భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. షాద్‌నగర్ డివిజన్ నుండే ప్రభుత్వానికి పెద్ద ఎత్తున రెవిన్యూ వస్తుందని, పెరుగుతున్న పరిపాలన అవసరాలకు అనుగుణంగా రెవిన్యూ ఆఫీసులకు నిధులు ఇచ్చేందుకు కృషి చేయాలని కోరారు. నందిగామ తహశీల్దార్ భవన నిర్మాణానికి రూ.2.25కోట్ల నిధులు మంజూరు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్, చటాన్‌పల్లి రైల్వే బ్రిడ్జినిర్మాణం, సిద్దాపూర్ చెత్త డంపింగ్‌యార్డు వంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి మరోమారు తీసుకువెళ్ళడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి



ప్రజాపక్షం/యాచారం : ప్రభుత్వం వార్డుమెంబర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఎంపిడిఒ రాధరాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సంధర్భంగా వార్డుమెంబర్ల ఫోరం మండల అధ్యక్షులు తలారి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో వార్డుమెంబర్లు అనేక సమస్యలతో సతమతమౌతున్నారని తెలిపారు. పంచాయతి కార్యదర్శులు వార్డుమెంబర్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారని ఆరోపించారు. గ్రామ పంచాయతీ నిధుల ఖర్చుల లెక్కలు అడిగే హక్కు వార్డు మెంబర్లకు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వార్డుమెంబర్లు వి.మహేశ్, సంజీవరెడ్డి, రామకృష్ణ, పోలే శివ, కంబాలపల్లి కుమార్, కొండ్రేడ్డి రాజు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

### వనస్థలిపురం ఎసిపి కాశిరెడ్డి




ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : డ్రగ్స్, గంజాయ్‌తో యువత జీవితాలను విచ్చినం చేసుకుంటున్నారని, వాటికి యువత దూరంగా ఉండాలని వనస్థలిపురం ఎసిపి పి.కాశిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్‌లో శ్రీకనుకదుర్గ అమ్మవారి ఆలయం, ఫ్రెండ్స్ యూత్ గణనాథుడు వద్ద యువతకు, కాలనీ ప్రజలకు మాదక ద్రవ్యాలపై అవగహన కల్పించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బడుగుల సుమతి ఆదేశాల మేరకు గణేష్ సురక్ష సంకల్ప్ కార్యక్రమంను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రజలను చైతన్యం పరుస్తూ, అవగహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎసిపి కాశిరెడ్డి తెలిపారు. డ్రగ్స్, గంజాయి లాంటి వ్యసనాలకు యువత బానిస అయి జీవితాలకు నాశనం చేసుకుంటున్నారని, ఈసంఘటనలు జరగకుండా తల్లిదండ్రులు వారి పిల్లలపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈగల్ ఫోర్స్ డిసిపి బిక్షపతిరావు, సిఐ రవిబాబు, ఎస్‌ఐ గౌతమ్, కోఆర్డినేటర్స్ మమత, సునీత, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, కాలనీ అధ్యక్షులు కరుణాకర్‌రెడ్డి, కనకదుర్గ దేవాలయం చైర్మన్ సంరెడ్డి భుజంగరెడ్డి పాల్గొన్నారు.

# ప్రకృతిని కాపాడేందుకు మొక్కలు నాటాలి

### సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు సురేందర్ గౌడ్



ప్రజాపక్షం/శంకర్‌పల్లి: ప్రాణవాయువును అందించే చెట్లు,మొక్కలు మానవాళి జీవన మనుగడకు ఎంతో అవసరమని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పర్వేద గ్రామ సర్పంచ్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు సురేందర్ గౌడ్ అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం శంకర్‌పల్లి మండలంలోని పర్వేద గ్రామంలో రాముని గుడి, పోచమ్మ గుడి వద్ద దైవ వృక్షాలు,పూల మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో, బిజెపి ఎండోమెంట్ ధార్మిక సెల్ ప్రోత్సాహంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్ గౌడ్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ప్రకృతిని పరిరక్షించాలనే సంకల్పంతో గ్రామాల్లోని ఆలయాల వద్ద మొక్కలు నాటుతున్న కార్యక్రమాలను అభినందించారు. ఇప్పటికే గుబ్బడి, పత్తేపురం, ఎల్లకొండ గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించి, తాజాగా పర్వేద గ్రామంలో కూడా ఆలయాల వద్ద దైవవృక్షాలు, పూల మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. గ్రామాభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇస్తున్న సర్పంచ్ సురేందర్ గౌడ్, గ్రామ ప్రజలను మొక్కలు నాటే కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. బీజేపీ ఎండోమెంట్ ధార్మిక సెల్ రంగారెడ్డి జిల్లా రూరల్ జాయింట్ కన్వీనర్, శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షులు నరేశ్ కుమార్ మాట్లాడుతూ, గ్రామాభివృద్ధికి సర్పంచ్ సురేందర్ గౌడ్ మానవతా దృక్పథంతో సేవలు అందిస్తున్నారని అన్నారు. మొక్కలు నాటే కార్యక్రమానికి సహకరించి స్వయంగా పాల్గొన్న సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సుగుణ జ్ఞాపకార్థం ఆమె భర్త కందివనం నర్సింహారెడ్డి మొక్కలు సమకూర్చడంలో సహకరించి, సేవా ఫౌండేషన్ శ్రేయోభిలాషిగా పాల్గొన్నందుకు నరేశ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపి వెంకట్‌రెడ్డి, రైతులు,గ్రామపెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

## సౌండ్ బాక్సులు, మైకులు అందజేత

ప్రజాపక్షం/కేశంపేట: మండల పరిధిలోని లేమామిడి గ్రామ వడ్డెర యువజన సంఘానికి వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మాధగుని బ్రదర్స్ సహకారం అంధించారు. సంఘానికి రెండు సౌండ్ బాక్సులు, రెండు మైకులు, ఒక యాంప్లిఫైయర్ వైర్‌ను అందజేశారు. ఒక్కో సౌండ్ బాక్స్, మైక్ సామాగ్రికి రూ.28వేల చొప్పున ఖర్చు చేసినట్లు తెలిపారు. వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు యువతకు తమవంతు సహకారం అంధించినట్లు మాధగుని బ్రదర్స్ పేర్కొన్నారు. సంఘం సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలంగౌడ్, ఉపసర్పంచ్ ప్రమోద్‌రెడ్డి, వార్డు సభ్యుడు కుమార్‌గౌడ్, బాలరాజ్‌గౌడ్, జాంగిర్ స్వామి, లక్ష్మయ్య, చాకలి రవి, గుత్తి శ్రీకాంత్, వాడాల వర్షిత్‌రెడ్డి, వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు.





## యువత స్వయం ఉపాధిని ఎంచుకోవాలి

మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** యువత స్వయం ఉపాధిని ఎంచుకుని ఆర్థికంగా స్థిరపడాలని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం అలియాబాద్ మున్సిపాలిటిలో నూతనంగా ఏర్పాటు చేసిన కట్టమైసమ్మ వెల్డింగ్ షాప్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయంగా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని సొంతంగా వ్యాపారాలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ కన్‌రెడ్డి మాలతి మాధవరెడ్డి, కౌన్సిలర్లు మౌనిక దినేష్, యమునా శ్యామ్, యజమాని మేడిపల్లి శివ, నాయకులు పాల్గొన్నారు.



## అంబేద్కర్‌ను అవమానించేలా రచించిన పుస్తకంపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవమానించేలా హర్ష ప్రసాద్ రచించినట్లు పేర్కొంటున్న కల్పిత కథ పుస్తకంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జగద్గిరిగుట్ట దళిత బహుజన సంఘం పోలీసులను కోరింది. ఈ మేరకు సంఘం నాయకులు బుధవారం జగద్గిరిగుట్ట పోలీస్ ఇన్స్‌పెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పుస్తకంలో అంశాలు దళిత, బహుజన వర్గాల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని సంఘం నాయకులు ఆరోపించారు. అంబేద్కర్‌ను అవమానించేలా ఉన్నట్లు పేర్కొంటున్న అభ్యంతరకర అంశాలపై అధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పుస్తకాన్ని విడుదల చేస్తే శాంతి భద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందని, అందువల్ల పుస్తక విడుదలను నిలిపివేయడంతో పాటు, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు సమాజంలో ఉద్రిక్తతలకు దారితీయకుండా పోలీసులు, అధికారులు తగిన చర్యలు చేపట్టాలని సంఘం నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు యేసురత్నం, సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, ఎర్ర యాకన్న, దప్పు రామస్వామి, తొండ వెంకట్, ఎర్ర వీరన్న, చర్లపల్లి రాములు, హరినాథ్‌రావు, కుమార్, గణేష్, నరేష్, బాబు, నరసింహా, హరినాథ్, కీర్తి, మాపల్లె శంకర్, ప్రమోద్, ప్రవీణ్, విజయ్, సంతోష్, జంబూ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## రూ.5.11 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/చర్లపల్లి:** కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కట్టుబడి ఉందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బుధవారం మల్కాజ్‌గిరి కార్పొరేషన్ పరిధిలోని ఘట్‌కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ రూ.5.11 నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులు ఇంటర్నేషనల్ స్కూల్ నుండి విజయ గార్డెన్, వాయుపుత్ర నగర్ వరకు 2 కోట్ల 86 లక్షల 67 వేలతో భూగర్భ డ్రైనేజీ, శ్రీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నుండి నాలా, లక్ష్మి నగర్ వరకు వరదనీటి డ్రైనేజీ వజ్రేష్‌యాదవ్ ప్రారంభించారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిన సిఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, హరిబాబు, వెంకట్‌రెడ్డి, కౌకుట్ల జీవన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యా విధానాలు, ఫీజుల భారంపై భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక

యుఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు చంద్రకాంత్

**ప్రజాపక్షం/దుండిగల్ :** సెప్టెంబర్ నెల 18, 19, 20 తేదీలలో సంగారెడ్డి జిల్లాలో జరగనున్న యూఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని యూఎస్ఎఫ్ఐ మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు ఎం.చంద్రకాంత్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఒక పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఈ మూడు రోజుల ప్లీనరీలో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. విద్యా విధానాలు, ఫీజుల భారం, స్కాలర్ షిప్ లు, హాస్టల్ వసతులు వంటి అనేక అంశాలపై తీర్మానాలు చేసి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రం నుండి అన్ని జిల్లాల ప్రతినిధులు ఈ సమావేశాలకు హాజరుకానున్నారని, కావున మేడ్చల్ జిల్లా నుండి కూడా విద్యార్థులు, యువత, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ రాష్ట్ర ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఇద్దరికి జైలు శిక్ష

**ప్రజాపక్షం/చర్లపల్లి:** మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలోని కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యల్లో భాగంగా 31వ తేదీ నుడి 12వ తేదీ వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ట్రాఫిక్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ మల్లేష్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎఫ్‌సి చౌరస్తా వద్ద నిర్వహించిన తనిఖీల్లో నీరజ్‌శర్మ, హెచ్‌బి కాలనీలో నిర్వహించిన తనిఖీల్లో బుచ్చయ్య అనే వ్యక్తులు మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. వీరిద్దరిపై కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపర్చారు. నిందితులిద్దరికి 2 వేల రూపాయలు జరిమానా, రెండు వారాల జైలు శిక్ష విధించారు.

# రైతాంగ పోరాట చరిత్ర మార్చొద్దు

త్యాగాలను విస్మరిస్తే సహించం : సిపిఐ




**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించడాన్ని సహించేది లేదని సిపిఐ నాయకులు స్పష్టం చేశారు. నిజాం నిరంకుశ పాలన భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా రైతులు, కూలీలు, పేద ప్రజలు సాగించిన పోరాట చరిత్రను వాస్తవ ఆధారాలతోనే నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సిపిఐ ఘట్‌కేసర్ మండల సమితి ఆధ్వర్యంలో అన్నోజిగూడలోని కె.ఎల్. మహేంద్ర నగర్ వికలాంగుల కాలనీలో ర్యాలీ నిర్వహించారు. కె.ఎల్ మహేంద్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఐ సీనియర్ నాయకులు కె.ఎల్ మహేంద్రనగర్ కాలనీ వ్యవస్థాపకులు టి.మల్కయ్య మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూమి, శ్రమ, జీవన హక్కులు, సామాజిక గౌరవం కోసం సాగిన చారిత్రక ప్రజా ఉద్యమమన్నారు. నల్గొండ నుంచి ఖమ్మం, వరంగల్, కరీంనగర్ ప్రాంతాలకు పోరాటం విస్తరించిందన్నారు. వేలాదిమంది రైతులు, కూలీలు మహిళలు, యువకుల త్యాగాలను పక్కనపెట్టి చరిత్రను రాజకీయ ప్రచారానికి ఉపయోగించడం ప్రజా చరిత్రను అవమానించడమేనని విమర్శించారు. నాటి జనసంఘ్ నుండి బిజెపి ఆర్ఎస్ఎస్ రాజకీయ ప్రయోజనాల కోసం చరిత్రను వక్రీకరిస్తున్నాయని సిపిఐ ఆరోపించింది. కె.ఎల్ మహేంద్ర మఖ్దూమ్ మొహియుద్దీన్, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం వంటి నాయకుల పాత్రను సమగ్ర చారిత్రక సందర్భంలో అధ్యయనం చేయాలని టి. మల్కయ్య అన్నారు.

ఆధారాలు, చారిత్రక పత్రా లు ప్రజల అనుభవాల ఆధారంగానే తెలంగాణ పోరాట చరిత్రను నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు కె.ధర్మేంద్ర, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు కల్లూరి జయచంద్ర. మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్, మండల కార్యవర్గ సభ్యులు అన్వర్ పాషా, చౌదరి, ప్రమీల, లక్ష్మి కుమారి, రాములు, శ్యామ్, రాము. బిక్షపతి, రామచంద్ర, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యం, డ్రైనేజీ, రహదారులకు పెద్దపీట

రూ. 1.38 కోట్ల పనులకు ఆమోదం తెలిపిన కౌన్సిల్ సమావేశం




**ప్రజాపక్షం/శామీర్‌పేట:** అలియాబాద్ మున్సిపాలిటిలో పారిశుద్ధ్యం, డ్రైనేజీ, రహదారులకు పెద్దపీట వేస్తున్నామని, మున్సిపల్ ప్రజలకు అవసరమైన కనీస మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తామని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం అలియాబద్ మున్సిపల్‌లో చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి అధ్యక్షతన పురపాలక సంఘ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పురపాలక సంఘం పరిధిలోని ప్రజలకు అవసరమైన మౌళిక వసతులను మెరుగుపరుచుటకు సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఇందులో భాగంగా రూ.1.38 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అనంతరం చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా బడ్జెట్‌ను రూపొందించి అభివృద్ధి పనులను చేపడుతున్నామని చెప్పారు. పురపాలక సంఘం అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ కన్‌రెడ్డి మాలతి మాధవరెడ్డి, కమిషనర్ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## నిమజ్జనానికి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలి

మున్సిపల్ చైర్మన్ జాం రవి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** వినాయక నిమజ్జనాలకు తరలివచ్చే భక్తులకు, ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు, ఏర్పాట్లను పూర్తి చేయాలని మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి అన్నారు. బుధవారం మూడుచింతలపల్లి మున్సిపాలిటిలోని అన్ని వార్డుల్లో వినాయక ప్రతిష్ట మంటపాల నిర్వాహకులతో శామీర్‌పేట ఇన్స్‌పెక్టర్ కొండ నర్సింహారెడ్డి, జీనోమ్ వ్యాలీ ఇన్స్‌పెక్టర్ గురువయ్యలతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మూడుచింతలపల్లిలోని లక్ష్మాపూర్, ఉద్దేమర్రి, కొల్తూర్ గ్రామాల్లోని చెరువులను పరిశీలించారు. గణనాథుడి నిమజ్జనాలకు ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ వినాయక నిమజ్జనాలను ప్రశాంత వాతావరణంలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్యం, తదితర ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం లో తహసీల్దార్ మహ్మద్ గులాం ఇద్రిస్, కౌన్సిలర్లు నీరజ్‌గౌడ్, గిరిపల్లి రమేష్, మెరుపాటి గోవర్ధన్‌రెడ్డి, బొమ్మలపల్లి మల్లేష్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేష్, శ్రీకాంత్, బస్వారెడ్డి, ఆర్ ఒ హర్షద్ అహ్మద్, ఆర్ఐ రాజేశ్వర్ రెడ్డి, శానిటేషన్ ఇన్సపెక్టర్ మోహన్‌సింగ్, మంటపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## శామీర్‌పేట ఎస్‌జిఎఫ్ క్రికెట్ సెలెక్షన్స్ ప్రారంభం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి శామీర్‌పేట మండలం( శామీర్‌పేట, మూడుచింతలపల్లి)కి చెందిన క్రికెట్ సెలెక్షన్స్ ఈ నెల 19న బొమ్మరాశిపేట్‌లోని శాంతినికేతన్ విద్యాలయంలో నిర్వహిస్తున్నట్లు శామీర్‌పేట జోనల్ క్రీడల కార్యదర్శి గుర్రం సత్తిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అండర్ 17 విభాగంలో పాల్గొనే క్రీడాకారులు తేది 01.01.2010 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు.

అండర్ 14 విభాగంలో పాల్గొనే క్రీడాకారులు తేది 01.01.2013 తర్వాత జన్మించిన వారై ఉండాలని ఒరిజినల్ ఆధార్‌కార్డుతో పాటు ఎలిజిబులిటి ఫార్మ్‌ను ఈ నెల 19వ తేది ఉదయం 9 గంటలకు శాంతినికేతన్ స్కూల్లో రిపోర్ట్ చేయాలని సూచించారు. ఆటలకు సంబంధించి కిట్లు ఎవరికి వారే తెచ్చుకోవాలని ఆయన అన్నారు. పూర్తి వివరాలకు మదన్ మోహన్‌రెడ్డి (9246190425) సంప్రదించాలని తెలిపారు.

## నేత్రపర్వంగా గౌడ సంఘం అన్నదానం



**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** జవహర్‌నగర్ డివిజన్ పరిధిలోని బిజెఆర్ నగర్‌లో గౌడ సంఘం నూతన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక కాలనీవాసులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, కుల సంఘాల పెద్ద లు మరియు ప్రముఖులు పెద్ద ఎత్తున హాజరు కావడంతో బీజేఆర్ నగర్‌లో పండుగ వాతావరణం నెలకొంది. ముఖ్య అతిథిగా సీఐ సైదులు: ఈ కార్యక్రమానికి జవహర్‌నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సైదులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు, నూతన కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించి, ఘనంగా సన్మానించారు. నూతన కమిటీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తలపెట్టిన మొదటి బృహత్తర కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. సంఘం బలోపేతం సొసైటీ ఏర్పాటు లక్ష్యం ఈ సందర్భంగా గౌడ సంఘం నూతన కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ... బీజేఆర్ నగర్‌లోని గౌడ కులస్తులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఐక్యతను చాటడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. త్వరలోనే ప్రత్యేకంగా ఒక సొసైటీని కూడా ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నామని వెల్లడించారు. గౌడ సోదరుల సంక్షేమానికి, వికాసానికి అందరి సహకారంతో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.



## ఊరెళ్లి వచ్చేసరికి ఇల్లు గుల్ల

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ఊరెళ్లి వచ్చే సరికి ఇల్లు గుల్ల అయిన సంఘటన చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చర్లపల్లి పిఎస్ పరిధిలోని చర్లపల్లి రైల్వే కాలనీలో నివాసముండే రాకేష్ భార్యతో పాటు తన సొంత ఊరు జనగాంకు వెళ్లి రెండు రోజుల తర్వాత తిరిగి వచ్చే సరికి ఇంటి తలుపులు పగులకొట్టి బీరువాలో ఉన్న 6 తులాల బంగారం, వెండి వస్తువులు దోచుకెళ్లారని ఇంటి యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీరువా తాళం తీయకుండానే బంగారాన్ని ఎలా ఎత్తుకెళ్లారని అనుమానం వ్యక్తం చేస్తూ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## నిద్రావస్థలో ఖాకీలు... రెచ్చిపోయిన దొంగలు

✻ పది తులాల బంగారం, రూ.3 లక్షల నగదు అపహరణ

✻ తాండూరు అయ్యప్పనగర్‌లో పట్టపగలే భారీ చోరీ



**ప్రజాపక్షం/తాండూరు:** వరుస చోరీలతో తాండూరు ప్రజలకు రక్షణ లేకుండా పోయిం ది. తాండూరు అంటేనే దొంగలకు అడ్డాగా మారింది. తాండూరు పరిసర ప్రాంతాలను లక్ష్యంగా పెట్టుకున్న దొంగల ముఠా వరుస దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. ఇంతకూ పోలీసు వ్యవస్థ తాండూరు సబ్‌డివిజన్‌లో పనిచేస్తోందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సుమారు పదిహేను రోజుల వ్యవధిలోనే నాలుగు చోరీలు జరగడం చూస్తుంటే ఖాకీలు నిద్రావస్థలో జోగుతున్నారన్న అనుమానాలు వ్యక్తవుతున్నాయి. తాజాగా బుధవారం తాండూరు పట్టణ శివారు ప్రాంతమైన అయ్యప్పనగర్‌లో తాళం వేసిన ఇంట్లో పట్టపగలు చోరీకి పాల్పడిన దొంగలు పది తులాల బంగారం, రూ.3లక్షల నగదును అపహరించుకు పోయిన ఘటన మరోమారు వెలుగు చూసింది. వరుస దొంగతనాలతో పట్టణ ప్రజ లు భయాందోళనకు గురవుతున్నారు. కేవలం పదిహేను రోజుల వ్యవధిలోనే చోరీ ఘటనలు జరగడం చర్చనీయాంశంగా మారింది. అయ్య ప్ప నగర్‌లో బాధితుడు అయ్యప్పకు చెందిన ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో పట్టపగలు ఇంటి తాళాలు బద్దలు కొట్టి సుమారు పది తులాల బంగారంతో పాటు రూ.3లక్షల నగదును అపహరించుక పోయారు. కూతురు పెళ్ళికోసం దాచిపెట్టుకున్న బంగారం, కాలేజి ఫీజు కోసం దాచుకున్న నగదు సైతం దొంగలించడంతో బాధితులు కన్నీరు మున్నీరవుతున్నారు.



బాధితులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి రూరల్ సిఐ ప్రవీణ్‌కుమార్, యాలాల ఎస్ఐ విఠల్‌రెడ్డి చేరుకుని ఆధారాలను సేకరిస్తున్నారు. గత పదిహేను రోజుల వ్యవధిలోనే నాలుగు చోరీ ఘటనలు చోటు చేసుకోవడంతో పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఒకే తరహాలో వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠా పోలీసులకు సవాల్ విసురుతున్నారు. దొంగలు ఎక్కడి నుండి వస్తున్నారు? ఈ ముఠా సభ్యులు తాండూరులో ఎక్కడ మకాం వేస్తున్నారనే సమాచారం సేకరించడంలో పోలీసులు వ్యవస్థ విఫలమైందన్న విమర్శలు వ్యక్తవుతున్నాయి. ఇప్పటికైనా పోలీసులు గట్టి నిఘాను ఏర్పాటు చేసి వరుస చోరీలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



## పెరిగిన కొమ్మలను ఎప్పటికప్పుడు సురక్షితంగా తొలగించాలి

కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** వినాయక ఉత్సవాలు, నిమజ్జన సందర్భంగా కొనసాగుతున్న పనుల పురోగతిని పరిశీలించేందుకు బుధవారం మల్కాజ్‌గిరి నగరపాలక సంస్థ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి నాచారం, ఉప్పల్ సర్కిళ్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ట్రీ ప్రూనింగ్, బకెట్ లాడర్ ఆపరేషన్లను పరిశీలించిన ఆయన బకెట్ లాడర్ వినియోగం, చేపడుతు న్న కొమ్మల తొలగింపు పురోగతిని అడిగి తెలుసుకొన్నారు. రోడ్ల పైకి విస్తరించిన చెట్ల కొమ్మల కారణంగా వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తటంతో పాటు ప్రమాదాలకు దారితీస్తాయని.



ఈ విషయంలో సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉంటూ నిబంధనలకు అనుగుణంగా పెరిగిన కొమ్మలను ఎప్పటికప్పుడు సురక్షితంగా తొలగించాలన్నారు. రోడ్లపై ఏర్పడిన గుంతలు, దెబ్బతిన్న రోడ్డు భాగాలను ఎప్పటికప్పుడు రోడ్ ప్యాచ్ వర్క్ వేగవంతం చేయాలన్నారు. ఉప్పల్, మన్సురాబాద్ బేబి పాండ్‌లో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్ భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు, సిబ్బంది, వినాయక మండపాల నిర్వాహకులతో సమన్వయంతో పనిచేయాలన్నారు.

## కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా బండారు రవీందర్

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శిగా బోడుప్పల్ సర్కిల్ మేడిపల్లి ప్రాంతానికి చెందిన బండారు రవీందర్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ నియామకపత్రం అందచేసారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ జిల్లాలో పార్టీని పటిష్టపరచేందుకు కిందిస్థాయి నుండి నాయకులందరిని సమన్వయం చేసుకొంటూ పనిచేస్తానన్నారు.



నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులందరికి అందేలా చూడటంతో పాటు వాటిని ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలన్నారు. పార్టీని బలోపేతం చేయటం ద్వారా రానున్న కార్పొరేట్ ఎన్నికల్లో అన్ని స్థానాలను కాంగ్రెస్ దక్కించుకొనేందుకు పాటుపడుతానన్నారు. జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు తీసుకొన్న ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ అమర్‌సింగ్, డిప్యూటీ మేయర్ శివకుమార్, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## 100శాతం సబ్సిడీతో ఆటోమేటిక్ కుట్టు మిషన్ల గడువు సెప్టెంబర్ 30 వరకు పొడిగింపు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మహిళలకు స్వయం ఉపాధి, ఆర్థిక స్వావలంబన కల్పించే లక్ష్యంతో ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకం 2026–27కు గాను బిసి మహిళలకు 100 శాతం సబ్సిడీతో ఆటోమేటిక్ కుట్టు మిషన్‌లు అందచేస్తున్నామని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి పేర్కొన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతి నియోజకవర్గానికి 1000 యూనిట్ల చొప్పున పైలట్ ప్రాతిపదికన ఈ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. ప్రతి కుట్టు మిషన్ విలువ రూ. 12,000గా ఉంటుందన్నారు. నిరుద్యోగ బిసి మహిళలకు అమలు చేసే ఈ పథకానికి పేద, నిరుపేద, నిరాశ్రయ, ఒంటరి మహిళలు, వితంతువులు, అనాథ మహిళలకు ప్రాధాన్యత ఉంటుందని, టైలరింగ్ నైపుణ్యం ఉన్న వారికి సైతం ప్రాధాన్యత ఉంటుందన్నారు. 18 నుండి 55 సంవత్సరాల మధ్య వయసున్న వారు ఈ పథకానికి అర్హులని, రేషన్ కార్డు లేదా ఆదాయ ధృవీకరణ పత్రం, ఆధార్ లేదా ఓటర్ గుర్తింపు కార్డులను తమ దరఖాస్తుతో జతపరచాలన్నారు. ఒక్కో కుటుంబంలో ఒక్క మహిళకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందన్నారు. సెప్టెంబర్ 15లోగా TGOBMMS పోర్టల్ ద్వారా అర్హులైన ఆసక్తి కలిగిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పథకానికి సంబంధించిన వివరాల గురించి సమీప మున్సిపల్, జిహెచ్‌ఎంసి కార్యాలయాలు, బిసి సంక్షేమ శాఖ అధికారులను సంప్రదించవచ్చన్నారు.

## ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమం అమలుపై డిఆర్‌పిల పాఠశాలల సందర్శన

**ప్రజాపక్షం /బొంరాస్‌పేట్ :** జిల్లా విద్యాశాఖ అదేశాల మేరకు ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమంలో భాగంగా డిఆర్‌పిలు గోపాల్ , మురహరి బొంరాస్‌పేట్ మండలంలోని మెట్లకుంట, తుంకమెట్ల ప్రాథమిక పాఠశాలలను బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం అమలు తీరు ,విద్యార్థుల అభ్యసన స్థాయిని, బోధనాప్రక్రియను డిఆర్‌పిలు పరిశీలించారు. విద్యార్థులతో వివిధ అభ్యసన కార్యకలాపాలు నిర్వహించి వారి ప్రాథమిక భాష, గణిత సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఆర్‌పిలు గౌరారం గోపాల్ మురహరి మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలోనే ప్రతి విద్యార్థికి రాయడం అర్థ చేసుకోవడం,సంఖ్యా పరిజ్ఞానం వంటి మౌలిక సామర్థ్యాలు అందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల స్థాయికి అనుగుణంగా బోధనను కొనసాగిస్తూ టిఎల్ఎం చార్టులు, ఆటలు వివిధ కార్యకలాపాలను వినియోగించాలని తెలిపారు. వెనుబడిని విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శ్రద్ధతో రిమీడియల్ బోధన అందించాలని ప్రతి విద్యార్థి ప్రగతిని పరిశీలించాలని సూచించారు. ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని డిఆర్‌పిలు సమన్వయంతో పనిచేయాలని డిఆర్‌పిలు కోరారు. ఈకార్యక్రమంలో మండల విద్యాధికారి ఎన్. హరిలాల్, రాజు, బాలకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నకిలీ కరెన్సీ నోట్లు చలామణికి యత్నించిన యువకుడి అరెస్టు



**ప్రజాపక్షం/ఉప్పల్ :** నకిలీ కరెన్సీ నోట్లు చలామణికి యత్నించిన ఓ యువకుడిని ఉప్పల్ పోలీసులు అరెస్టు చేసారు. రూ.25వేల అసలు కరెన్సీ ఇస్తే రూ. 2.5లక్షలు ఇస్తానని ఇన్‌స్టాగ్రాం ద్వారా పరిచయం అయిన ఓ యువకుడు మంగళవారం ఉప్పల్ మెట్రో పిల్లర్ వద్దకు రమ్మని చెప్పిన విషయంపై అనుమానం కలిగిన సఫిల్‌గూడ నివాసి మోను సింగ్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో వలపన్నిన పోలీసులు, ఫిర్యాదస్తుడు అక్కడకు వెళ్లి యాక్టివాపై వచ్చిన ఇద్దరిని పట్టుకొనే యత్నం చేయగా ఓ వ్యక్తి పరారయ్యాడు. పోలీసులకు చిక్కిన మలక్‌పేటలోని శంకర్‌నగర్ నివాసి మహ్మద్ మోసిన్ నుండి రూ.2.5 లక్షల నకిలీ కరెన్సీ నోట్లు, 10 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. పరారైన ఫిరోజ్ కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

# పట్టణీకరణతోనే నగరాలకు వరద ముప్పు

చెరువులను కాపాడేందుకు హైడ్రా ప్రాధాన్యం

హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పట్టణీకరణ వేగంగా జరగడం, సహజ నీటి వనరులు, చెరువులు ఆక్రమణలకు గురికావడంతోనే భారీ వర్షాలు పడినప్పుడు నగరాల్లో వరద పరిస్థితులు తలెత్తుతున్నాయని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ అన్నారు. నాగోలులోని హైడ్రా శిక్షణ కేంద్రంలో 'యువ ఆపదమిత్ర' 5వ బ్యాచ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నగరంలో 69 శాతం చెరువులు ఆక్రమణలకు గురయ్యాయని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ శాటిలైట్ చిత్రాలు వెల్లడించాయని ప్రస్తావించారు. చెరువులను రక్షించుకోవడం ద్వారానే వరదలను కట్టడి చేయవచ్చని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం చెరువుల పునరుద్ధరణకు అత్యధిక ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన తర్వాత సహాయ చర్యలు చేపట్టడమే కాకుండా, అసలు ప్రమాదాలు జరగకుండా పర్యావరణాన్ని కాపాడటమే హైడ్రా ముఖ్య ఉద్దేశమని వివరించారు. నగరంలో 50 గజాల్లో ఏడేనిమిది అంతస్తులు నిర్మించడం భూకంపాలంతటి ముప్పుగా పరిణమిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. శిక్షణ పొందుతున్న 117 మంది యువ వాలంటీర్లు నగరంలో ప్రమాదాలు సంభవించిన వేళ ప్రభుత్వ విభాగాలతో కలిసి నష్ట నివారణ చర్యల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హైడ్రా అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య, అడిషనల్ కమిషనర్లు ఆర్.సుదర్శన్, డి.ఆనంద్ కుమార్, హైడ్రా ఆర్ఎఫ్ఓ మోహన్ రావు, జయప్రకాష్, డిఎఫ్ఓలు శ్రీధర్ రెడ్డి, గౌతమ్, మై భారత్ హైదరాబాద్ జిల్లా యూత్ ఆఫీసర్ శషాంక్, భారత్ స్కాట్స్ అండ్ గైడ్స్ జిల్లా అధికారిణి చంద్రిక ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నెదర్‌ల్యాండ్స్ అంతర్జాతీయ మహాసభలకు ఆదిల్ షరీఫ్‌కు ఆహ్వానం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారతీయ మున్సిపల్ కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్న నాయకుడు ఆదిల్ షరీఫ్‌కు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. నెదర్‌ల్యాండ్స్‌లోని ఆమ్‌స్టర్‌డామ్‌లో ఈనెల 17 నుంచి 19 వరకు జరిగే అంతర్జాతీయ సాలిడారిటీ ఫెస్టివల్లో పాల్గొనాల్సిందిగా నెదర్‌ల్యాండ్స్ ట్రేడ్ యూనియన్ (ఎఫ్ఎన్‌వి) ఆయనకు అధికారిక ఆహ్వానం పంపింది. ఐఎన్‌టియుసి జాతీయ మున్సిపల్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా ఉన్న ఆదిల్ షరీఫ్, దక్షిణ ఆసియా పారిశుద్ధ్య కార్మికుల పరిస్థితిపై జరిగే ప్రత్యేక వర్క్‌షాప్‌లో భారతీయ కార్మికుల పక్షాన ప్రాతినిధ్యం వహించనున్నారు. పారిశుద్ధ్య కార్మికుల పని పరిస్థితులు, సామాజిక భద్రత, ఆరోగ్య ప్రమాణాలు, వేతన సమస్యలపై ఆయన అంతర్జాతీయ వేదికపై ప్రసంగించనున్నారు. ఈ ఆహ్వానంపై స్పందించిన ఆదిల్ షరీఫ్, భారతీయ మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రపంచ వేదికపై వినిపించే అవకాశం రావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని, ఇందుకు సహకరించిన ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



## కార్మికుల కోసం పోరాటం

**ప్రజాపక్షం/ముషీరాబాద్:** కార్మికులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించేందుకు కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా ఉద్యమించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ధర్నాచౌక్‌లో సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సామూహిక నిరసన దీక్ష నిర్వహించారు. పౌరహక్కుల సంఘం నేత ప్రొఫెసర్ హరగోపాల్, జస్టిస్ చంద్రకుమార్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఉపాధ్యక్షులు సదా భాస్కర్, ఎస్.రమ, రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశం, ఐఎఫ్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 22ఎ ఫిర్యాదులను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ముషీరాబాద్:** రిజిస్ట్రేషన్ చట్టం 1908లోని సెక్షన్ 22ఎ నిషేధిత ఆస్తుల జాబితాలో ప్రైవేటు ఆస్తులను తప్పుగా.. పరిమితికి మించి వల్ల ప్రజలకు ఎదురవుతున్నాయని తెలంగాణ తెలుగుదేశం పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు టిటిడిపి నేతలు హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన, టిటిడిపి నేతలు నల్లెల్ల కిషోర్, నాగు నగేష్, అన్వర్ హుస్సేన్, సతీష్ తదితరులు మాట్లాడుతూ... ఇబ్బందులు కలిగిస్తున్న 22ఎ పరిధి, రికార్డుల సమగ్ర సమీక్ష, సవరణ, సమర్థవంతంగా ఫిర్యాదుల పరిష్కరించాలని కోరారు.

## ఇంటిగ్రో ఫుట్‌పాత్ ఆక్రమణ



**ప్రజాపక్షం/మెహిదీపట్నం:** పాదచారులు నడిచివెళ్లేందుకు వీలుగా ఏర్పాటైన ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఈ క్రమంలోనే మెహిదీపట్నంలోని రేతీబౌలి పి అండ్ టి కాలనీ బస్‌స్టాప్ ప్రాంతంలో ఇంటిగ్రో ఆసుపత్రి యాజమాన్యం ఫుట్‌పాత్‌ను ఆక్రమించి జనరేటర్ ఏర్పాటు చేయడం విస్మయానికి గురిచేస్తున్నది. ఈ విషయంలో స్థానికులు ఫిర్యాదు చేసినా ఖైరతాబాద్ జోనల్ అధికారులు నిర్లక్ష్యం చేస్తుండటం ఆందోళనకు గురిచేస్తున్నది. బస్‌స్టాప్ ప్రాంతంలోనే వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో ప్రయాణీకులకు ఇబ్బంది కలుగుతున్నది. ఇకనైనా ఖైరతాబాద్ జెడ్‌సి స్పందించి ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన జనరేటర్ విషయం పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.

## సర్‌పై రాజకీయ నేతలతో సమావేశం

**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** సర్2026లో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం జరిగింది. సమావేశంలో ఎన్నికల నమోదు అధికారి, డిప్యూటీ కమిషనర్ సర్కిల్44, మెట్టుగూడ ఎంఎన్ఆర్ జ్యోతి అధ్యక్షత వహించగా.. సర్ వివరాలపై నివేదిక సమర్పించారు. గుర్తింన ఓటర్లకు డేటా ధృవీకరణ నిమిత్తం బిఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి నోటీసులు పంపిణీ చేస్తున్నట్లు అధికారులు వివరించారు.

## గణేష్ సురక్ష సంకల్ప-2026



**ప్రజాపక్షం/బేగంపేట్:** గణేష్ మండపాల దగ్గర 'మాదకద్రవ్యాల నిరోధక అవగాహన కార్యక్రమం' నిర్వహించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం గణేష్ మండపాలలో సే నో టు డ్రగ్స్ అనే సందేశంతో ప్రచారాన్ని నిర్వహించడం జరుగుతోంది.ఈ క్రమంలోనే బేగంపేట పరిధిలో మయూరి మార్గ్ శ్యామ్‌లాల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో బేగంపేట్ ఎసిపి గోపాలకృష్ణ మూర్తి, ఈగల్ ఫోర్స్ ఎస్‌పి పుష్పన్ కుమార్, సిఐలు శ్రీనివాస్, సైదులు, ఎస్ఐలు శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌లతో పాటు గణేష్ నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## డాలర్ బిగ్‌బాస్ ప్రయాణం

**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** దేశీయ హోసియరీ రంగంలో అగ్రగామి 'డాలర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్' దక్షిణాది మార్కెట్‌కు 'డాలర్ బిగ్బాస్' బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ సినీ నటుడు, సూపర్ స్టార్ మహేష్ బాబుతో తమ భాగస్వామ్యాన్ని పొడిగించింది. ఈ సందర్భంగా డాలర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వినోద్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, దక్షిణాది మార్కెట్లోకి డాలర్ ఉత్పత్తులను 2024లో ప్రవేశపెట్టామని, మా ఉత్పత్తులకు విశేష ఆదరణ లభించిందని తెలిపారు.

## కెనీషా స్టయిల్స్‌కు గుర్తింపు

**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** ఆసియాలో అతిపెద్ద వెడ్డింగ్ సమ్మిట్ 'ద బ్ల్యూవీ కనెక్ట్ సీజన్ 4'లో బంజారాహిల్స్‌కు చెందిన ప్రముఖ యూనిసెక్స్ పర్సనల్ స్టయిలింగ్ స్టూడియో కెనీషా స్టయిల్స్‌కు బెస్ట్ వెడ్డింగ్ వార్‌డ్రోబ్ స్టయిలిస్ట్ 2026 అవార్డు దక్కింది. ఈ సందర్భంగా కెనీషా స్టైల్స్ వ్యవస్థాపకురాలు, చీఫ్ స్టయిలిస్ట్ కెనీషా మాట్లాడుతూ, వివాహం అనేది ఎంత వ్యక్తిగతమైన వేడుకో పూర్తిగా అర్థం చేసుకున్న ఒక పరిశ్రమ నుంచి ఈ గుర్తింపు రావడం ఎంతో సంతోషాన్నిస్తుందన్నారు.



## 18న చలో హైదరాబాద్

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** అంబేద్కర్‌ను కించపరుస్తూ హమారా ప్రసాద్ రాస్తున్న కల్పిత నాయకుడు పుస్తకాన్ని అడ్డుకోవాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈనెల 18న నిర్వహిస్తున్న హలో అంబేద్కర్ రైట్స్ ఛలో హైదరాబాద్ పోస్టర్‌ను ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద మాల ప్రజా ఫ్రంట్ చైర్మన్ డాక్టర్ మంచాల లింగస్వామి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాతీయ షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు దాసరి విశాల్, అంబేద్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు పుణ్య భానుప్రకాశ్, మాల సంఘాల జేఏసీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మాస శిఖర్, అంబేద్కర్ యూత్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు మరాఠి మణిదీప్, వివిధ సంఘాల నేతలు ఉదయ్, బొడ్డ వసంతి, శివాని, మేసే నాందేవ్, కల్పన, కుమార్, ఎలిజాల సురేష్, ఓం ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## వరద నివారణకు 'స్పాంజ్ బాక్స్' తరహా సహజసిద్ధ చర్యలు

సిఎంసి కమిషనర్ డాక్టర్ జి.సృజన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) పరిధిలో వరద నివారణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా సహజసిద్ధ సాంకేతిక విధానాలను పరిశీలిస్తున్నట్లు కమిషనర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు దాదాపు 56 ప్రాంతాల్లో గంట నుంచి రెండు గంటల పాటు నీరు నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిన నేపథ్యంలో సిఎంసి ప్రధాన కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వేగవంతమైన పట్టణీకరణ వల్ల కాంక్రీట్ రోడ్లు పెరిగి వర్షపు నీరు ఇంకే అవకాశం తగ్గడమే ఇందుకు ప్రధాన కారణమని గుర్తించారు. దీనికి పరిష్కారంగా తమిళనాడులోని కోయంబత్తూర్ మున్సిపల్ కార్పొరేషన్ అమలు చేస్తున్న 'మాడ్యులర్ ఎకో బ్లాక్', 'స్పాంజ్ ఆధారిత' వర్షపు నీటి నిర్వహణ విధానాలపై నిపుణులతో చర్చించారు. ఈ విధానం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేయడమే కాకుండా భూగర్భ జలాలను వేగంగా రీఛార్జ్ చేయవచ్చు. ఈ నూతన సాంకేతికతను సిఎంసి పరిధిలోని నీరు నిలిచే ముంపు ప్రాంతాల్లో దశలవారీగా అమలు చేయడానికి ఉన్న సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ సమావేశంలో చీఫ్ ఇంజనీర్ శ్రీలక్ష్మి , ఇంజనీరింగ్ అధికారులు నామ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# గణపతి ఆశీస్సులు ఉండాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ :** అంగరంగ వైభవంగా గణనాథుల పూజలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే ఖైరతాబాద్ మహాగణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 408 జంటలతో 102 హోమ గుండాల్లో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మహాగణపతిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉత్సవ ప్రాంగణంలో భక్తులతో సందడి నెలకొంది. కాగా ఖైరతాబాద్ మహాగణపతిని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ దర్శించుకున్నారు. ఇదిలాఉండగా.. విఘ్నేశ్వరుని కృపతో ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నిండాలని ఏఐసీసీ జాతీయ కో ఆర్డినేటర్ డా.పివీ రవిశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మధురానగర్‌లో డిఆర్ఆర్ ఎయిమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత దాసరి రంగారావు ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమానికి ఆత్మీయఅతిథిగా ఆయన విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఇదిలాఉండగా.. లాఫింగ్, యోగా క్లబ్ ఆధ్వర్యంలో గురూజీ కోడూరి శ్రీవాణి నేతృత్వంలో బుధవారం రాజీవ్‌నగర్ గణేష్ మండపం వేదికగా యోగా విశిష్టతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కిలారి మనోహర్, ప్రధాన కార్యదర్శి బాపయ్యచౌదరి, రజిని, హేమలత, లక్ష్మి నరసింహరాజు, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.



## షహనాజ్ బేగంకు ఒయు డాక్టరేట్


**హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని సనత్‌నగర్, డీఎస్ఎం కాలనీకి చెందిన షహనాజ్ బేగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. ఓయూ క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో గవర్నర్, ఓయూ ఛాన్సలర్ శివ్ ప్రతాప్ శుక్లా అధ్యక్షతన జరిగిన 85వ స్నాతకోత్సవ సభలో, ఓయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం చేతుల మీదుగా ఆమె డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఫతే నగర్ నివాసి మహ్మద్ హుస్సేన్, ఖాజా బీల కూతురైనా షహనాజ్ బేగం, వారి ప్రోత్సాహంతో బాల్యం నుండే విద్యలో తన ప్రతిభను చూపుతూ వచ్చారు. గజ్వేల్ పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది ఖాజా విజారత్ అలీతో ఆమె వివాహం జరిగింది. ఆ తర్వాత కూడా మరింత పట్టుదలతో, తన భర్త ప్రోత్సాహంతో ఉన్నత విద్యలో షహనాజ్ బేగం తన సత్తాను చాటి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డేటా సెక్యూరిటీ యూసింగ్ హోమోమార్ఫిక్ ఎన్క్రిప్షన్‌లో డాక్టరేట్ సాధించారు. షహనాజ్ బేగం డాక్టరేట్ పట్టాను పొందడం పట్ల ఆమె కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులు, కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ, శుభాకాంక్షలు తెలిపారు.



## సౌర విద్యుత్ ప్రాజెక్ట్ ప్రారంభం

**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** తెలంగాణ రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని మరింత ప్రోత్సహించే దిశగా మరో కీలక ముందడుగు పడింది. ప్రధానమంత్రి కుసుమ్ పథకం కింద మెస్స్ డాకన్సీ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఏర్పాటు చేసిన 2 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్ట్‌ను బుధవారం సంగారెడ్డి జిల్లాలోని 33/11 కేవీ కల్‌హేర్ సబ్‌స్టేషన్ వద్ద విజయవంతంగా సింక్రొనైజ్ చేసి ఛార్జ్ చేశారు. కార్యక్రమాన్ని సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఆపరేషన్స్), సంగారెడ్డి, డివిజనల్ ఇంజనీర్ (ఆపరేషన్స్), జోగిపేట్, డివిజనల్ ఇంజనీర్, సంబంధిత సాంకేతిక బృందాలు సమన్వయంతో పర్యవేక్షించి విజయవంతంగా పూర్తి చేశారు. సౌర విద్యుత్ ప్రాజెక్ట్ ద్వారా పర్యావరణహిత, స్వచ్ఛమైన ఇంధన వనరుల వినియోగానికి మరింత ప్రోత్సాహం లభించనుంది. అలాగే కార్బన్ ఉద్గారాల తగ్గింపు, హరిత శక్తి ఉత్పత్తి పెంపు, రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన సామర్థ్య విస్తరణకు ఈ ప్రాజెక్ట్ దోహదపడనుంది. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న హరిత ఇంధన కార్యక్రమాలకు అనుగుణంగా టీజీఎస్పీడీసీఎల్ పునరుత్పాదక ఇంధన రంగ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తూ, భవిష్యత్తులో మరిన్ని సౌర విద్యుత్ ప్రాజెక్టుల అనుసంధానానికి చర్యలు కొనసాగిస్తుందని అధికారులు తెలిపారు.

## నల్లగొండ ఇంటాక్ చాప్టర్ కన్వీనర్‌గా ధనంజయ్య



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారతీయ కళా, సాంస్కృతిక, వారసత్వ పరిరక్షణ సంస్థ అయిన ఇండియన్ నేషనల్ ట్రస్టు ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఇంటాక్) చైర్మన్ అశోక్ సింగ్ ఠాకూర్ బుధవారం నల్లగొండ ఇంటాక్ చాప్టర్ కన్వీనర్‌గా లయన్ సముద్రాల ధనంజయ్యను నియమించారు. ఈ మేరకు న్యూఢిల్లీలోని కార్యాలయంలోఆయనకు నియామక పత్రం అందజేశారు. తెలంగాణలో కళా, సాంస్కృతిక, వారసత్వ పరిరక్షణను మరింత బలోపేతం చేసేందుకు నూతన నల్లగొండ ఇంటాక్ చాప్టర్ దోహపడుతుందని అశోక్ సింగ్ ఠాకూర్ పేర్కొన్నారు. ఇంటాక్ జాతీయ కార్యవర్గ సభ్యులు ప్రొఫెసర్ ఇంజనీర్ వేదకుమార్ మణికొండ మాట్లాడుతూ వారసత్వ పరిరక్షణ, దాని విలువలు, విశిష్టతలను భావితరాలకు అందజేసేందుకు యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇంటాక్ సభ్యకార్యదర్శి రవీంద్ర సింగ్, సభ్యులు నీల్ కమల్ మహేశ్వరి, కెప్టెన్ శుక్లా తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించాలి



తెలంగాణ సర్పంచుల సంఘం జెఎసి

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** గ్రామ పంచాయతీలకు సంబంధించిన నిధులపై ఉన్న ఆంక్షలను తొలగించి, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు సూర్వి యాదయ్యగౌడ్ ఆధ్వర్యంలో జేఏసీ జిల్లాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై అధ్యక్షుడు పేరు యాదయ్యతో కలిసి నూతనంగా ఎన్నుకున్న జిల్లా అధ్యక్షులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ ఉపాధ్యక్షులు కూర వెంకటేష్, కార్యదర్శి విక్రమ్, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు జూకంటి అనిల్, నూతనంగా ఎన్నుకున్న జిల్లా అధ్యక్షులు సుభాష్, ఎర్ర రమేష్, శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


# మున్నూరు కాపులకు సభ్యత్వం తప్పనిసరి

వెబ్‌సైట్ ఆవిష్కరించిన కొండా దేవయ్య పటేల్



**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ :** తెలంగాణ మున్నూరు కాపులంతా తమ సభ్యత్వాన్ని తప్పనిసరిగా నమోదు చేయాలని తెలంగాణ మున్నూరు కాపు సంఘం (పటేల్స్) వ్యవస్థాపక అధ్యక్షులు కొండా దేవయ్య పటేల్ కోరారు. తద్వారా మున్నూరు కాపుల జనాభా ఎంత ఉందో స్పష్టత వస్తుందని, అన్ని రంగాల్లో జనాభా దామాషా ప్రకారం వాటా కొరకు ప్రభుత్వాన్ని నిలదీయవచ్చన్నారు. బుధవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మున్నూరుకాపు సంఘం నేతలతో కలిసి ఆయన www.munnurukapusangam. org వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. బిఆర్ఎస్ హయాంలోని సర్వేలో మున్నూరు కాపులు 28లక్షలు ఉన్నట్టు తేలిందన్నారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం జనగణనలో మున్నూరుకాపులు 13 లక్షలు ఉన్నట్టు చూపించడం అన్యాయమన్నారు. తమకు జరుగుతున్న అన్యాయంపై వివిధ రాజకీయ పార్టీల్లో ఉన్న మున్నూరుకాపుల ప్రజాప్రతినిధులంతా ఒక్కటై ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరారు. మున్నూరుకాపుల బాలబాలికల వసతి నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులివ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.సత్యనారాయణ, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఆర్.వి.మహేందర్, యూత్ అధ్యక్షులు విశాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ టి.రాజ్‌కుమార్, నేతలు అముల దామోదర్, జె.నిరంజన్ భూమన్న, నంద కిశోర్, రాజేందర్ పాల్గొన్నారు.

## పెద్దదిక్కు బొజ్జా తారకం



**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** సమానత్వం, న్యాయం, ధర్మం కోసం జీవితాంతం పోరాడిన హక్కుల న్యాయవాది బొజ్జా తారకం హక్కులకు పెద్దదిక్కుగా నిలిచారని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం కొనియాడారు. బొజ్జా తారకం10వ వర్ధంతి, ఆయన సతీమణి విజయభారతి రెండో వర్ధంతి సందర్భంగా బొజ్జా తారకం రిపబ్లిక్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దళితులపై జరిగే అకృత్యాలపై బొజ్జా తారకం స్పందించి, హక్కుల పరిరక్షణ కోసం కోర్టులోనూ, ప్రజలతో కలిసి బయటా పోరాడారని గుర్తుచేశారు.దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ, చుండూరు, కారంచేడు, లక్ష్మీ పేట తదితర ఘటనలకు వ్యతిరేకంగా బొజ్జా తారకం నాయకత్వంలో పెద్ద ఉద్యమం సాగిందన్నారు. కార్యక్రమంలో నల్ల సూర్యప్రకాష్, బొజ్జా తారకం రిపబ్లిక్ పార్టీ అధ్యక్షుడు జన్ను సాంబయ్య, రమేష్, డీబీఎఫ్ నగర కార్యదర్శి రాజేష్, బాంసెఫ్ నాయకులు రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# మంకాలమ్మ గుడి వద్ద చెత్తకుప్పల తొలగింపు

పరిసర ప్రాంతాల ప్రజలకు ఊరట



**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** జవహర్‌నగర్ పరిధిలోని శ్రీ మంకాలమ్మ దేవాలయం వద్ద గత కొన్ని రోజులుగా పేరుకుపోయిన చెత్తకుప్పలను స్థానిక బీజేపీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ పానుగంటి బాబు చొరవతో అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు పూర్తిస్థాయిలో శుభ్రం చేశారు. దేవాలయ ప్రాంగణంలో చెత్త భారీగా పేరుకుపోవడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లడమే కాకుండా, భక్తులు, స్థానికులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గమనించిన పానుగంటి బాబు తక్షణమే స్పందించి, పారిశుద్ధ్య సిబ్బందిని అక్కడికి పిలిపించారు. స్వయంగా దగ్గరుండి చెత్తకుప్పలను తొలగించి, ఆ ప్రాంతమంతా క్రిమిసంహారకాలతో శుభ్రపరిచేలా చర్యలు చేపట్టారు. స్థానికుల హర్షం ఆలయ పరిసరాలు తిరిగి స్వచ్ఛంగా మారడంతో స్థానిక ప్రజలు, భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి వెంటనే స్పందించిన మాజీ కార్పొరేటర్ పానుగంటి బాబుకు, అలాగే పారిశుద్ధ్య కార్మికులకు పరిసర ప్రాంత వాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఆలయ పరిసరాల్లో చెత్త పేరుకుపోకుండా నిరంతరం పర్యవేక్షించాలని కోరారు.

## 20న విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** విశ్వకర్మ భగవానుడి దివ్య ఆశీస్సులతో సమాజంలో ఐక్యత, ఆధ్యాత్మికత, సోదరభావం మరియు విశ్వ మానవత్వం మరింత పెంపొందాలని విరాట్ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం జవహర్ నగర్ ప్రతినిధులు ఆకాంక్షించారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్, జవహర్ నగర్ మహంకాళి దేవాలయ ప్రాంగణంలో ఈ నెల 20వ తేదీన శ్రీ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా కోరుతూ మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, మేడ్చల్ జిల్లా మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డిలకు సంఘం సభ్యులు బుధవారం ఆహ్వాన పత్రాలను అందజేశారు.

ఫారం-6

(ప్రాథమిక ప్రకటన)

(తెలంగాణ సవరణ చట్టం 2016 లోని చాప్టర్ III ఎ లోని 10 ఎ అనుసరించి) (చట్టంలోని సెక్షన్-11 క్రింద దీనిలో 10ఎ మినహాయింపు కలదు) (నిబంధన 6/12 చూడుము)

**తెలంగాణ ప్రభుత్వం**
**రెవిన్యూ (భూసేకరణ) శాఖ**

**గెజిట్ నెం. 35/2026** **తేదీ: 11.09.2026**

**జిల్లా కలెక్టర్ యదాద్రి భువనగిరి**
**ఫైల్ నెం. G/2665/2026** **తేదీ: 09.09.2026**

**స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (L.A)**
**యదాద్రి భువనగిరి ఫైల్ నెం. B/41/2026,** **తేదీ: 09.09.2026**

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి ఆదేశానుసారం యాదాద్రి భువన గిరి జిల్లా చౌటుప్పల్ మండలం చిన్న కొండూరు గ్రామములో విస్తీర్ణం **ఎ. 5.25 గుంటల** భూమి ప్రజా ప్రయోజనార్థం పిల్లాయిపల్లి కాలువ నిర్మాణములో భాగముగా దిగువ చూపిన భూమి అవసరమైయున్నదని భావించినందున సదరు భూసేకరణ ప్రకటన జారీచేయనైనది.

ప్రభుత్వము ఉత్తర్వుల నెం. 108, I &CAD(LA.R&R/A2) Department, Date: 31.10.2017 ద్వారా పిల్లాయిపల్లి కాలువ కొరకు భూసేకరణ నష్టపరిహారం మరియు పునరుపాది కల్పన పారదర్శకత మరియు) - న్యాయబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు) చట్టం 2013 లోని చాప్టర్-11 (సామాజిక ప్రభావ లెక్కింపు అధ్యయనం) మరియు చాప్టర్-III (ఆహార భద్రత పరిరక్షణ) వర్తింపు నుండి మినహాయింపు ఇవ్వనైనది.

ఇట్టి పునరావాసం మరియు పునరుపాది కల్పనకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ), యాదాద్రి భువనగిరి గారిని కార్యనిర్వాహకునిగా (అడ్మినిస్ట్రేటర్) గా నియమించనైనది.

కావున, పైన తెలిపిన పిల్లాయిపల్లి కాలువ నిర్మాణ నిమిత్తం యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలం చిన్న కొండూరు గ్రామములో విస్తీర్ణం **ఎ. 5.25 గుంటల** భూమి యొక్క వివరములు ఈ దిగువ చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచేయనైనది.

**జిల్లా: యాదాద్రి భువనగిరి మండలం: చౌటుప్పల్ గ్రామం: చిన్న కొండూరు**

| క్ర. సం. | సర్వే నెం./ భూమి స్వభావం విస్తీర్ణం (ఎ.గుం) | పట్టాదారు పేరు | తండ్రి / భర్త పేరు | అనుభవదారు పేరు | తండ్రి / భర్త పేరు | విస్తీర్ణం (ఎ.గుం) | చెట్లు / కట్టడములు | ఇతరములు |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 1111 పట్టా / ఖుష్కీ 0.04 | మర్రి మహేందర్ రెడ్డి | రాంరెడ్డి | మర్రి మహేందర్ రెడ్డి | రాంరెడ్డి | 0-02 | – | – |
| | | రామిడి మల్లారెడ్డి | ఎల్లారెడ్డి | సరి భూపాల్ రెడ్డి | నర్సిరెడి | 0-02 | – | – |
| | | రామిడి జంగారెడ్డి | వీరారెడ్డి | | | | | |
| | | బి సుగున్ | బొడ్డుల రామ్ మూర్తి | | | | | |
| | | నిమ్మల చంద్రారెడ్డి | బుచ్చిరెడ్డి | | | | | |
| | | గూడూరు వెంకట్ రెడ్డి | నర్సిరెడ్డి | | | | | |
| | | గూడూరు యాదిరెడ్డి | బుచ్చి రెడ్డి | | | | | |
| | | రామిడి మల్లారెడ్డి | సత్తిరెడ్డి | | | | | |
| | | గూడూరు తిరుమల్ రెడ్డి | నర్సిరెడ్డి | | | | | |
| | | రామిడి మల్లారెడ్డి | సత్తిరెడ్డి | | | | | |
| | | గూడూరు లక్ష్మారెడ్డి | బుచ్చిరెడ్డి | | | | | |
| | | తీగల ఎల్లారెడ్డి | రాంరెడ్డి | | | | | |
| 2 | 1109 పట్టా / ఖుష్కీ 0.09 | మర్రి మహేందర్ రెడ్డి | రాంరెడ్డి | మర్రి మహేందర్ రెడ్డి | రాంరెడ్డి | 0-0450 | – | – |
| | | మర్రి వైదేహి | మహేందర్ రెడ్డి | సరి భూపాల్ రెడ్డి | నర్సిరెడ్డి | 0-03 | – | – |
| | | | | సరి జగన్ రెడ్డి | నర్సిరెడ్డి | 0-0150 | – | – |
| 3 | 1110 పట్టా / ఖుష్కీ 0.01 | మర్రి వైదేహి | మహేందర్ రెడ్డి | సరి జగన్ రెడ్డి | నర్సిరెడ్డి | 0-0050 | – | – |
| | | మర్రి మహేందర్ రెడ్డి | రాంరెడ్డి | మర్రి మహేందర్ రెడ్డి | రాంరెడ్డి | 0-0050 | – | – |
| 4 | 1108 పట్టా / ఖుష్కీ 0.1050 | బక్క బుచ్చయ్య | రామయ్య | బక్క బుచ్చయ్య | రామయ్య | 00-0550 | – | – |
| | | | | మర్రి శ్యామ్ సుందర్ రెడ్డి | | 00-0250 | – | – |
| | | | | మర్రి మహేందర్ రెడ్డి | రాంరెడ్డి | 00-0250 | – | – |
| 5 | 1105 పట్టా / ఖుష్కీ 0.0650 | చాకలి రామయ్య | మైసయ్య | చాకలి రామయ్య | మైసయ్య | 00-0650 | – | – |
| | | చాకలి జగ్గయ్య | సాయిలు | చాకలి జగ్గయ్య | సాయిలు | | | |
| | | చాకలి గోపయ్య | గోపయ్య | చాకలి గోపయ్య | గోపయ్య | | | |
| | | చాకలి చిలుకయ్య | లచ్చయ్య | చాకలి చిలుకయ్య | లచ్చయ్య | | | |
| 6 | 1104 పట్టా / ఖుష్కీ 0.03 | దేవరపల్లి రవీందర్ రెడ్డి | లక్ష్మా రెడ్డి | దేవరపల్లి రవీందర్ రెడ్డి | లక్ష్మా రెడ్డి | 00-03 | – | – |
| 7 | 1102 పట్టా / ఖుష్కీ 0.07 | దేవరపల్లి రవీందర్ రెడ్డి | లక్ష్మా రెడ్డి | దేవరపల్లి రవీందర్రెడ్డి | లక్ష్మా రెడ్డి | 00-0250 | – | – |
| | | దేవరపల్లి బుచ్చిరెడ్డి | సత్తి రెడ్డి | దేవరపల్లి బుచ్చిరెడ్డి | సత్తి రెడ్డి | 00-01 | – | – |
| | | దేవరకొండ పద్మయ్య | యల్లయ్య | దొంతర బోయిన దశరథ | - | 00-01 | – | – |
| | | దేవరకొండ పెంటయ్య | బ్రహ్మయ్య | | | | | |
| | | దేవరపల్లి గోవేర్దన్ రెడ్డి | గంగారెడ్డి | దొంతర బోయిన యాదయ్య | - | 00-01 | – | – |
| | | పిసాటి సత్తమ్మ | పాండు రెడ్డి | | | | | |
| | | సూరి జగన్ రెడ్డి | నర్సిరెడ్డి | | | | | |
| | | సూరి భూపాల్ రెడ్డి | నర్సిరెడ్డి | గుర్తించ బడలేదు | గుర్తించ బడలేదు | 00-0150 | – | – |
| | | సూరి మోహన్ రెడ్డి | వెంకట్ రెడ్డి | | | | | |
| | | సూరి యాదిరెడ్డి | వెంకట్ రెడ్డి | | | | | |
| 8 | పట్టా / ఖుష్కీ 0.01 | దేవరపల్లి రవీందర్ రెడ్డి | లక్ష్మారెడ్డి | దేవరపల్లి రవీందర్ రెడ్డి | లక్మారెడ్డి | 0-01 | – | – |
| 9 | 1098 పట్టా / ఖుష్కీ 0.06250 | దొంతర బోయిన మల్లయ్య | సర్వయ్య | గుర్తించ బడలేదు | గుర్తించ బడలేదు | 00-0150 | – | – |
| | | | | పలుసం రాములు | | 00-0050 | – | – |
| | | | | దొంతర బోయిన రామయ్య | సర్వ య్య | 00-0050 | – | – |
| 10 | 1097 పట్టా / ఖుష్కీ 0.0250 | దొంతర బోయిన సర్వయ్య | ఎల్లయ్య | గుర్తించబడ లేదు | గుర్తించ బడ లేదు | 00-0250 | – | – |
| | | దొంతర బోయిన వెంకయ్య | గోపయ్య | | | | | |
| | | దొంతర బోయిన వెంకటేశం | రామయ్య | | | | | |
| | | సామ నిర్మల | సామ యాదిరెడ్డి | | | | | |
| | | దేవరపల్లి రామ చంద్రారెడ్డి | సత్తిరెడ్డి | | | | | |
| | | దేవరపల్లి ఉమ | దేవరపల్లి యాదిరెడ్డి | | | | | |
| | | దొంతర బోయిన రామయ్య | సర్వయ్య | | | | | |
| | | దేవరపల్లి రవీందర్ రెడ్డి | లక్ష్మా రెడ్డి | | | | | |
| | | దొరబోయిన రామచంద్రం | రామయ్య | | | | | |
| | | దేవరపల్లి అలివేలు | బాల్ రెడ్డి | | | | | |
| | | దేవరకొండ శంకరయ్య | పుల్లయ్య | | | | | |
| | | దొంతర బోయిన యాదయ్య | మల్లయ్య | | | | | |
| | | దొంతర బోయిన దశరథ | గోపయ్య | | | | | |
| | | దేవరకొండ రాఘవయ్య | పుల్లయ్య | | | | | |
| | | దొంతర బోయిన నర్సింహ్మ | మల్లయ్య | | | | | |
| 11 | 1099 పట్టా / ఖుష్కీ 0.06 | దొంతర బోయిన వెంకటేశం | రామయ్య | పలుసం రాములు | - | 00-0150 | – | – |
| | | దొంతర బోయిన సర్వయ్య | ఎల్లయ్య | దొంతరబోయిన యాదయ్య | మల్లయ్య | 00-01 | – | – |
| | | దొంతర బోయిన రామచంద్రం | రామయ్య | దొంతరబోయిన వెంకయ్య | గోపయ్య | 00-01 | – | – |
| | | దొంతర బోయిన లక్ష్మ య్య | యల్లయ్య | దొంతరబోయిన దశరథ | గోపయ్య | 00-01 | – | – |
| | | దొంతర బోయిన యాదయ్య | మల్లయ్య | దొంతర బోయిన రామయ్య | సర్వ య్య | 00-0150 | – | – |
| | | దొంతర బోయిన వెంకయ్య | గోపయ్య | | | | | |
| | | దొంతర బోయిన దశరథ | గోపయ్య | | | | | |
| | | దొంతర బోయిన రామయ్య | సర్వయ్య | | | | | |
| 12 | 1100 పట్టా / ఖుష్కీ 0.0150 | దొంతర బోయిన దశరథ | గోపయ్య | దొంతరబోయిన దశరద | గోపయ్య | 00-005 | – | – |
| | | దొంతర బోయిన యాదయ్య | మల్లయ్య | దొంతరబోయిన యాదయ్య | మల్లయ్య | 00-005 | – | – |
| | | దొంతర బోయిన వెంకయ్య | గోపయ్య | దొంతరబోయిన వెంకయ్య | గోపయ్య | 00-005 | – | – |
| 13 | 1084 పట్టా / ఖుష్కీ 0.0150 | దేవరకొండ విజయలక్ష్మి భర్త శంకర చారి | దేవరకొండ శంకరా చారి | దేవరకొండ సత్యనారాయణ | నర్సింహ | 0-0150 | – | – |
| | | దేవరకొండ వీరయ్యచారి | వీరాచారి | | | | | |
| | | దేవరకొండ రాము | వీరాచారి | | | | | |
| | | పల్సం కమలమ్మ | జెన్నయ్య | | | | | |
| | | పల్సం అనసూయ | మల్లేశం | | | | | |
| | | పల్సం రాజు | జెన్నయ్య | | | | | |
| | | దేవరకొండ విష్ణుయ్య | ఎల్లయ్య | | | | | |
| | | దేవరకొండ సుధాకర్ | శివ రాములు | | | | | |
| | | పలుసం మల్లయ్య | అప్పయ్య | | | | | |
| 14 | 1083 పట్టా / ఖుష్కీ 0.10 | దేవరకొండ సత్య నారాయణ | నర్సింహ | దేవరకొండ సత్యనారాయణ | నర్సింహ | 00-0450 | – | – |
| | | దేవరకొండ నర్సింహ్మ | రామ స్వామి | సుధాకర్ | నర సింహ | 00-04 | – | – |
| | | దేవరకొండ సుదాకర్ | శివ రాములు | | | | | |
| | | దెవరకొండ విశ్వనాథం | శరభయ్య | | | | | |
| | | దేవరకొండ నర్సింహ్మ | శరభయ్య | | | | | |
| | | దేవరకొండ వీరయ్య | చంద్రయ్య | | | | | |
| | | దేవరకొండ వీరయ్యచారి | వీరాచారి | | | | | |
| | | దేవరకొండ విష్ణుయ్య | ఎల్లయ్య | దేవరకొండ విష్ణుయ్య | ఎల్లయ్య | 00-0150 | – | – |
| 15 | 1082 పట్టా / ఖుష్కీ 0.0950 | దేవరకొండ విష్ణుయ్య | ఎల్లయ్య | దేవరకొండ విష్ణుయ్య | ఎల్లయ్య | 00-04 | – | – |
| | | దేవరకొండ విజయలక్ష్మి | శంకర చారి | దేవరకొండ విజయలక్ష్మి | శంకర చారి | 00-02750 | – | – |
| | | దేవరకొండ సత్య నారాయణ | నర్సింహ | దేవరకొండ యల్లయ్య | - | 00-02750 | – | – |
| | | దేవరకొండ వీరయ్య | చంద్రయ్య | | | | | |
| | | దేవరకొండ వీరయ్యచారి | వీరాచారి | | | | | |
| | | దేవరకొండ నర్సింహ్మ | రామస్వామి | | | | | |
| 16 | 1081 పట్టా / ఖుష్కీ 0.0650 | దేవరకొండ విష్ణుయ్య | ఎల్లయ్య | దేవరకొండ విష్ణుయ్య | ఎల్లయ్య | 0-0650 | – | – |
| 17 | 1079 పట్టా / ఖుష్కీ 0.01 | దేవరకొండ విశ్వనాదం | శరభయ్య | పారాపల్లి బాల లింగం | - | 0-0150 | – | – |
| | | దేవరకొండ నర్సింహ్మ | శరభయ్య | దేవరకొండ నర్సింహ చారి | వీరా చారి | 0-0075 | – | – |
| | | | | దేవరకొండ రమేష్ | వీరా చారి | 0-0075 | – | – |
| 18 | 1078 పట్టా / ఖుష్కీ 0.0150 | దేవరకొండ బిక్షపతి | కనకయ్య | పారాపల్లి బాల లింగం | - | 0-005 | – | – |
| | | పారెపల్లి లక్ష్మి నర్సమ్మ | బాల్ లింగం | దేవరకొండ బ్రహ్మాచారి | బుచ్చి రాములు | 0-0025 | – | – |
| | | దేవరకోండ కుమార చారి | దేవరకొండ వీరయ్య | దేవరకొండ నరేందర్ | బుచ్చి రాములు | 0-0025 | – | – |
| | | దేవరకొండ రామచంద్రం | దేవరకొండ వీరయ్య | దేవరకొండ వీరాచారి | వెంకయ్య | 0-0025 | – | – |
| | | దేవరకొండ రాములమ్మ | దేవరకొండ బ్రహ్మాచారి | దేవరకొండ పద్మాచారి | వెంకయ్య | 0-00250 | – | – |
| | | దేవరకోండ నర్సింహ్మ | పాపయ్య | | | | | |
| 19 | 1073 పట్టా / ఖుష్కీ 0.0450 | దేవరకొండ కళమ్మ | వీరాచారి | దేవరకొండ కళమ్మ | వీరా చారి | 00-01 | – | – |
| | | దేవరకొండ విష్ణుయ్య | ఎల్లయ్య | దేవరకొండ విష్ణుయ్య | ఎల్లయ్య | 00-01 | – | – |
| | | భీమగొని రమణమ్మ | శ్రీరాములు | నరసింహ చారి | చెరువయ్య | 00-01 | – | – |
| | | అనుగు నిర్మల | అనుగు నర్సిరెడ్డి | | | | | |
| | | దేవరకొండ వీరయ్య | రంగయ్య | బాల లింగం | రాజయ్య | 00-0150 | – | – |
| 20 | 1070 పట్టా / ఖుష్కీ 0.11 | పారాపల్లి లక్ష్మి నర్సమ్మ | బాల లింగం | పారాపల్లి లక్ష్మి నర్సమ్మ | బాల లింగం | 00-05 | – | – |
| | | పులిమామిడి శ్రీలత | నర్సింహ | పులిమామిడి శ్రీలత | నర్సింహ | 00-03 | – | – |
| | | శ్రీరామోజు వసంత | విష్ణు చారి | శ్రీరామోజు వసంత | విష్ణు చారి | 00-03 | – | – |
| 21 | 1069 పట్టా / ఖుష్కీ 0.07 | అనుగు నిర్మల | నర్సిరెడ్డి | అనుగు నిర్మల | నర్సిరెడ్డి | 00-0350 | – | – |
| | | దేవరకొండ సత్యనారాయన చారి | లక్ష్మీ నర్సయ్య | శ్రీరామోజు విష్ణుచారి | విష్ణు చారి | 00-0350 | – | – |
| | | దేవరకొండ శ్రీనివాస చారి | లక్ష్మీ నరసింహ | | | | | |
| 22 | 1067 పట్టా / ఖుష్కీ 0.03 | శ్రీ రామోజు వసంత | విష్ణు చారి | శ్రీ రామోజు వసంత | సాయిలు | 00-03 | – | – |
| 23 | 1256 పట్టా / ఖుష్కీ 0.11 | పలుసం మల్లయ్య | అప్పయ్య | పలుసం అచ్చయ్య | - | 00-02 | – | – |
| | | పలుసం నర్సింహ్మ | పల్సం ముత్యాలు | పలుసం జంగయ్య | - | 00-02 | – | – |
| | | పలుసం మల్లేషం | పల్సం ముత్యాలు | | | | | |
| | | కాటేపల్లి సత్తమ్మ | కాటెపల్లి నర్సింహ | పలుసం యాదయ్య | - | 00-02 | – | – |
| | | పలుసం లక్ష్మ మ్మ | శ్రీరాములు | | | | | |
| | | పల్సం కమలమ్మ | జెన్నయ్య | కాటేపల్లి యాదయ్య | - | 00-0250 | – | – |
| | | పలుసం వెంకటేష్ | ఏల్సం ముత్యాలు | కాటెపల్లి జంగయ్య | - | 00-0250 | – | – |
| | | పల్సం ఉశయ్య | అచ్చయ్య | | | | | |
| 24 | 1294 పట్టా / ఖుష్కీ 0.12 | యెడ్ల పద్మారెడ్డి | మల్లారెడ్డి | గుండె బోయిన మల్లయ్య | సాయి లు | 00-12 | – | – |
| | | ఎలిమినేటి ప్రభావతి | బుచ్చి రెడ్డి | | | | | |
| | | ఎలిమినేటి బుచ్చిరెడ్డి | చిన్న యాదిరెడ్డి | | | | | |
| | | జక్క దీపిక | J దినేనదర్ రెడ్డి | | | | | |
| | | గుండె బోయిన రాజు | మల్లేశం | | | | | |
| | | ఎడ్ల ముత్యం రెడ్డి | మల్లారెడ్డి | | | | | |
| 25 | 1287 పట్టా / ఖుష్కీ 2.10 | గుండె బోయిన మల్లయ్య | చిన్న సాయిలు | గుండె బోయిన మల్లయ్య | సాయి లు | 00-12 | – | – |
| | | జక్కిడి మల్లారెడ్డి | పాపిరెడ్డి | జక్కిడి మల్లారెడ్డి | పాపిరెడ్డి | 00-0575 | – | – |
| | | జక్కిడి కలమ్మ | బుచ్చి రెడ్డి | జక్కిడి కలమ్మ | బుచ్చిరెడ్డి | 00-0575 | – | – |
| | | జక్కిడి యశోద | మల్లారెడ్డి | జక్కిడి యశోద | మల్లారెడ్డి | 00-0575 | – | – |
| | | కౌడె రాములు | బీరయ్య | కౌడె రాములు | బీరయ్య | 00-05 | – | – |
| | | ఉదరి ఆండాలు | సుక్కయ్య | ఉదరి ఆండాలు | వెంకయ్య | 00-05 | – | – |
| | | ఉదరి యాదయ్య | వెంకయ్య | ఉదరి యాదయ్య | చంద్ర య్య | 00-03 | – | – |
| | | ఉదరి సత్తయ్య | చంద్రయ్య | ఉదరి సత్తయ్య | చంద్రయ్య | 00-025 | – | – |
| | | ఉదరి కిష్టయ్య | చంద్రయ్య | ఉదరి కిష్టయ్య | రాజయ్య | 00-02 | – | – |
| | | ఉదరి ముత్తయ్య | రాజయ్య | ఉదరి ముత్తయ్య | రాజయ్య | 00-025 | – | – |
| | | ఉదరి యాదయ్య | రాజయ్య | ఉదరి యాదయ్య | రాజయ్య | 00-025 | – | – |
| | | పలుసం యాదయ్య | రాజయ్య | పలుసం యాదయ్య | రాజయ్య | 00-0175 | – | – |
| | | కాటేపల్లి యాదయ్య | రాజయ్య | కాటేపల్లి యాదయ్య | రాజయ్య | 00-0175 | – | – |
| | | కాటేపల్లి జంగయ్య | సత్తయ్య | కాటేపల్లి జంగయ్య | సత్తయ్య | 00-0175 | – | – |
| | | పారేపల్లి బాలలింగం | రాజయ్య | పారేపల్లి బాల లింగం | రాజయ్య | 00-07 | – | – |
| | | సజీవ సీతయ్య | సంజీవ మల్లయ్య | యెష బోయిన కిష్టయ్య | బుచ్చ య్య | 00-07 | – | – |
| | | సంజీవ యాదయ్య | గండయ్య | | | | | |
| | | సంజీవ అంజమ్మ | పాపయ్య | బత్తుల యాదయ్య | బంగారి | 00-045 | – | – |
| | | సామ నిర్మల | సామ యాదిరెడ్డి | పలుసం అచ్చయ్య | | 00-0175 | – | – |
| | | తోట ఇస్తారి | వెంకయ్య | పలుసం జంగయ్య | | 00-0175 | – | – |
| | | చెక్క గాలమ్మ | చంద్రయ్య | దేవరకొండ పద్మాచారి | వెంకయ్య | 00-04 | – | – |
| | | కాయితి యాదయ్య | కాయితి మల్లయ్య | శ్రీ రామోజు వసంత | విష్ణు దారి | 0.03 | – | – |
| | | కాయితి జంగయ్య | కాయితి మల్లయ్య | | | | | |
| | | కాయిల్ మధు | వెంకటేష్ | | | | | |
| | | కాటపల్లి అశోక్ | సత్తెయ్య | | | | | |
| | | సజీవ దశరథ | నర్సింహ | | | | | |
| | | పలుసం లింగయ్య | ఎల్లయ్య | | | | | |
| | | చిలుముల అనసూయ | పద్మారెడ్డి | | | | | |
| | | చిలుముల అండాలు | నర్సిరెడ్డి | | | | | |
| | | సంజీవ లక్ష్మ మ్మ | మల్లయ్య | | | | | |
| | | పారమల్ల లక్ష్మ య్య | నర్సయ్య | | | | | |
| | | పూసలి యాదయ్య | బంగార య్య | | | | | |
| | | గుండె బోయిన రాజు | మల్లేశం | | | | | |
| | | పోలెబోయిన ఎల్లమ్మ | నర్సింహ్మ | | | | | |
| | | అంకురి మల్లయ్య | సాయిలు | | | | | |
| | | అంకురి వెంకట్ | సాయిలు | | | | | |
| | | ఊదరి యాదమ్మ | కిష్టయ్య | | | | | |
| | | గుండెబోయిన సత్తమ్మ | లక్ష్మ య్య | | | | | |
| | | సంజీవ పద్మ | బుచ్చయ్య | | | | | |
| | | పలుసం ఎట్టయ్య | బాలయ్య | | | | | |
| | | అంకూరి యాదయ్య | సాయిలు | | | | | |
| | | | మైసయ్య | | | | | |
| | | | గండయ్య | | | | | |
| | | | సత్తయ్య | | | | | |
| | | | సత్తయ్య | | | | | |
| | | | పాపయ్య | | | | | |
| | | | భీమయ్య | | | | | |
| | | | రామస్వామి | | | | | |
| | | | గండయ్య | | | | | |
| | | | వీరయ్య | | | | | |
| | | | చంద్రయ్య | | | | | |
| | | | లక్ష్మ య్య | | | | | |
| | | సంజీవ నర్సయ్య | రాములు | | | | | |
| | | సంజీవ రమేష్ | రాములు | | | | | |
| | | కాటెపల్లి నర్సింహ | పాపిరెడ్డి | | | | | |
| | | కాటెపల్లి కమలమ్మ | బుచ్చయ్య | | | | | |
| | | సంజీవ అంజమ్మ | సాయిలు | | | | | |
| | | సంజీవ కిష్టమ్మ | | | | | | |
| | | బత్తుల గోపమ్మ | | | | | | |
| | | సంజీవ లక్ష్మ య్య | | | | | | |
| | | తోట యెల్లయ్య | | | | | | |
| | | తోట లింగస్వామి | | | | | | |
| | | సంజీవ ముత్తయ్య | | | | | | |
| | | గుండెబోయిన సత్తమ్మ | | | | | | |
| | | పలుసం యాదయ్య | | | | | | |
| | | పలుసం వెంకటేశం | | | | | | |
| | | ఒక్కిడి రామచంద్రారెడ్డి | | | | | | |
| | | పుసలి బుచ్చయ్య | | | | | | |
| | | అంకురి నర్సయ్య | | | | | | |
| | | | | | మొత్తం | 5-25 | | |

భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపన ( తెలంగాణ సవరణ) చట్టం, 2016 (చట్టం 21/2017) పారదర్శకత మరియు పరిహారాన్ని కొరకు హక్కు చట్టం ద్వారా సవరించబడిన విధముగా భూసేకరణ పునరావాస మరియు పునస్థాపన (తెలంగాణ సవరణ) చట్టం 2013 (కేంద్ర చట్టం 30/2013)లో సక్రమ పరిహారం మరియు పారదర్శకత హక్కు యొక్క సెక్షన్ 11 (1) యొక్క నిబంధనల క్రింద ఇందుకు సంబంధించిన వారందరికి ఈ ప్రకటన చేయబడినది.

భూమి యొక్క ప్లాన్ జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే.), ఆర్ అండ్ ఆర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా వారి కార్యాలయములో ఏదైనా పని దినములలో పరిశీలించు కొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారు సరియైన ప్రభుత్వము సదరు చట్టం యొక్క సెక్షన్ 12 లో తెలిపిన మరియు నిర్దేశిత విధంగా వారి పనిని సరిగా చేపట్టుట కొరకు అవసరమైన అన్నీ ఇతర చట్టాలను చేయుటకు & భూమి లోనికి ప్రవేశించుటకు మరియు సరిగా చేయుటకు యేదేని భూమి యొక్క ఎత్తు పల్లాలు తీసుకొనుటకు సబ్ సాయిల్ త్రవ్వుటకు లేదా బోర్ వేయుటకు ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే.) ఆర్ అండ్ ఆర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా అధికారి మరియు అతని సిబ్బందికి పై చట్టం ద్వారా అధికారం సంక్రమించనైనది.

సెక్షన్ 11(4) క్రింద కలెక్టర్ యొక్క ముందస్తు ఆమోదాలు లేకుండా లేకుండా ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి యొక్క ఏదేని లావాదేవీలు అనగా అమ్మకాలు / కొనుగోలు మొదలైనవి లేదా అటువంటి భూములపై ఏవేని రుణభారములు సృష్టించుటకు కారణమగుట లేదా ఏదేని లావాదేవీ ఏ వ్యక్తి చేయరాదు.

పరిహారం యొక్క సంప్రదింపుల ద్వారా పరిష్కారం కొరకు ఆసక్తి /ప్రభావితమయే వ్యక్తులందరి నుండి క్లెయింలు మరియు సేకరణకు అభ్యంతరాలు ఏమైనా ఉంటే భూమిలో ఆసక్తి గల వ్యక్తులు చట్టం యొక్క సెక్షన్ 15 క్రింద ఏర్పాటు ప్రకారం ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి 60 (అరువది) రోజుల లోపల భూమిలో ఆసక్తి గల వ్యక్తులచే జిల్లా కలెక్టరు/అధీకృత సమక్షములో సమర్పించవచ్చు.

| సం/- | సం/- | సం/- |
|---|---|---|
| ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), ఆర్ అండ్ ఆర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా | అదనపు కలెక్టర్, యాదాద్రి భువనగిరి | జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి |

DIPR RO NO. 878/LA/PP/Advt/Pub/2026-27

# ప్రజా వ్యతిరేక నిర్ణయం

**● యుపిఐ చార్జీలపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ప్రతిపక్ష ఎంపిల ఆందోళన**




**న్యూఢిల్లీ :** యుపిఐ లావాదేవీలపై రుసుములు విధిందునకు సంబంధించి మోదీ సర్కార్‌పై ప్రతిపక్ష ఎంపిలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రూ. 2,000 కంటే ఎక్కువ విలువైన యుపిఐ చెల్లింపులపై వ్యాపారులకు రుసుము విధించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రతిపక్ష ఎంపిలు 'ప్రజా వ్యతిరేక' చర్యగా అభివర్ణించారు. దేశవ్యాప్తంగా దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోందని పేర్కొంటూ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో వారు ఈ అంశాన్ని లేవనెత్తారు. 2026–27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో 7.8 శాతంగా నమోదైన జిడిపి వృద్ధి రేటును లెక్కించడానికి అనుసరించిన విధానంపై కూడా కమిటీ సమావేశంలో కొందరు ప్రతిపక్ష ఎంపిలు ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు ఎంపిలు ఈ అంశాన్ని సమావేశంలో లేవనెత్తారని, కమిటీ తదుపరి సమావేశంలో దీనిపై చర్చించే అవకాశం ఉందని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ ఫైనాన్స్ చైర్మన్ భర్తృహరి మహతాబ్ తెలిపారు. బుధవారం నాటి సమావేశం ఎజెండాలో యుపిఐ అంశం భాగం కాదని మహతాబ్ చెప్పారు. 'అయితే, దీనిపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ప్రస్తుత కమిటీ పదవీకాలం అక్టోబర్ నెలతో ముగుస్తున్నందున, కొత్త కమిటీ దీనిని పరిశీలిస్తుందని నేను భావిస్తున్నాను' అని ఆయన అన్నారు. వ్యాపారులకు చేసే రూ. 2,000 కంటే ఎక్కువ చెల్లింపులపై రుసుము విధించాలన్న ప్రభుత్వ నిర్ణయం వల్ల దేశంలోని ప్రజలందరూ ప్రభావితమవుతారని కమిటీ సభ్యుడైన ఆర్ఎస్పి ఎంపి ఎన్.కె. ప్రేమచంద్రన్ అన్నారు. ఇది పూర్తిగా ప్రజా వ్యతిరేక నిర్ణయమని ఆయన పేర్కొన్నారు. ప్రతి రోజూ లక్షలాది లావాదేవీలు జరుగుతుంటాయని, రుసుము విధించే నిర్ణయం ఏకపక్షం అని ప్రేమచంద్రన్ చెప్పారు. ఏ పార్లమెంటరీ కమిటీ కార్యకలాపాలైనా గోప్యతతో కూడుకున్నవని, వాటిపై వ్యాఖ్యానించడం సముచితం కాదని కాంగ్రెస్ ఎంపి మనీష్ తివారీ అన్నారు. అయితే, యుపిఐ, దానిపై విధించబోయే లావాదేవీల ఛార్జీల విషయంలో దేశవ్యాప్తంగా ఆందోళన, ఆగ్రహం వ్యక్తమవుతున్నందున దేశ ప్రజలను కలవరపెట్టే అంశాలు పార్లమెంటరీ కమిటీ సమావేశాల్లోనూ ప్రతిబింబిస్తాయని, చర్చకు వస్తాయని అన్నారు. దాదాపు ఆరేళ్లపాటు పూర్తిగా ఉచితంగా ఉన్న యుపిఐ చెల్లింపుల విధానానికి స్వస్తి పలుకుతూ, అక్టోబర్ 15 నుండి వ్యాపారులకు యుపిఐ ద్వారా చేసే రూ. 2,000 కంటే ఎక్కువ విలువైన లావాదేవీలపై 0.4 శాతం రుసుమును ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అదే సమయంలో, సాధారణ వ్యక్తుల మధ్య జరిగే లావాదేవీలు, చిన్న మొత్తాల చెల్లింపులను ఈ రుసుము పరిధి నుండి మినహాయించింది. కాగా,

వర్చువల్ డిజిటల్ అసెట్స్ (విడిఎఎస్) అంశంపై కూడా కమిటీ చర్చించిందని, త్వరలో పార్లమెంటుకు తన నివేదికను సమర్పించే అవకాశం ఉందని మహతాబ్ తెలిపారు. 'గత ఏడాది కాలంలో మేము వరుసగా చర్చలు జరిపాము. నాకు గుర్తున్నంత వరకు, వర్చువల్ డిజిటల్ అసెట్స్‌పై మా మొదటి సమావేశం గత సెప్టెంబర్ 2025లో జరిగింది. ఈ మధ్య కాలంలో, మేము అనేక వర్గాల వారితో సంప్రదింపులు జరిపాము ఇందులో ఆర్‌బిఐ, సిబిడిటి, వర్చువల్ అసెట్స్ వ్యవహారాల్లో వివిధ హోదాల్లో నమోదైన ఇతర సంస్థలు ఉన్నాయి అని ఆయన చెప్పారు. బుధవారం జరిగిన సమావేశంలో సమగ్ర చర్చ జరిగిందని బిజెపి తెలిపారు.

# ట్రంప్ ముందు మోదీ సాష్టాంగ నమస్కారం

**అమెరికాకు భారీ మొత్తంలో డబ్బు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు**

**యుపిఐ చార్జీలపై ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి**

**లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ డిమాండ్**



**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందు 'సాష్టాంగ నమస్కారం' చేసి, అమెరికాకు భారీ మొత్తంలో డబ్బు ఇవ్వాలని నిర్ణయించుకున్నారని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. యుపిఐ చెల్లింపులపై రుసుము విధించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. 'అమెరికా ముందు సాష్టాంగ నమస్కారం చేయడం ఆపండి, వెన్నెముక తెచ్చుకోండి, నిలబడండి' అని బుధవారం ఎక్స్‌లో రాహుల్‌గాంధీ పోస్టు చేశారు. ప్రభుత్వం మంగళవారం, అక్టోబర్ 15 నుంచి యుపిఐ ద్వారా వ్యాపారులకు చేసే రూ. 2,000 పైబడిన బదిలీలపై 0.4 శాతం రుసుమును ప్రవేశపెట్టింది. అదే సమయంలో, రోజువారీ వ్యక్తిగత లావాదేవీలు, చిన్న చెల్లింపులపై ఎలాంటి ఛార్జీ విధించకుండా స్పష్టంగా మినహాయించింది. దీనిపై రాహుల్‌గాంధీ స్పందిస్తూ మాజీ ప్రధాని ఇందిరా గాంధీని.. మీరు క్షడమ వైపు మొగ్గ చూపుతారా లేక కుటివైపు మొగ్గ చూపుతారా అని అడిగినప్పుడు, నేను ఎటువైపూ మొగ్గ చూపనని, నిటారుగా నిలబడతాను అని ఆమె సమాధానమిచ్చారన్నారు. అయితే మోదీజీకి పూర్తిగా భిన్నమైన భావన ఉందని, ఆయన డొనాల్డ్ ట్రంప్ ముందు నిటారుగా పడుకుని సాష్టాంగ నమస్కారం చేయాలని నిర్ణయించుకున్నారని ఆరోపించారు. 'ఆయన (మోదీ) యుపిఐపై పన్ను విధించి, అమెరికాకు భారీ మొత్తంలో డబ్బు ఇవ్వడం ద్వారా ప్రతి ఒక్క భారతీయుడిపై పన్ను విధించారు అని ఇందిరా గాంధీ చిత్రపటం ముందు నిలబడి ఉన్న వీడియోలో గాంధీ అన్నారు. 'మోదీజీ, యుపిఐ పన్నును వెనక్కి తీసుకోండి. అది కూడా ఇప్పుడే అని ఆయన ఆ వీడియోతో పాటు పెట్టిన ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు.

# పునరాలోచన ప్రసక్తే లేదు

**యుపిఐ చార్జీలపై కేంద్ర వర్గాల వెల్లడి**

**న్యూఢిల్లీ :** యుపిఐ చెల్లింపులపై రుసులుములు విధించడంపై ప్రతిపక్షాల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి ప్రదర్శిస్తోంది. రూ. 2,000 కంటే ఎక్కువ విలువైన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యుపిఐ) లావాదేవీలపై 0.4 శాతం ఎండిఆర్ (మర్చంట్ డిస్కౌంట్ రేట్) ఛార్జీలను విధించే అంశంపై పునరాలోచన చేసే ప్రసక్తే లేదని ప్రభుత్వ వర్గాలు బుధవారం తెలిపాయి.

అక్టోబర్ 15 నుండి అమలు కానున్న ఈ ఛార్జీల ప్రతిపాదనను వెనక్కి తీసుకునే ఆలోచన ఏమైనా ఉందా అని అడిగినప్పుడు, ఒక ఉన్నతాధికారి స్పందిస్తూ.. దీనిపై ఇప్పటికే నిర్ణయం తీసుకున్నామని, దానిని మార్చే లేదా వెనక్కి తీసుకునే ప్రశ్న లేదని చెప్పారు. యుపిఐ వ్యవస్థ (ఎకోసిస్టమ్) ప్రయోజనాల దృష్ట్యా, దాని భద్రతను బలోపేతం చేసే లక్ష్యంతోనే ఎండిఆర్ ఛార్జీలను విధించాలని నిర్ణయించినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఇతర దేశాల్లో ఉన్న విధానం మాదిరిగానే ఛార్జీలు విధించాలని 2020లో యుపిఐ వ్యవస్థను ప్రవేశపెట్టినప్పుడే నిర్ణయం తీసుకున్నామని, ఈ కొత్త ఎండిఆర్ విధానం యుపిఐని స్వయంసమర్థవంతంగా మారుస్తుందని ఆ వర్గాలు వివరించాయి. ఈ నిర్ణయంపై వ్యాపారులు, దుకాణదారులు, రాజకీయ పార్టీల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. వారు ఈ చర్యను 'మోదీ పన్ను' అని అభివర్ణించారు. కాంగ్రెస్‌తో సహా కొన్ని ప్రతిపక్ష పార్టీలు, అమెరికా ఒత్తిడికి తలొగ్గి ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిర్ణయం తీసుకున్నారని ఆరోపించాయి.

# అమెరికన్ సామ్రాజ్యవాదానికి తలొగ్గిన కేంద్రం

**● 'నోటా'కు ప్రధాని మోదీ కొత్త అర్థం చెప్పారని కాంగ్రెస్ విమర్శ**



**న్యూఢిల్లీ :** యుపిఐ లావాదేవీలపై కొత్తగా తీసుకొచ్చిన మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండిఆర్) రాజకీయ దుమారం రేపుతోంది. కేంద్రం ప్రభుత్వం అమెరికన్ సామ్రాజ్యవాదానికి తలొగ్గిందని ప్రతిపక్షం ఆరోపించింది. అంతేకాకుండా ప్రధాని నోటాకు కొత్త నిర్వచనం ఇచ్చారని అదే 'నరేంద్ర ఆన్‌గోయింగ్ ట్రంప్ అప్పీజ్‌మెంట్' అర్థం చెబుతున్నారని వ్యాఖ్యానించింది. ఈ చర్య చాలా నిత్యావసర వస్తువుల ధరలను పెంచుతుందని ప్రతిపక్షం పేర్కొంది. యుపిఐతో పోటీ పడటానికి అమెరికా కార్డు కంపెనీలకు వీలు కల్పించేందుకే మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండిఆర్)ను ప్రకటించారా అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ప్రశ్నించారు. భారతదేశంపై 100 శాతం సుంకాలను ప్రతిపాదించే బిల్లుపై గురువారం అమెరికా ప్రతినిధుల సభ ఓటు వేయనుందని రమేష్ బుధవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ కఠినమైన చట్టాన్ని అమెరికా సెనేట్ ఇప్పటికే ఆమోదించిందని ఆయన గుర్తు చేశారు. ట్రంప్ ప్రభుత్వం భారతీయ వలసదారులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటోందని, వారికి వ్యతిరేకంగా కఠినమైన చట్టాలు చేస్తోందని రమేష్ 'ఎక్స్'లో అన్నారు. హెచ్1బి వీసా ఖర్చులను పెంచారని, ఉద్యోగం లేనప్పుడు అటువంటి వీసా హోల్డర్లను త్వరలోనే దేశం నుండి బహిష్కరించే అవకాశం ఉందని, వీరిలో అధికశాతం ఐటీ నిపుణులే ఉన్నారని ఆయన అన్నారు.'ఇక్కడ, మోదీ ప్రభుత్వం జీరో ఎండిఆర్‌ను తొలగించి, యుపిఐకి ఛార్జీలు విధించాలన్న అమెరికా డిమాండ్‌కు తలొగ్గింది. యుపిఐ ఉచితంగా ఉండటం వల్ల వీసా, మాస్టర్ కార్డ్‌లను వెనక్కి నెట్టివేసిందని ఈ ఏడాది ఆరంభంలోనే యుఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ విమర్శించారు అని రమేష్ అన్నారు. '0.4% ఎండిఆర్ ఎందుకు? డెబిట్ కార్డు ఎండిఆర్ కూడా 0.4% ఉన్నందువల్లేనా? యుపిఐతో పోటీ పడేందుకు యుఎస్ కార్డ్ కంపెనీలకు అవకాశం కల్పించడానికేనా ఇది చేస్తున్నారు?' అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం చెబుతున్నట్లుగా ఇది యుపిఐని సుస్థిరంగా నిలబెడుతుందా అని ఆ కాంగ్రెస్ నాయకుడు ప్రశ్నించారు. మొత్తం యుపిఐ వ్యవస్థను నడపడానికి అయ్యే వార్షిక అంచనా వ్యయం సుమారు రూ. 20,000 కోట్లు అని పేర్కొంటూ, మోదీ ప్రభుత్వానికి ఆరోగ్యకరమైన ప్రజా ఆర్థిక వ్యవస్థను చూపించడానికి గత కొన్నేళ్లుగా ఆర్‌బిఐ కేంద్ర ప్రభుత్వానికి బదిలీ చేస్తున్న దానిలో ఇది 10 శాతం కంటే తక్కువ అని రమేశ్ అన్నారు. రమేశ్ మరో పోస్ట్ చేస్తూ ఎండిఆర్ పాలనను '2017 జిఎస్‌టి పునరావృతం' అని అభివర్ణించారు. ఈ విషయంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణదీప్ సుర్జేవాలా కూడా ప్రభుత్వంపై విమర్శలు చేశారు. అక్టోబర్ 15 నుండి రూ. 2,000 కంటే ఎక్కువ విలువైన లావాదేవీలపై యుపిఐ లావాదేవీల పన్ను విధించడానికి మార్గం సుగమం చేసినందున, సెప్టెంబర్ 14ను బిజెపి ప్రభుత్వ 'డిజిటల్ విధానపరమైన యూటర్న్' (అకస్మాత్తు మార్పు) 'ద్రోహం, లొంగుబాటు' దినంగా గుర్తుంచుకోవాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ అభిప్రాయాలను సమర్థిస్తూ, టిఎంసి ఎంపి సౌగతా రాయ్ మాట్లాడుతూ, యుపిఐ లావాదేవీలపై రుసుము విధించే ఆలోచనను కాంగ్రెస్ వ్యతిరేకించిందని, ఆ వ్యతిరేకత సమంజసమేనని అన్నారు. ఎందుకంటే దీనివల్ల చాలా రకాల వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉంది. పాట్నాలో, ఆర్‌జెడి ఎంపి మనోజ్ ఝా కూడా ఈ అంశంపై ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. 'ఇది వారు స్వయంగా, తమ సొంత విచక్షణతో తీసుకున్న నిర్ణయం కాదు. మనం అమెరికా సామ్రాజ్యవాదం గురించి మాట్లాడేటప్పుడు, ఇది దానికి తలవంచడం లాంటిది. ఇప్పుడు వారు రూ. 2,000 లోపు లావాదేవీల విషయంలో ఒక వివరణ ఇచ్చారు. 'మొదట వారు ప్రజలను డిజిటల్ లావాదేవీల వైపు మళ్లించారు. ఇప్పుడు దీనివల్ల ఎన్ని విషయాలు, ఏయే విధాలుగా ప్రభావితం అవుతాయో చూడండి' అని ఆయన అన్నారు.

# అంతర్జాతీయ ఆయుధీకరణతో మానవాళికి ముప్పు : ఐడిపిడి

**న్యూఢిల్లీ :** అంతరిక్షాన్ని యుద్ధ రంగాలుగా మార్చే చర్య అత్యంత ప్రమాదకరమైనదని, అది మానవాళికి వ్యతిరేకమని ఇండియన్ డాక్టర్స్ ఫర్ పీస్ అండ్ డెవలప్‌మెంట్ (ఐడిపిడి)పేర్కొంది. ఈ మేరకు ఐడిపిడి అధ్యక్షుడు డాక్టర్ అరుణ్ మిత్రా, ప్రధాన కార్యదర్శి డాక్టర్ షకీల్ ఉర్ రెహ్మాన్ ఒక ప్రకటన విడుదల చేశారు. తాము అంతరిక్షంలో ఆయుధాలను మోహరించినట్లు అమెరికా ఇప్పటికే ధృవీకరించిందని, మానవాళిని తీవ్ర సంక్షోభంలోకి నెట్టే అనేక యుద్ధాలతో ప్రపంచం ఇప్పటికే సతమతమవుతోందని తెలిపారు. అంతరిక్ష అన్వేషణ అనేది ఒక గొప్ప శాస్త్రీయ విజయమని, దానిని మానవాళి శ్రేయస్సు కోసం,వివిధ శాస్త్రీయ ఆవిష్కరణల ప్రయోజనాలను పొందేందుకు ఉపయోగించాలని ఆయన అన్నారు. అంతరిక్షంలో ఆయుధాలను మోహరిస్తే, యుద్ధం జరిగే ప్రమాదం, హానికరమైన పరిణామాలు గణనీయంగా పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంతరిక్షంలో తిరిగే ఉపగ్రహాలు నిరంతరం లక్ష్యాలుగా మారే అవకాశం ఉంది, తద్వారా అనేక ప్రయోజనకరమైన కార్యకలాపాలు ప్రమాదంలో పడతాయని హెచ్చరించారు. అంతరిక్ష అన్వేషణ కేవలం శాంతియుత ప్రయోజనాల కోసమే ఉండాలని, భవిష్యత్తులో తీవ్ర ప్రమాదాలకు దారితీసే సైనికీకరణ కోసం కాకూడదని డాక్టర్ అరుణ్ మిత్ర, రెహ్మాన్ పేర్కొన్నారు. ఇది ఆయుధ పోటీని మరింత తీవ్రతరం చేస్తుందని, ఖగోళ వస్తువులను ఆక్రమించుకోవడానికి ఒక విపరీతమైన పోటీని ప్రారంభిస్తుందన్నారు. మానవాళి ప్రయోజనాల కోసం ఉపయోగించాల్సిన నిధులు భారీగా వృథా అవుతాయని, అంతరిక్షం, భూమిపై ఉన్న వ్యవస్థల మధ్య శత్రు సమాచార వ్యవస్థలను (కమ్యూనికేషన్స్) దెబ్బతీయడానికి లేదా జామ్ చేయడానికి, అలాగే వారి సైబర్‌నెట్‌వర్క్‌లపై దాడి చేయడానికి ఇది వీలు కల్పిస్తుందన్నారు. అంతరిక్ష ఆయుధీకరణకు వ్యతిరేకంగా చట్టం చేయాల్సిన తక్షణ అవసరం ఉందని వారన్నారు. 1967 నాటి 'బాహ్య అంతరిక్ష ఒప్పందం' అంతరిక్షంలో అణు ఆయుధాల వినియోగాన్ని నిషేధించిందని, సంప్రదాయ ఆయుధాలను కూడా ఇందులో చేర్చేలా దీనిని సవరించాలని వారు కోరారు. ఈ ఉద్దేశంతో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సమావేశాన్ని వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. అంతరిక్ష సైనికీకరణకు వ్యతిరేకంగా సమిష్టి గళం వినిపించాలని ప్రపంచ దేశాలకు ,ప్రపంచవ్యాప్తంగా ఉన్న పౌర సమాజ సంస్థలకు విజ్ఞప్తి చేశారు.


# లింగ సమానత్వ సూచీలో 131వ స్థానంలో భారత్

**వరుసగా 16వ సారి తొలి స్థానంలో నిలిచిన ఐస్‌లాండ్**

**న్యూఢిల్లీ :** స్త్రీ, పురుష సమానత్వం విషయంలో భారత్ 131వ స్థానంలో నిలిచింది. గతేడాది ఉన్న ర్యాంకునే మళ్లీ ఇండియా నిలుపుకుంది. లింగ సమానత్వంలో వరుసగా 16వ సారి తొలి స్థానంలో ఐస్‌లాండ్ నిలిచింది. ఫిన్‌లాండ్ నార్వే, నమీబియా, యుకె వరుసగా రెండు, మూడు, నాలుగు, ఐదో స్థానాల్లో నిలిచాయి. ప్రపంచంలోని 148 దేశాల్లో లింగ సమానత్వ స్థితిగతుల సమాచారంతో 'గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్ 2026'ను వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఇఎఫ్) బుధవారం విడుదల చేసింది. 145 దేశాలున్న ఈ సూచికలో భారత్ కంటే దిగువన కేవలం పపువా న్యూ గినియా, కువైట్, ఒమన్, ఖతార్, తజికిస్థాన్, సౌదీ అరేబియా, ఈజిప్ట్, మొరాకో, మాలి, అల్జీరియా, కాంగో వంటి 14 దేశాలు ఉన్నాయి. డబ్ల్యూఇఎఫ్ విడుదల చేసిన సూచికలో చాద్ అత్యల్ప ర్యాంకు (145) పొందిన దేశంగా నిలిచింది. ఇరాన్(144), పాకిస్థాన్ (143) ర్యాంకులతో అట్టడుగు జాబితాలో నిలిచాయి. డబ్ల్యూఇఎఫ్ సూచిక ప్రకారం, 2006లో తొలిసారి తాము తొలిసారి విడుదల చేసిన గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్‌ను, తాజా సూచికతో పోల్చింది వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్. ప్రపంచంలోనే అత్యధిక జనాభా (సుమారు 150 కోట్లు) ఉన్న భారత్‌లో 'ప్యారిటీ స్కోర్' 64.5 శాతంగా ఉంది. ఇది ప్రపంచ సగటు కంటే తక్కువ. గతేడాదితో పోలిస్తే భారత్ 'ప్యారిటీ స్కోర్' కొద్దిగా మెరుగుపడింది. మొత్తంగా 2006 నుంచి ఇప్పటి వరకు భారత్‌లో లింగ సమానత్వం 4.3 శాతం పాయింట్లు పెరిగింది. దీనికి ప్రధాన కారణం విద్యా రంగంలో సాధించిన పురోగతి అని వరల్డ్ ఎకనామిక్ ఫోరం అంచనా వేసింది. ఆర్థిక భాగస్వామ్యం, ఉపాధి అవకాశాల్లో భారత్ 41.2 శాతం ప్యారిటీ స్కోర్‌ను నమోదు చేసింది. వృత్తి, సాంకేతిక రంగ కార్మికులు సాధించిన బలమైన పురోగతి కారణంగా ఆయా రంగాల్లో దేశంలో ప్యారిటీ స్కోర్ 2006లో 26.6 శాతం ఉండగా, 2026 నాటికి అది 49.9 శాతానికి చేరింది. రాజకీయ సాధికారత విభాగంలో దేశ ప్యారిటీ స్కోర్ మునుపటి ఏడాది కంటే 0.7 పాయింట్లు మేర తగ్గింది. భారత ప్రభుత్వంలోని మంత్రి పదవుల్లో మహిళల ప్రాతినిధ్యం 2006లో 2.4 శాతం ఉండగా, అది 2026 నాటికి 5.9 శాతానికి పెరిగింది. 2019లో ఈ విభాగంలో భారత్ అత్యధికంగా 30 శాతం ప్యారిటీ స్కోర్‌ను నమోదు చేసింది. ఆరోగ్య జీవన స్థితిగతుల విభాగంలోనూ ఈ ఏడాది భారత్ మెరుగైన ప్యారిటీ స్కోర్‌ను సాధించింది. 2006 నుంచి తాము పర్యవేక్షిస్తున్న దాదాపు ప్రతి ఆర్థిక వ్యవస్థ లింగ సమానత్వంలో పురోగతి సాధించిందని జెనీవాకు చెందిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ తెలిపింది.

# మక్కాపై గురిపెట్టిన హౌతీలు: సౌదీ అలర్ట్

- పలు నగరాలపై పెరిగిన దాడులు
- యాన్‌బూ పోర్టు మూసివేత: పెరిగిన చమురు ధరలు
- ఈజిప్టు సహాయం కోరిన సౌదీ యువరాజు
- ఆరోపణలకు హౌతీల ఖండన



**దుబాయ్:** సౌదీ అరేబియా నౌకలపై హౌతీ ఉగ్రవాద సైన్యాలు దాడులు విస్తృతం చేశాయి.సౌదీ యుద్ధ విమానాన్ని కూల్చివేసి నట్లు హౌతీలు బుధవారం ప్రకటించారు. సౌదీఅరేబియాను లక్ష్యంగా చేసుకుని హౌతీలు తీవ్రమైన దాడులు చేస్తున్నాయి. సౌదీ నౌకలను తిరగనివ్వకుండా ఆ నౌకలను ధ్వంసం చేస్తు న్నాయి. బాబ్ అల్‌మందెబ్ ప్రాంతాన్ని,మోఖా ఓడరేవు,ఎర్ర సముద్ర తీర ప్రాంతాలను హౌతీలు స్వాధీనం చేసుకోవడంతో వారి పోరాట సామర్థ్యం ఇనుమడించింది. ఎర్ర సముద్రంలో చమురు నౌకల రవాణా మార్గాలు తీవ్రమైన ఒత్తిడికి గురవుతు న్నాయి. ఎర్ర సముద్రతీరంలో యాన్‌బూ ఓడరేవును సౌదీ ప్రభుత్వం మూసివేసింది. దీంతో అక్కడి చమురు ఎగుమతి కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఈ పరిస్థితుల్లో చమురు ధరలు అంతర్జాతీయంగా విపరీతంగా పెరిగాయి. ఈ పెరుగు దల అమెరికాపై అతితీవ్రమైన ప్రభావం చూపించింది. అక్కడ ద్రవ్యోల్బణం గణనీయంగా పెరిగింది. మరోవైపు అన్సరుల్లా హౌతీలు,సౌదీ అరేబియా మద్దతు ఉన్న అంతర్జాతీయ గుర్తింపు పొందిన యెమెన్ ప్రభుత్వ సైన్యాలకు మధ్య పోరాటం ఉద్ధృ తంగా మారింది.యెమెన్ సైన్యాలు తీవ్రంగా ఓడిపోతున్నాయి. యెమెన్ తీర ప్రాంతాలను హౌతీ సైన్యాలు స్వాధీనం చేసుకుం టున్నాయి. ఈ యుద్ధం చివరకు అంతర్యుద్ధంగా మారింది. గతవారంలోనే 500 మంది అంతర్యుద్ధంలో మరణించారు. 80వేలమంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఈ పరిస్థితులపై ఐక్యరాజ్యసమితి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సామాన్య ప్రజలకు భరోసా ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది.

మక్కాను లక్ష్యంగా చేసుకుని హౌతీలు దాడులు చేస్తున్నారని సౌదీ అరేబియా ప్రభుత్వం ఆరోపించింది.ఈ పరిస్థితుల్లో మక్కానగరంలో మొట్టమొదటిసారి తీవ్రమైన హెచ్చరికలు జారీ చేసి అందరినీ అప్రమత్తం చేశారు.ఐతే మక్కాను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణలను హౌతీ ఉగ్ర వాద సైన్యాలు తీవ్రంగా ఖండించాయి. సౌదీ నగరాలపై దాడులు చేస్తున్నట్లు అంగీకరించాయి. ఈశాన్య ఎమెన్‌లో ప్రభుత్వ సైన్యాలతో జరుగుతున్న పోరాట దృశ్యాల వీడియో లను హౌతీలు విడుదల చేశారు. తమ రక్షణకు సహకరించాలని ఈజిప్టు ప్రభుత్వాన్ని సౌదీ అరేబియా కోరింది. సౌదీ యువ రాజు మహ్మద్ బిన్ సల్మాన్ బుధవారం కైరోలో ఈజిప్టు అధ్య క్షుడు అబ్దుల్ అల్‌ఫతా ఎల్‌సిసితో సమావేశం జరిపారు. సౌదీ అరేబియా భద్రత ఈజిప్టు జాతీయ భద్రతలో అంతర్భాగమని ఈ సందర్భంగా విడుదలైన ప్రకటన ఉద్ఘాటించింది.

### పాకిస్థాన్‌లో లీటరు డీజిల్ రూ.415లు స్మార్ట్ లాక్‌డౌన్‌కు ప్రభుత్వం యోచన

హోర్ముజ్ జలసంధిలో,ఎర్ర సముద్రంలో బాబ్ ఎల్ మందేబ్ జలసంధి ద్వారా చమురు,సహజవాయువు నౌకల ణా తీవ్రస్థా యిలో క్షీణించిపోవడంతో ఈ పరిస్థితులను తప్పించుకోవడా నికి స్మార్ట్ లాక్‌డౌన్ అమలు చేసే విషయాన్ని పాకిస్థాన్ ప్రభుత్వం పరిశీలిస్తోంది.పాకిస్థాన్‌లో చమురు అవసరాలపై తీ వ్ర ఆందోళన రేకెత్తింది. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధర ఆకాశాన్ని అంటిందని,ఈ షాక్‌ను తట్టుకోవడంలో ప్రభుత్వ సామర్థ్యం సరిపోవడంలేదని పాకిస్థాన్ ఇంధనమంత్రి అవేస్ లెఘారీ,వాతావరణ మార్పుల మంత్రి ముసాదిక్ మాలిక్ పత్రి కాగోష్ఠిలో వివరించారు. ప్రభుత్వం ఇంధన ఉపశమన పథకం అమలు చేసే ఆలోచనలో ఉందని, ఈ పథకం కింద మోటారు సైకిళ్ళకు పది రోజులకు ఐదు లీటర్లు,కార్లకు పది రోజులకు పది లీటర్లు ఇచ్చే విషయం ఆలోచిస్తున్నట్లు చెప్పారు. వాణా లకు సంబంధించిన ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు వీలుగా ఒక ప్రణాళిక అమలు చేయడానికి ప్రతిపాదనలపై ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ అధ్యక్షతన ఒక సమీక్షా సమా వేశం జరిగింది. ఇందులో ప్రభుత్వ,ప్రైవేటురంగ అధిపతులు పాల్గొన్నారు. ప్రభుత్వం మంగళవారం రాత్రికి రాత్రే విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం, పెట్రోలు ధరలను అదనంగా లీట రుకు రూ.4.10 డీజిలు ధరలు లీటరుకు రూ.6.41లకు పెంచింది.దీంతో లీటరు పెట్రోలు ధర రూ.384.34లు,డీజిలు ధర లీటరుకు రూ.415.83కు చేరుకుంది.

## 27 యూరప్ దేశాల్లో టీనేజర్లకు సోషల్ మీడియా నిషేధం

### ఉర్సులా వోండెర్‌లేయన్ ప్రతిపాదన



**బ్రస్సెల్స్:** యూరోపియన్ యూనియన్ (ఇ.యు)లోని 27 దేశాల్లో 13 ఏళ్ళ లోపు పిల్లలకు సోషల్ మీడి యాను నిషేధించాలని ఇ.యు కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వోండర్ లేయన్ ప్రతిపాదించారు.అదే విధంగా పెద్ద వయసువారికి కూడా ఈ సోషల్ మీడియా వేదికలు అందుబా టులో ఉండే విషయంపై నియంత్ర ణలు,పరిమితులు అమలు చేయాలని యూరోపియన్ యూని యన్ సమావేశంలో చేసిన కీలక ప్రసంగంలో ఆమె బుధవారం ప్రతి పాదించారు. 15 నుండి 18 ఏళ్ళ వయసుగల వారికోసం అత్యంత సుర క్షితమైన సోషల్ మీడియా వేదికల డిజైన్లు రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలకు ఒక్కసారిగా అశ్లీల చిత్రాలను చూడకూడ దని, వాటి అవసరం మనకులేదని, దశలవారీగా పిల్లలకు సోషల్ మీడియాను రక్షణ పద్ధతుల్లో పరిచయం చేయా లని కోరారు. ప్రపంచవ్యాప్తంగా మానవాళిని ఆన్‌లైన్ హాని నుండి కాపాడేందుకు శాయశక్తులా జరుగుతున్న ప్రయత్నాలను ఈ ప్రతిపాదనల ద్వారా వోండర్ లేయన్ బలపరిచారు.యూరప్ దేశాలు, యూరప్ ఖండం ఎదు ర్కొంటున్న సమస్యలు, సుకురావాల్సిన సంస్కరణలు, సైనిక, వాణిజ్య, వాతావరణ మార్పుల ప్రణాళిక, కృత్రిమ మేధ వినియోగ ఆవశ్యకత,సద్వినియోగం, చైనాతో సంబంధాలు వంటి అనేక విస్తారమైన విషయాల గురించి చర్చించారు. కొత్త ప్రణాళికలను ఆవిష్కరించారు.అమెరి కాతో వాణిజ్య వివాదం నేపథ్యంలో కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ ఈ సదస్సులో పాల్గొనడం అత్యంత ప్రాము ఖ్యతగల విషయంగా మారింది. కెనడా,బ్రిటన్ వంటి భావసారూప్యతగల దేశాలతో కలిసి పనిచేయడానికి ఆమె సుముఖత వ్యక్తం చేశారు. కృత్రిమ మేధస్సు,క్లీన్ ఎనర్జీ,వ్యవసాయం, నీటి భద్రత, యూరప్ వాణిజ్య అవసరా లను ఆమె ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రపంచదేశాలకంటే చాలా భిన్నంగా యూరప్ వేగంగా వాతా వరణ మార్పులకు గురవుతోం దని, తీవ్రస్థాయిలో వేడెక్కిపోతోం దని ఆందోళన వ్యక్తం చేశారు. గడ చిన వేసవికాలంలో చరిత్రలో లేని విధంగాఉష్ణోగ్రతస్థాయిలో నమోదైన వడగాలులవల్ల యూరప్ దేశాల్లో 35,000 మందిమరణించారన్నారు. దావా నలం కారణంగా ఒక్క ఎకరాలు యూరప్ కోల్పోయిందన్నారు. వాతావరణ మార్పులను తట్టుకునే విధంగా ఒక కొత్త ప్రణాళికను ఆమె ప్రతిపాదించారు. సత్వర ముందస్తు హెచ్చరిక వ్యవస్థను అభివృద్ధి చేయా లని కోరారు. ఆహార భద్రతను మెరుగుపరుచుకోవా లని,వ్యవసాయానికి నీటి అవసరాలను విస్తరించుకోవా లని,రిస్క్ మేనేజ్‌మెంట్ ఉండాలని,రైతుల సవాళ్ళను పరి ష్కరించాలని వోండర్ లేయన్ అన్నారు.

యుఫ్‌కు ఎఐ కావాలని, అదొక హ్యూమన్ ఏజన్సీగా ఉండాలన్నారు. విద్య నుండి ఉపాధి వరకూ నాణ్యతా ప్రమాణాలు పెంచుకోవడానికి ఎఐ కావాలన్నారు. సద్వి నియోగం చేసుకుంటే ఎఐ వల్ల ఎన్నో ప్రయోజనాలున్నా యన్నారు.

## నిజనిర్ధారణ కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఆదేశించారు. నిజానిర్ధారణ కమిటీ 30 రోజుల్లో విచారించి వాస్తవాలను తేల్చాలని, ఆలస్యం జరిగితే ఇందుకు అధికారులను , మంత్రులపైన కూడా చర్యలు తీసుకుంటామని సిఎం స్పష్టం చేశారు. ఫామ్‌హౌస్ వద్ద పుసుపు నీళ్లు చల్లి ఏ దళితులనైతే అవమానించారో ఆ దళితులను ఫామ్ హౌస్ వద్ద ఉన్న ప్రభుత్వ భూములకు యజమానులను చేస్తామని ప్రకటించారు.

''రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఎ''కు సంబంధించి శాసనస భలో బుధవారం జరిగిన స్వల్పకాలిక చర్చలో సభ్యులు ప్రస్తావిం చిన అంశాలకు సిఎం రేవంత్ రెడ్డి సమాధానమిచ్చారు. రాష్ట్రంలో మొత్తం రూ.లక్ష కోట్ల విలువ చేసే భూకుంభకోణం జరిగిందని, దీనిపైన ప్రత్యేక విచారణ కమిటీని (ఎస్ఐటి) వేస్తు న్నట్టు వెల్లడించారు. ఇప్పటి వరకు తాను కవేలం ధరణి పార్ట్ 1 మాత్రమేనని, చెప్పానని, త్వరలోనే మరిన్ని అక్రమాలు బయటపె డతామని వెల్లడిచారు. టీజీఐఐసీ భూముల్లో జరిగిన అక్రమా లను బడ్జెట్ సెషన్‌లో బయటపెడతామన్నారు. తొమ్మిది జిల్లాల పరిధిలోని 24 మండలాల్లో, 31 గ్రామాల్లో కెసిఆర్ కుటుంబానికి సుమారు 440 ఎకరాల భూమి ఉందని , కేసీఆర్ దంపతుల పేరుతో 67 ఎకరాలు, కెటిఆర్ కుటుంబంలో నలుగురి పేరుతో 123 ఎకరాలు ఉన్నాయని ఇందులో కేటీఆర్ పేరుతో 49.5 ఎక రాలు, శైలిమకు 17.5 ఎకరాలు, అలేఖ్యకు 9.38 ఎకరాలు, హిమాన్షుకు 46.3 ఎకరాలు ఉన్నాయని వివరించారు. తన్నీరు హరీశ్‌రావు కుటుంబానికి 30 ఎకరాలు, కల్వకుంట్ల కవిత కుటుంబానికి 37 ఎకరాలు, జోగినపల్లి సంతోష్‌రావు కుటుంబా నికి 79 ఎకరాలు, నవీన్‌రావుకు 52 ఎకరాలు, కొండల్‌రావుకు 48 ఎకరాలు ఉన్నాయని వెల్లడించారు. సత్యంరామలింగరాజు కుంభకోణంలో సీజ్‌లో ఉన్న భూముల్లోనే కెటిఆర్ బంధువులకు జన్వాడ ఫామ్‌హౌస్ ఉన్నదని, ఇరిగేషన్ అవసరాల నిమ్మితం సేకరించిన భూమిలో హరీశ్‌రావు ఫామ్‌హౌస్ ఉందని తెలిపారు. ఈ ఫామ్‌హౌస్ కోసమే సిద్దిపేట మున్సిపాలిటీ నిధులతో ఎలాంటి టెండర్లు లేకుండా రహదారి వేశారన్నారు.

**ప్రతి ధర్నా,..నిరసన వెనుక భూదందా:** బిఆర్‌ఎస్ నేతల ప్రతి ధర్నా,నిరసన కార్యక్రమాల వెనుక భూదందా, భూదాహం, అవి నీతి దాగి ఉన్నదని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. బహదూర్ గూడలోని అసైన్డ్ భూములను గంగుల కమలాకర్, ఎర్రబెల్లి, సుధీర్‌రెడ్డి భూములు కొనుగోలో చేశారని, బుల్లెట్ రైలు ప్రాజెక్ట్‌కు భూసేకరణ నిమ్మితం బహదూర్‌గూడకు వెళ్తే అక్కడ ధర్నాలు చేస్తున్నారని, ఇలాంటి బెదిరింపులకు భయపడబోమని స్పష్టం చేశారు. ఈ భూములను వదిలిపెట్టబోమన్నారు. ఈ భూముల విషయంలో విచారణ చేపట్టాలని 'అక్క' ప్రభుత్వానికి లేఖ రాయాలని మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డిను ఉద్దేశించి వ్యాఖ్యా నించారు. మాజీ మంత్రి జగదీష్ రెడ్డికి 50 ఎకరాల ఫామ్‌హౌ స్‌లో 11.5 ఎకరాల ఇనాం భూమి ఎలా వచ్చిందని సిఎం ప్రశ్నిం చారు పైలట్ రోహిత్ రెడ్డి కి అజీజ్‌నగర్ లో అసైన్డ్ భూమిలో ఫామ్‌హౌస్‌ను నిర్మించుకున్నారన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సొంత గ్రామం తిమ్మాపూర్‌లో ఉన్న 77 ఎకరాల భూదాన్ భూమిని కూడా ప్రైవేటుపరమైందన్నారు. బిఆర్‌ఎస్‌కు చెందిన దామోదరరావుకు గోల్డెన్ ప్రసాద్ బెంజి కారు ఎందుకు ఇచ్చారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బిజెపి ఎమ్మెల్సీ మల్కం కొమురయ్య కూడా 10 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా చేశారని, ఇందులో ఒక బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కూడా ఉన్నారని ఆరోపిం చారు.

**'ధరణి పేరిట లక్ష కోట్ల దోపిడీ':** తెలంగాణ ఉద్యమాన్ని, ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని భూ దోపిడీ సాగిందని సీఎం ఆరోపిం చారు. ప్రాజెక్టుల్లో అవినీతి అనంతరం కెసిఆర్ కన్ను ప్రభుత్వ భూములపై పడిందని, ఆ భూములను ఎలా కొల్లగొట్టాలనే ఆలో చన నుంచే ధరణి పుట్టిందని, అదే భూతమై తెలంగాణ సమా జాన్ని పట్టి పీడిస్తోందని మండిపడ్డారు. ధరణిని తా నే రూపొం దించానని కేసీఆర్ చెప్పుకోవడం పచ్చి అబద్ధమని, ధరణిని 2010లో ఒడిశాలో ప్రారంభమైందని,దీనిపైన 2014 లోనే కాగ్ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసిందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 2018లో ఐఎల్‌ఎఫ్‌ఎస్ సంస్థ ధరణి కాం ట్రాక్టును ద క్కించుకుని, ఆ తర్వాత టెరాసిస్ సంస్థకు విక్రయించిందని, ఆ కంపెనీలో శ్రీధరరాజుకు వాటా ఉందన్నారు. రూ.110 కోట్ల వి లువైన కాంట్రాక్టును రూ.1,400 కోట్ల విలు వ ఎలా చేరిందని ప్రశ్నించారు. రాష్ట్రంలోని 2.5 కోట్ల ఎకరాల భూ సమాచారాన్ని విదేశీ సంస్థలకు, మాఫియా చేతికి వెళ్లిందన్నారు. 1982లో ప్రవే శపెట్టిన భూకబ్జా నిరోధక చట్టాన్ని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాగానే కెసిఆర్ ప్రభుత్వం రద్దు చేసిందని, ఆ చట్టాన్ని ఎందుకు రద్దు చేశారో కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ప్రశ్నలకు జవాబు చెప్పాల్సి వస్తుందనే బిఆర్‌ఎస్ సభ నుంచి పారిపోయారని విమర్శించారు. బిఆర్‌ఎస్ నేతలు, దళారీలు వేర్వే రు కాదని, ఇద్దరూ ఒకటేనని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కండువా వేస్తే బిఆర్‌ఎస్ నేత, కండువా తీస్తే దళారీ అని అన్నారు

**భూ, సాయుధ పోరాట వీరులు సర్వం కోల్పోతే..**
**కెసిఆర్‌కు వందల ఎకరాల భూమి ఎలా వచ్చింది..?**

తెలంగాణ సాయుధ పోరాటంతో పాటు ప్రజా, భూ పోరాటాలు చేపట్టిన రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ధర్మభిక్షం, గద్దర్ లాంటి వారు సర్వం కోల్పోతే తెలంగాణ ఉద్యమంలో ఉన్న కెసి ఆర్ మాత్రం కోట్లాది రూపాయలను, వందల ఎకరాలను ఎలా కూడగట్టుకున్నారని సిఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. తెలంగాణ ఉద్యమం ముసుగోల వేలాది కోట్లను కొల్లగొట్టారని మండిప డ్డారు.

## ఇరాన్ యుద్ధంతో 38 బి.డాలర్లు పైగా ఖర్చు

**వాషింగ్టన్:** ఇరాన్ యుద్ధంతో అమెరికాకు 38 బిలియన్ డాలర్లు పైగా ఖర్చు జరిగిం దని ఆ దేశ బడ్జెట్ కార్యాలయం బుధవారం ప్రకటించింది.అమెరికా చేస్తున్న యుద్ధం వల్ల ఆగస్టు ఒకటో తేదీ నాటికి రక్షణశా ఖకు 38 బిలియన్ డాలర్లు పైగా ఖర్చైంది,సంఘర్షణ తీవ్రతను బట్టి నెలకు 13 బిలియన్ డాలర్లు లేదాఅంతకంటే ఎక్కువగా ఖర్చు అవుతూనే ఉందని కాంగ్రెస్ బడ్జెట్ ఆఫీసర్ నిష్పక్షపాతంగా విడుదల చేసిన అంచనా నివేదికలో తెలియ జేశారు. వచ్చే ఏడాది మొదటి త్రైమాసికం వరకూ ఈ యుద్ధంవల్ల అమెరికాలో ద్రవ్యో ల్బణానికి దారితీస్తుందని,గతంలో అంచనా వేసిన దానికంటే ఈ ద్రవ్యోల్బణం 0.5 శాతం ఎక్కువగానే ఉంటుందని సిబిఓ అంచనాలు తెలియజేశాయి.

## సమగ్ర భూ ఆడిట్

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన చర్చలో సాంబశివరావు పాల్గొన్నారు. సాంబశివరావు మాట్లాడుతూ 22ఎ కింద కోటి ఎకరాల ప్రైవేట్ భూములు ఉన్నాయనేది అసత్య ప్రచారమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం ప్రొహిబిటరీ ఆర్డర్ బుక్‌లో ఉన్న ప్రైవేట్ భూములు సుమారు 3,74,930 ఎకరాలు మాత్రమేనని వివరించారు. అప్పటి ధరణి, ఇప్పుడు భూ భారతి అమలులోకి వచ్చిన తర్వాత రాష్ట్ర మొత్తం భూమి విస్తీర్ణంలో పెద్దగా మార్పు లేదని వివరించారు. ఫారెస్ట్, అసైన్డ్, ప్రభుత్వ భూముల వంటి కేటగిరీలను కలిపి చూపడం వల్లే కోటి ఎకరాల భూమి 22ఎలో ఉన్నట్లు అపోహలు ఏర్పడుతున్నాయని పేర్కొ న్నారు. ఒకే సర్వే నంబర్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ భూములు కలి సివున్న సందర్భాల్లో ధరణి సమయంలో సబ్‌డివిజన్ నంబ ర్లను సరిగ్గా పరిగణనలోకి తీసుకోకపోవడం వల్ల సమస్యలు తలెత్తాయని తెలిపారు. దీనివల్ల ప్రైవేట్ భూములతో పాటు ప్రభుత్వ భూములు కూడా ఒకే రికార్డులో నమోదైన సంద ర్భాలు ఉన్నాయని తెలిపారు. 22ఎ కింద ఉన్న ప్రైవేట్ భూముల సమస్యను ప్రభుత్వం తక్షణమే నిర్థిష్టమైన కాలపరి మితిని విధించి ఈ సమస్యను పూర్తిగా పరిష్కరించడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ భూములపై పూర్తి స్పష్టత ఇవ్వా లని కోరారు. భూముల వివరాలను గ్రామాలు, వార్డుల స్థాయిలో బహిరంగంగా అందుబాటులో ఉంచితే ప్రజల్లో ఉన్న అపోహలు చాలా వరకు తొలగిపోతాయని సూచిం చారు. 22ఎ నిబంధనను ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా తీసుకు రాలేదని పేర్కొన్నారు. 22ఎకు సంబంధించిన చట్టపరమైన పరిణామాలు గత ప్రభుత్వాల కాలం నుంచే కొనసాగుతు న్నాయని వివరించారు. 2007లో కోనేరు రంగారావు కమిటీ సిఫార్సుల నేపథ్యంలో సంబంధిత చట్టం వచ్చిందని, అనం తరం 2020లో ధరణి వ్యవస్థలో భాగంగా భూముల రికా ర్డుల నిర్వహణలో మార్పులు చోటుచేసుకున్నాయని తెలి పారు. ధరణి అమలులో సాంకేతిక, పరిపాలనా లోపాల కార ణంగా ప్రజలకు ఇబ్బందులు ఏర్పడ్డాయని, వాటిని సరిదిద్దేం దుకు ప్రస్తుతం భూభారతి వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని పేర్కొన్నారు.

**భూరికార్డులపై సమగ్ర విచారణ జరపాలి**
**అన్ని రకాల భూముల లెక్కలు తేల్చాలి**

రాష్ట్రంలో ఉన్న అన్ని రకాల భూముల లెక్కలను ప్రభుత్వం తేల్చాలని కూనంనేని సాంబశివరావు సూచించారు. భూదాన్ భూములు ఎక్కడ ఉన్నాయి? ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఉన్నాయి? వాటి రికార్డులు ఎలా మారాయి? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. భూదాన్ భూముల విషయంలో వివాదాలు కొనసాగుతున్నందున ఫోరె న్సిక్ ఆడిట్ ద్వారా భూముల చేతులు మారిన తీరును వెలికి తీయాలని సూచించారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని నిజాం ఆస్థులు, దేవాదాయ భూములపై పూర్తి స్థాయి సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. నిజాం కాలం నుంచి ఉన్న భూములు ప్రస్తుతం ఎక్కడ ఉన్నాయి? ఎవరి ఆధీనంలో ఉన్నాయి? అనే వివరాలను ప్రజలకు వెల్లడించాలన్నారు. ఈ భూములను గుర్తించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొస్తే భూమి లేని పేదలకు ఇళ్ల స్థలాలు, ఇతర అవసరాలకు ఉపయోగపడే అవకాశం ఉంటుందని తెలిపారు. చెరువులు, కుంటలు, కాలువల కింద ఉన్న భూముల వివరాలను కూడా సమగ్రం గా పరిశీలించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని చెరు వులు, కుంటలు ఉన్నాయి? వాటి భూములు ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఉన్నాయి? అనే అంశాలపై ఆడిట్ నిర్వహించా లని కోరారు. అసైన్డ్ భూములు పెద్దల చేతుల్లోకి వెళ్లకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్‌ఆర్‌ఎ స్‌పి, నాగార్జునసాగర్, గోదావరి తదితర ప్రాజెక్టుల కోసం గతంలో రైతుల నుంచి సేకరించిన భూముల్లో ప్రస్తుతం ఎంత భూమి ప్రాజెక్టుల అవసరాలకు వినియోగంలో ఉంది? మిగి లిన భూముల పరిస్థితి ఏమిటి? అనే అంశాలను పరిశీలించా లని కోరారు. భూముల రికార్డుల్లో కనిపించే స్థితికి, వాస్త వంగా జరిగిన లావాదేవీలకు మధ్య వ్యత్యాసాలను గుర్తించేం దుకు ఫోరెన్సిక్ ఆడిట్ అవసరమని పేర్కొన్నారు.

**ఎనిమీ, పరారీ ప్రాపర్టీలను వెలికితీయాలి**

తెలంగాణలోని ఎనిమీ ప్రాపర్టీలు, పరారీ ప్రాపర్టీల వివరా లను కూడా ప్రభుత్వం సేకరించాలని సాంబశివరావు సూచిం చారు. తెలంగాణ విలీనం అనంతరం దేశం విడిచి వెళ్లిన వారి భూములు, ఆ ఆస్తుల ప్రస్తుత పరిస్థితిని గుర్తించాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల భూములపై కూడా ఆడిట్ చేయాలని, గతంలో ప్రభుత్వరంగ సంస్థలకు తక్కువ ధరలకు కేటాయించిన భూములు ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఉన్నాయో పరిశీలించాలని సూచించారు. మూతపడిన ప్రభుత్వ రంగ సంస్థల భూముల పరిస్థితిని కూడా సమ గ్రంగా పరిశీలించి, అవసరమైతే ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిం చాలని కోరారు. 22ఎ సమస్యతో సాదాబైనామాలను ముడి పెట్టకుండా ఈ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. భూమి తమ ఆధీనంలో ఉన్నప్పటికీ చట్టబద్ధమైన హక్కు లేక ఇబ్బందులు పడుతున్న పేదలకు సాదాబైనామాల ద్వారా పరిష్కారం చూపాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో సాదా ఫారాల ఆధారంగా భూములను సాగు చేస్తున్న వారి పరిస్థితిని కూడా పరిశీలించి, అర్హత ఆధా రంగా హక్కులు కల్పించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించా లని కోరారు. భూ రికార్డుల్లో కాస్తు కాలమ్‌ను తొలగించడం వల్ల వాస్తవ సాగుదారుల హక్కులకు సమస్యలు ఏర్పడుతు న్నాయన్నారు. కౌలుదారులకు కార్డులు ఇస్తున్నందున కాస్తు కాలమ్ అవసరం లేదనే వాదన సరైనది కాదని అభిప్రాయప డ్డారు. పాత భూస్వాములు, జమీందార్ల పేర్లలో ఉన్న భూములు అమ్మకాలు జరిగినప్పటికీ పాత యజమానులు మళ్లీ హక్కులు కోరే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొంటూ, సాగుదారుల హక్కులను రక్షించే విధంగా రికా ర్డులను పునర్ వ్యవస్థీకరించాలని కోరారు.

**పేదల ఇళ్ల స్థలాలకు హక్కులు కల్పించాలి**

హైదరాబాద్, రంగారెడ్డి తదితర ప్రాంతాల్లో ఏళ్లుగా ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న పేదలకు వారి అర్హతను పరిశీలించి పట్టాలు లేదా చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని సాంబశివ రావు కోరారు. పేదల ఇళ్లను తొలగించడం ద్వారా సమస్య పరిష్కారం కాదని, వారికి ప్రత్యామ్నాయంగా హక్కు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. భూక బ్జాల వెనుక అధికారుల పాత్రపైనా దృష్టి సారించాలన్నారు. భూకబ్జాదారులు, భూమాఫియాలు కేవలం రాజకీయ అండ తోనే కాకుండా కొన్ని సందర్భాల్లో అధికారుల సహకారంతో అక్రమ భూదందలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తు న్నాయని పేర్కొన్నారు. అవినీతి, భూ లావాదేవీల్లో అక్రమా లను అరికట్టేందుకు కఠిన చర్యలు అవసరమని కోరారు. ప్రజ లకు తమ భూమిపై స్వేచ్ఛగా వెళ్లే హక్కు ఉండాలని, భూవి వాదాలను బలప్రయోగంతో పరిష్కరించే ప్రయత్నాలను అడ్డు కోవాలని సూచించారు. భూ వివాదాల్లో బౌన్సర్లను ఉపయో గించి ప్రజలను బెదిరించే పరిస్థితులు ఉండకూడదని, అలాంటి వారిని మక్కిలి విరగ్గొట్టి లోపల వేయాలని ప్రభు త్వాన్ని కోరారు. రాష్ట్రంలో బౌన్సర్ల వ్యవస్థ కొనసాగడమంటే ప్రభుత్వం విఫమైనట్లేనని కూనంనేని సాంబశివరావు పేర్కొ న్నారు.

## అవార్డు

(మొదటి పేజీ తరువాయి)

పేరు సంపాదించుకున్న అనంత్ నాగ్ ఆంగ్ల చిత్రాలలో కూడా నటించారు. కన్నడ, తెలుగు, తమిళ, హిందీ, మరాఠీ భాషల్లో 250కు పైగా చిత్రాలలో నటించిన అనుభవజ్ఞుడైన భారతీయ నటుడు. తెలుగులో ప్రేమలేఖలు (1977) చిత్రంలో నటనకు గాను ఫిలింఫేర్ ఉత్తమ నటుడు అవార్డు లభించింది. రాత్రి (1992), శంఖారావం(2004), భీష్మ(2020)వంటి తెలుగు చిత్రాలలో నటించారు. సెలక్షన్ కమిటీ చేసిన సిఫార్సు మేరకు దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు–2024 అత్యున్నత పుర స్కారాన్ని ఇస్తున్నట్లు ప్రకటించడానికి భారత ప్రభుత్వం ఎంతో సంతోషిస్తోంది'' అని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ద్వారా ప్రకటన వెలువడింది.

ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆయనకు అభి నందనలు తెలియజేశారు.''అనేక దశాబ్దాలుగా ఆయన అవి శ్రాంతంగా చిత్రపరిశ్రమలో కృషి చేశారు,సహజ నటన,అద్భు తమైన వైవిధ్యం,ప్రతిభతో భారతీయ చిత్రపరిశ్రమపై, ముఖ్యంగా కన్నడచిత్రరంగంపై చెరగని ముద్రవేశారు, ఆయన నటించిన ప్రతిపాత్రకూ అరుదైన సహజత్వాన్ని జోడించారు,విశిష్ఠ కళాకారుడైన అనంత్‌నాగ్‌కు దాదాసా హెబ్ ఫాల్కే అవార్డు సముచితమైన గౌరవం'' అని ఎక్స్ వేది కగా మోదీ అభినందనలు తెలియజేశారు.

మించినఓట, హంసగీతె, హోసనీరు, అవస్థె, గంగవ్వ గంగా మాయి,నిశాంత్,అంకుర్,మంథన్ టైటిల్స్‌గల హిందీ,కన్నడ చిత్రాలలో తన గొప్ప నటనతో గుర్తింపు పొందారు.రాజకీయ రంగంలో కూడా రాణించారు. ఎంఎల్‌సిగా,ఎంఎల్ ఎగా,బెంగళూరు పట్టణాభివృద్ధిమంత్రిగా బాధ్యతలు నిర్వ హించారు.కర్ణాటక ముఖ్యమంత్రి ఎస్.ఎం.కృష్ణ,బిజెపికి చెందిన ''ముఖ్యమంత్రి చంద్రు''లకు ప్రత్యర్థిగా జనతాదళ్ (సెక్యులర్) పార్టీ తరపున ఎన్నికల బరిలో పోటీపడ్డారు.

## భూసమస్యలకు

(మొదటి పేజీ తరువాయి)

నేతృత్వంలో 'హైపవర్ కమిటీ' ని నియమిస్తామని ప్రకటించారు.

''రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఎ''కు సంబంధించి శాసన సభలో బుధవారం జరిగిన స్వల్పకాలిక చర్చలో సభ్యులు ప్రస్తావించిన అంశాలకు సిఎం రేవంత్ రెడ్డి సమాధానమి చ్చారు. ఏ భూమిని నిషేధిత జాబితాలో చేర్చాలనే అంశంపై నిర్దేశిత విధానాన్ని అనుసరిస్తామని, ఆ అధికారం ఆర్డీవో లేదా సబ్ కలెక్టర్లకు అప్పగిస్తామన్నారు. యూఎల్‌సి భూముల విషయంలో త్వరలో నూతన విధానం తీసుకొస్తా మని, నిషేధిత జాబితాలో చేర్చే ముందు ఈకేవైసీ, ఈమె యిల్, పత్రికా ప్రకటన విధానాన్ని అనుసరిస్తామని, అభ్యంత రాలు తెలిపేందుకు 15 రోజుల గడువు కూడా ఇస్తామని ప్రక టించారు. హైదరాబాద్‌లోని ఎల్ బి నగర్ నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల్లో ఏళ్ల తరబడి నివసిస్తున్న వారి సమస్యకు పరిష్కారం చూపుతామని, 118 జీఓ సమస్యను పరిష్కరిస్తా మని హామీనిచ్చారు. ప్రభుత్వ భూముల్లోని లేఅవుట్లు, నిర్మా ణాలను క్రమబద్ధీకరిస్తామని, సికింద్రాబాద్ పరిధిలో ఫ్రీహోల్డ్, భూదాన్ భూ సమస్యలను కూడా పరిష్కరిస్తామ న్నారు. సింగరేణి కార్మికుల విషయంలో అధికారిక యూని యన్ సింగరేణి సంస్థతో సంప్రదింపులు చేపట్టాలని కూనం నేని సాంబశివరావుకు సిఎం సూచించారు. ఈ విషయంలో తాము సానుకూలంగా ఉన్నామన్నారు.

**దివానీ, నాన్ దివానీ భూములు**

నిజాం హయాంలో 60 శాతం దివానీ భూములు, 40 శాతం నాన్‌దివానీ భూములుగా ఉండేవని, దివానీ భూములను కొలిచి హద్దులు నిర్ణయించారని, నాన్‌దివానీ భూముల లెక్క సరిగా తెలియదన్నారు. 1908లో తొలిసారి రెవెన్యూ విధానం, 1936లో భూ హక్కుల రికార్డు నిర్వహణ చట్టం వచ్చాయని, 1910 , 1940 మధ్య సర్వే, సెటిల్‌మెంట్ వ్యవస్థ ఏర్పడిందని వివరించారు. 1948 నుంచి 1954 వరకు ఆరేళ్ల 'చేస్సాల్ పహానీ'ని, ఆతర్వాత కాస్రా పహానీ రూపొందించారని సిఎం వివరించారు. ఈ రెండు ఆధారం గానే భూముల చరిత్ర తెలుస్తుందన్నారు. జాగీర్దారీ, ఇనాం భూములు రద్దయిన తర్వాత ప్రభుత్వ భూములుగా మారడం తోనే అసలు సమస్య మొదలైందని, హైదరాబాద్ చుట్టుపక్కల గ్రామ నక్షలు సరిగా లేకపోవడంతో రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి ప్రాంతాల్లో వివాదాలు అధికమయ్యాయని తెలి పారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వాలు 1965లో భూదాన్ చట్టం, 1975లో గిరిజనుల భూముల రక్షణ కోసం 1 ఆఫ్ 70 చట్టం, ల్యాండ్ సీలింగ్ చట్టం, అసైన్డ్ భూముల అమ్మ కాల నిషేధిత చట్టం, 2006లో అటవీ హక్కుల చట్టం తీసుకొ చ్చారని, ఇందిరాగాంధీ హయాంలో 25 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు, 10 లక్షల ఎకరాల పోడు భూములు పేద లకు పంపిణీ చేశారని సిఎం గుర్తు చేశారు.

కొండలు, గుట్టలను లెక్కించినందుకే భూమి తగ్గింది...

నిజాం సర్కారు హయాంలో 60 శాతం దివానీ భూముల నుంచి వచ్చే ఆదాయంతోనే పాలన అందించారని, అనేక చారిత్రక కట్టడాలను నిర్మించారని, మిగిలిన 4 0 శాతం నాన్ దివానీ భూముల ద్వారా వచ్చే ఆదాయాన్ని నిజాం కుటుంబా నికి వాడుకున్నారని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నాడు కొండలను , గుట్టలను చైన్‌లతో లెక్కించారని, కానీ ఆ కొండలు, గుట్టలు పోయిన తర్వాత భూములను లెక్కిస్తే భూమి లెక్కల్లో తేడా వచ్చిందన్నారు.

**నిషేధిత జాబితాలో కేవలం 3,73,920 ఎకరాలే..**

ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తులకు సంబంధించి మొత్తం 1,02,5250 ఎకరాల భూమి 22ఎ నిషేధిత జాబితాలో ఉన్న దని, ఇందులో ప్రైవేటు వ్యక్తులకు సంబంధించింది 3,73,920 ఎకరాల భూమి ఉన్నదని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దేవాదాయ, వక్ఫ్, అటవీ శాఖ భూములు నిషేధిత జాబితాలో ఉండాల్సిందేనని,ఇది ఉమ్మడి ఎపి నుంచి నిషేధిత జాబితాలోనే ఉన్నదని వివరించారు. ఈ భూములను కూడా నిషేధిత జాబితా నుంచి తొలగించాలని బిఆర్‌ఎస్, కెసి ఆర్ చెబుతున్నారా? అని ప్రశ్నిం చారు. ఈ భూములను నిషే ధిత జాబితా నుంచి తొలగించాలంటే బిఆర్‌ఎస్ రాష్ట్ర ప్రభు త్వాకి లేఖ రాయాలని సూచించారు. ప్రభుత్వ భూములపై నిషేధిత జాబితా నుంచి తొలగిస్తే, పేద ప్రజలకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వ భూములలో పేదలు గుడిసేల వేస్తే వాటికి పట్టాలు ఇవ్వాలని నిరంతరం సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు ప్రభుత్వ దృష్టికి తీసుకొస్తారని సిఎం గుర్తు చేశారు. నిజాం నుంచి వచ్చిన ఇనామ్ భూము లను బిహార్ నుంచి వచ్చినవారు కొల్లగొడుతున్నారన్నారు. మైహోమ్ రామేశ్వర్‌రావుకు అసైన్డ్ భూములను కట్టబెట్టారని, సండ్ర వెంకట వీరయ్యకు అటవీభూములను, ఇండో అమెరి కన్ కోటా ఎమ్మెల్యే స్టీఫెన్‌కు రూ.50 కోట్లు విలువ చేసే భూమిని అగ్గువకు నజరానాగా ఇచ్చారని ఆరోపించారు.

**ముందు నుయ్యి... వెనకాల గొయ్యి...**

ప్రైవేటు, ప్రభుత్వం మధ్య జరిగిన లేవుట్ భూమి వివాదంలో హైకోర్ట్ ప్రైవేటుకు అనుకూలంగా తీరుపనిచ్చిందని, ఈ విష యంలో ప్రభుత్వం సుప్రీం కోర్ట్‌ను ఆశ్రయించిందని, 15 సం వత్సరాల తర్వాత ఆ భూమి ప్రభుత్వానిదేనని తీర్పు వెలువ డిందని సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఈ తీర్పు వచ్చే సరికే సదరు ప్రైవేటు వ్యక్తి ఆ భూములను ఇతరులకు విక్రయించా రని, ప్లాట్లు కూడా కట్టుకున్నారని, ఇప్పుడు ప్రభుత్వం ఏం చేయాలని, చర్యలు తీసుకోకపోతే తాము లాలూచిపడిందని ఆరోపిస్తారని, ఒక వేళ చర్యలు తీసుకుంటే, కట్టుకున్న తర్వాత చర్యలు తీసుకుంటారా? అని ప్రభుత్వాన్ని ఆరోపిస్తా రని, ఇలాంటి విషయంలో తన పరిస్థితి ముందు నుయ్యి, వెన కాల గొయ్యి .. తరహా ఉన్నదని, తాను ఏం చేయాలని బాయిలో దుంకాలా? అని సిఎం వ్యాఖ్యానించారు.

### 12 అంశాలు ఇవే....

**అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూములు :** పాక్షికంగా క్రమబద్ధీక రించిన, క్రమబద్ధీకరించని కాలనీలు.మిగులు భూముల క్రమ బద్ధీకరణ నిమిత్తం త్వరలోనే ప్రభుత్వం కొత్త విధానాన్ని ప్రవే శపెడుతుంది. ఈ పథకం పెండింగ్‌లో ఉన్న పాత దరఖాస్తు లతో పాటు కొత్త దరఖాస్తులన్నింటికీ వర్తిస్తుంది. భూముల రిజిస్ట్రేషన్, క్రమబద్ధీకరణ ప్రక్రియలు రెండూ సమాంత రంగా, ఏకకాలంలో చేపడుతాం.

అధీకృత లేఅవుట్లలోని ప్రభుత్వ భూములు కాంపిటెంట్ అథారిటీచే ఆమోదించిన లేఅవుట్లలో పెండింగ్‌లో ఉన్న రిజి స్ట్రేషన్ల దరఖాస్తులను పరిశీలించి, తగిన పరిష్కారం చూపేం దుకు వారం రోజుల్లోగా ఒక సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేసి ఈ సమస్యను పరిష్కరిస్తాం. ఇలాంటి ఆస్తుల క్రమబద్ధీకరణ త్వరగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం నూతన పథకాన్ని ప్రవేశ పెడుతుంది.

సింగరేణి బొగ్గు గని ప్రాంతాలు (కోల్ బెల్ట్) సమస్య విష యంలో జిల్లా స్థాయి ఉన్నతాధికారుల కమిటీని ఏర్పాటు చేస్తాం. ఈ కమిటీ పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి నిర్దేశిత అర్హత ప్రమాణాల మేరకు పరిష్కరిస్తుంది.

జీవో నెంబర్ 59 సమస్యను కన్వేయన్స్ డీడ్స్ (హక్కు బదిలీ పత్రాలు) జారీ చేసిన 1,22,280 దరఖాస్తులను నిర్దేశిత అర్హ తల ప్రాతిపదికన తుదిగా పరిశీలించి, పరిష్కరించేందుకు ప్రభుత్వం ఒక కమిటీని నియమిస్తుంది. మిగిలిన 18,590 పెండింగ్ దరఖాస్తులు నూతన క్రబద్ధీకరణ విధానం కింద పరిష్కరిస్తాం.

జీవో నెంబర్ 118 (ఎల్‌బి నగర్ నియోజకవర్గం) ప్రకారం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నీ నిర్ణీత గడువులోగా పరిష్క రిస్తాం. పరిష్కారమైన అన్ని కేసులను వెంటనే సెక్షన్ 22 ఎ నిషేధిత జాబితా నుంచి తొలగిస్తాం.

అసైన్డ్ భూములన్నీ తెలంగాణ అసైన్డ్ భూముల (బదిలీ నిషేధ) చట్టం 1977 పరిధిలోకి వస్తున్నందున, ఈ అంశంపై సమగ్ర న్యాయ సమీక్ష , విస్తృతస్థాయి సంప్రదింపులు జరిపి నిర్ణయం తీసుకుంటాం.

ఇందిరమ్మ పథకం ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ప్రభుత్వ ఖర్చుతో నిర్మించిన ఇండ్ల విషయంలో విస్తృతస్థాయి సంప్రదింపులు నిర్వహిస్తాం.

ఇందిరమ్మ పథకం లబ్ధిదారుని సొంత స్థలంలో ప్రభుత్వ ఖర్చుతో నిర్మించిన ఇండ్లకు ఐదు సంవత్సరాల లాక్‌ఇన్ పీరి యడ్ (లావాదేవీల నియంత్రణ గడువు) ముగిసిన తర్వాత క్రయవిక్రయాలకు అనుమతిని మంజూరు చేస్తాం.

ప్రైవేటు పట్టా భూముల విషయంలో నాలా ఛార్జీలు, స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుములను కలిపి క్రయవిక్రయాలకు అనుమతిస్తాం.

ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు, అనధికార లేఅవుట్లు, కాలనీలను, అనధికారిక లేఅవుట్లను నూతన క్రమబద్ధీకరణ పథకం పరిధిలోకి తీసుకొస్తాం.

సికింద్రాబాద్ పరిధిలోని లీజ్‌హోల్ ఆస్తుల ఫ్రీహోల్ క్రమబద్ధీకరణ

స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సైనికుల అసైన్మెంట్ భూములు, భూదాన్ భూములను, నిరుపేద, బలహీన వర్గాల గృహ నిర్మాణ అవసరాల కోసం భూమిని, ఆర్థిక వనరులను సమీకరించే ఉద్దేశంతో ఈ భూములను సమగ్ర ల్యాండ్ పూలింగ్ విధానం పరిధిలోకి తీసుకొస్తాం. ఈ విధానం ద్వారా సమీకరించిన నిధులను ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గా ల్లోని నిరుపేద లబ్దిదారులకు బలహీన వర్గాల గృహ నిర్మాణ పథకాలకు వినియోగిస్తాం.

# వెస్టిండీస్‌తో సిరీస్‌లకు జట్లను ప్రకటించిన బిసిసిఐ



సొంతగడ్డపై వెస్టిండీస్‌తో జరిగే వన్డే, టీ20 సిరీస్‌లల్లో తలపడే భారత జట్లను బిసిసిఐ ప్రకటించింది. 15 మంది సభ్యులతో కూడిన రెండు వేర్వేరు జట్ల వివరాలను బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ సిరీస్‌లకు కూడా టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా దూరమయ్యాడు. రిషబ్ పంత్‌కు కూడా మొండి చెయ్యే ఎదురైంది. అతన్ని ఇరానీ కప్‌కు ఎంపిక చేశారు. రంజీ ఛాంపియన్ జమ్మూ కశ్మీర్తో జరిగే ఇరానీ కప్లో రెస్టాఫ్ ఇండియాకు పంత్ సారథ్యం వహించనున్నాడు.

**కోహ్లీ, రోహిత్ రీఎంట్రీ..** శుభ్మన్ గిల్ సారథ్యంలోని వన్డే జట్టులో స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు రీఎంట్రీ ఇవ్వగా.. రుతురాజ్ గైక్వాడ్, అకిబ్ నబీ, నమన్ ధీర్, గుర్నూర్ బ్రార్కు అవకాశం దక్కింది. ఈ సిరీస్కు శ్రేయస్ అయ్యర్ దూరంగా ఉన్న నేపథ్యంలో కేఎల్ రాహుల్కు వైస్ కెప్టెన్సీ బాధ్యతలు దక్కాయి. బ్యాకప్ వికెట్ కీపర్గా ధ్రువ్ జురెల్ను ఎంపిక చేసిన సెలెక్టర్లు ఆల్‌రౌండర్లుగా నితీష్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజాలకు అవకాశం కల్పించారు. మహమ్మద్ సిరాజ్ తిరిగి వన్డే టీమ్లోకి రీఎంట్రీ ఇవ్వగా.. ప్రసిధ్ కృష్ణ తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. బ్యాకప్ ఓపెనర్గా యశస్వి జైస్వాల్కు అవకాశం దక్కింది.

**వైభవ్‌కు చోటు....** శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని టీ20 జట్టులో అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, సంజూ శాంసన్, తిలక్ వర్మ, శివమ్ దూబే, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, నితీష్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్ తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్ రీఎంట్రీ ఇచ్చారు. సెప్టెంబర్ 27, 30, అక్టోబర్ 3 తేదీల్లో మూడు వన్డేల సిరీస్ జరగనుండగా.. అక్టోబర్ 6, 9, 11, 14, 17 తేదీల్లో ఐదు టీ20ల సిరీస్ జరగనుంది. నాలుగో టీ20 హైదరాబాద్ వేదికగా జరగనుంది. ఆసియా గేమ్స్కు ఎంపిక చేసిన భారత టీ20 జట్టులో స్వల్ప మార్పు జరిగింది. వరుణ్ చక్రవర్తి పక్కటెముకల గాయంతో జట్టుకు దూరమవడంతో అతని స్థానంలో విప్రజ్ నిగమ్ను ఎంపిక చేశారు. నితీష్ కుమార్ రెడ్డిని ఈ జట్టు నుంచి తప్పించి వన్డే టీమ్లోకి తీసుకున్నారు.

**భారత్ వన్డే జట్టు :**
శుభ్మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), ధ్రువ్ జురెల్, నితీష్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, మహమ్మద్ సిరాజ్, అకిబ్ నబీ, యశస్వి జైస్వాల్, నమన్ ధీర్.

**భారత్ టీ20 జట్టు:** శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), సంజు శాంసన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), శివమ్ దూబే, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, నితీష్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్.

**ఆసియా క్రీడల కోసం భారత్ టీ20 జట్టు(రివైజ్డ్):** శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శివమ్ దూబే, తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, వైభవ్ సూర్యవంశీ, యశ్ ఠాకూర్, విప్రాజ్ నిగమ్.

**రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టు :**
రిషబ్ పంత్ (కెప్టెన్, వికెట్ కీపర్), సనత్ సాంగ్వాన్, శిఖర్ మోహన్, సుదీప్ ఘరామి, సర్ఫ రాజ్ ఖాన్ (వైస్ కెప్టెన్), స్మరణ్ రవిచంద్రన్, మానవ్ సుతార్, సారాంశ్ జైన్, ఆకాశ్ దీప్*, ముకేష్ కుమార్, ముకేష్ చౌదరి, ఆర్యన్ జుయల్ (వికెట్ కీపర్), ఆర్యన్ పాండే, అనుకుల్ రాయ్, ఆయుష్ దోసేజా.

# పాక్ క్రికెటర్‌ను వెనక్కి నెట్టి టాప్‌లో అభిషేక్‌శర్మ



అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసిసి) తాజాగా విడుదల చేసిన టి20 ర్యాంకింగ్‌సలో టీమిండియా స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ దుమ్మురేపాడు. అఫ్గానిస్థాన్‌తో టీ20 సిరీస్‌లో విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగిన అభిషేక్ శర్మ.. బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో తిరిగి టాప్2 ర్యాంక్ అందుకున్నాడు. ఈ క్రమంలో పాకిస్థాన్ బ్యాటర్ షాహిబ్జాద ఫర్హాన్‌ను వెనక్కి నెట్టాడు. భారత్‌కు చెందిన ఇషాన్ కిషన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా న్యూఢిల్లీ వేదికగా అఫ్గానిస్థాన్‌లో జరిగిన తొలి రెండు మ్యాచ్లో అభిషేక్ శర్మ 82, 39 పరుగులతో రాణించాడు. దాంతో ఈ సిరీస్‌ను టీమిండియా మరో మ్యాచ్ మిగిలి ఉండగానే కైవసం చేసుకుంది. ఈ ప్రదర్శనతో అభిషేక్ శర్మ.. ఒక స్థానం ఎగబాకి రెండో స్థానంలో నిలిచాడు. ఇషాన్ కిషన్ అగ్రస్థానానికి చేరువయ్యాడు. ప్రస్తుతం ఈఇద్దరి మధ్య వ్యత్యాసం 51 రేటింగ్ పాయింట్స్ మాత్రమే. గతంలో అభిషేక్‌శర్మ టాప్ ర్యాంకులో కొనసాగగా.. ఇషాన్ కిషన్ అద్వితీయమైన బ్యాటింగ్‌తో టాప్ ప్లేస్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో టీ20లో హాఫ్ సెంచరీతో ఫామ్ అందుకున్న సంజూ శాంసన్(57).. నాలుగు స్థానాలు ఎగబాకి 30వ స్థానంలో నిలిచాడు. ఆఖరి టీ20లో అభిషేక్ చెలరేగితే టాప్ ర్యాంక్ అందుకునే అవకాశం ఉంది.

**అభిషేక్ శర్మ విధ్వంసం.. అఫ్గాన్‌పై భారత్ ఘన విజయం!..** ఈ సిరీస్లో బ్యాటింగ్ అవకాశం రాని తిలక్ వర్మ ఒక స్థానం దిగజారి 8వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో వరుణ్ చక్రవర్తి రెండు స్థానాలు ఎగబాకి ఐదో స్థానంలో నిలిచాడు. జస్ప్రీత్ బుమ్రా ఏకంగా 7 స్థానాలు ఎగబాకి టాప్10 ర్యాంక్ అందుకోగా.. అర్ష్‌దీప్ సింగ్ 11స్థానాలు మెరుగుపర్చుకొని 14వ స్థానాన్ని సొంతం చేసుకున్నాడు. ఆల్‌రౌండర్ల ర్యాంకుల్లో హార్దిక్ పాండ్యా రెండు స్థానాలు దిగజారగా.. శివమ్ దూబే 3 స్థానాలు కోల్పోయాడు. భారత్, అఫ్గానిస్థాన్ మధ్య ఆఖరి టీ20 గురువారం జరగనుంది. ఈ నెలాఖరులో ఆసియా గేమ్స్ 2026 కోసం భారత జట్టు జపాన్‌కు వెళ్లనుంది. అక్కడ జపాన్‌తో ఏకైక టీ20 కూడా ఆడనుంది.

## డెనిసోవన్ల జీవితాలను
# వివరిస్తున్న చైనా గుహ





మనుషుల పరిణామ చరిత్రలో డెనిసోవన్లు ఇప్పటికీ అనేక ప్రశ్నలకు సమాధానం ఇవ్వని పురాతన మానవ సమూహం. దక్షిణ సైబీరియాలోని డెనిసోవా గుహలో లభించిన చిన్న ఎముకలోని డిఎన్‌ఎ ఆధారంగా వీరిని తొలిసారి 16 ఏళ్ల క్రితం గుర్తించారు. ఆ తర్వాత తూర్పు ఆసియాలో కొన్ని డెనిసోవన్ అవశేషాలు లభించినప్పటికీ, వారు ఎలాంటి పనిముట్లు తయారు చేసేవారు, ఏ జంతువులను వేటాడేవారు, ఎలాంటి వాతావరణంలో జీవించేవారు అనే విషయాలపై స్పష్టమైన ఆధారాలు చాలా తక్కువగా ఉన్నాయి. చైనాలోని యున్నాన్ ప్రావిన్స్‌లో ఉన్న బియాన్ఫు గుహ ఈ పరిస్థితిని మార్చే ముఖ్యమైన ఆధారాలను అందించింది. 2019లో అక్కడి కార్మికులు జంతువుల శిలాజాలను గుర్తించడంతో పురావస్తు శాస్త్రవేత్తలు తవ్వకాలు ప్రారంభించారు. 6.6 మీటర్ల లోతు వరకు తవ్వి 18 మట్టి పొరలను గుర్తించారు. వాటిలో పది పొరల్లో మానవులు ఉపయోగించిన వస్తువులు కనిపించాయి. ఈ ప్రాంతంలో లభించిన 64,000కు పైగా ఎముక ముక్కలను పరిశీలించగా, మూడు మానవ అవశేషాలను శాస్త్రవేత్తలు గుర్తించారు. డిఎన్‌ఎ దొరకకపోయినా, ఎముకలు, దంతాల్లోని ప్రోటీన్లలో డెనిసోవన్లకు ప్రత్యేకమైన లక్షణాలు కనిపించాయి. అవి 'హోమోసెపియన్' లేదా నియాండర్తల్లకు సంబంధించినవి కావని పరిశోధకులు నిర్ధారించారు. అవశేషాల వయసు సుమారు 1.34 లక్షల నుంచి 1.67 లక్షల సంవత్సరాల మధ్యగా తేలింది. అక్కడి రాతి పనిముట్లు మాత్రం 70,000 నుంచి 1,90,000 సంవత్సరాల మధ్య కాలానికి చెందినవిగా గుర్తించారు. డెనిసోవన్లు తయారు చేసిన 1,366 రాతి వస్తువులు లభించాయి. స్క్రేపర్లు, చాపర్లు, రాతి ముక్కలు వంటి సరళమైన పనిముట్లు వాటిలో ఉన్నాయి. అయితే వేటలో మాత్రం వీరు నైపుణ్యం చూపినట్లు ఆధారాలు చెబుతున్నాయి. జింకలు, బోవిడ్లు, ఖడ్గమృగాలు, హైనాలు, వెదురు ఎలుకలకు చెందిన 1,654 జంతు ఎముకలను పరిశోధకులు గుర్తించారు. అనేక ఎముకలపై మాంసం కోసిన ఆనవాళ్లు కనిపించాయి. జింకలు, బోవిడ్లు వీరి ప్రధాన వేట జంతువులుగా కనిపిస్తున్నాయి. రాతి పనిముట్లు సాధారణంగా ఉండటానికి కారణం వారు ఎముక, కలప, వెదురు పనిముట్లను ఎక్కువగా ఉపయోగించి ఉండవచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. బియాన్ఫు ప్రాంతంలోని సమశీతోష్ణ వాతావరణం, సమృద్ధిగా లభించిన వన్యప్రాణులు డెనిసోవన్లకు అనుకూలంగా ఉండేవి. సైబీరియా లేదా టిబెట్లో ఎదురైన తీవ్రమైన చలి, తక్కువ ఆక్సిజన్ వంటి పరిస్థితులతో పోలిస్తే ఇది వారి సహజ నివాస ప్రాంతానికి దగ్గరగా ఉండవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఈ గుహలో లభించిన మానవ అవశేషాలు, పనిముట్లు, జంతు ఎముకలు, పర్యావరణ ఆధారాలు కలిపి డెనిసోవన్ల జీవన విధానాన్ని అర్థం చేసుకోవడానికి అరుదైన అవకాశం కల్పిస్తున్నాయి.

# పురాతన లిఖిత పాఠ్యం..



ఇటలీకి చెందిన పురావస్తు శాస్త్రవేత్త లుయిగి పెర్నియర్ 1908లో కనుగొన్న, క్రీ.పూ. 1850–1600 కాలానికి చెందిన ఫైస్టోస్ డిస్క్‌ను ప్రపంచంలోనే అత్యంత పురాతన లిఖిత పాఠ్యంగా పేర్కొంటారు. క్రీట్‌లోని ఫైస్టోస్ మినోవన్ రాజభవనంలో చెదరని స్థితిలో ఉన్న భూగర్భ 'ఆలయ నిల్వగది'లోని ప్రధాన గదిలో, 'ఆర్కైవ్ చాంబర్'కు చెందిన నిల్వ ప్రాంతాల సమీపంలో ఇది బయటపడింది. ఈ డిస్క్ కాల్చిన మట్టితో తయారైంది. దీని వ్యాసం సుమారు 15 సెంటీమీటర్లు. మినోవన్ ప్రాంతాల్లో ఇప్పటివరకు ఇలాంటి డిస్క్ మరొకటి లభించలేదు. డిస్క్‌కు రెండు వైపులా 45 రకాల సంకేతాలతో కూడిన లిపి ఉంది. మట్టి తడిగా ఉన్నప్పుడే ముద్రలతో ఈ సంకేతాలను అచ్చు వేశారు. అంచు నుంచి మధ్య భాగం వరకు సర్పిలాకారంలో లిపి సాగుతుంది. ప్రతి సంకేతం ఒక అక్షరాన్ని సూచిస్తుందని భావిస్తున్నారు. పదాలను నిలువు గీతలు వేరు చేస్తాయి. ఈ 45 రకాల సంకేతాల్లో మనుషుల ఆకృతులు, పురుషులు, మహిళలు, చేపలు, పక్షులు, కీటకాలు, పడవలు, నాగళ్లు, ఇతర పనిముట్లు, రోసెట్లు వంటి చిత్రాలు ఉన్నాయి. కొన్ని సంకేతాలు ధ్వనిని సూచించకుండా వస్తువులు లేదా భావాలను సూచించే చిత్రలిపి సంకేతాలుగా కనిపిస్తున్నాయి. ఇప్పటి వరకు ఈ డిస్క్‌లోని పాఠ్యాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేకపోయారు. కొందరు దీనిని పేర్ల జాబితాగా, మరికొందరు ఫైస్టోస్ రాజభవన నిర్మాణానికి సంబంధించిన పాఠ్యంగా భావించారు. అయితే కొన్ని సంకేతాల సమూహాలు 'పల్లవి'లా పదేపదే కనిపిస్తున్నందున, ఇది మతపరమైన స్తోత్రం కావచ్చనే అభిప్రాయానికి ఎక్కువ ప్రాధాన్యం ఉంది. ఆర్కలోకోరి గుహలో లభించిన గొడ్డలిపై ఇలాంటి సంకేతాలు కనిపించడం వల్ల దీని మూలం క్రీట్ ద్వీపంతో సంబంధం ఉన్నదనే వాదనకు మరింత బలం చేకూరింది.



కోరుట్లలో...



కామారెడ్డిలో...



నాగర్‌కర్నూల్‌లో...



మేడ్చల్...కాప్రాలో...

# తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో భూపోరాటాలు

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
### సిపిఐ ఆధ్వర్యంలో సాయుధ పోరాట వారోత్సవాల ర్యాలీలు, సభలు



భూపాలపల్లిలో...



ఖమ్మం... కొణిజర్లలో...

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో మరిన్ని భూపోరాటాలు నిర్వహిస్తామని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం భూపాలపల్లి జిల్లా కేంద్రం లో సిపిఐ ఆధ్వర్యంలో సాయుధ పోరాట వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎఐటియుసి కొమరయ్య భవన్ నుంచి అంబేద్కర్ సెంటర్ మీదుగా బస్టాండ్ వద్ద గల అమరవీరుల స్తూపం వరకు ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. అమరవీరుల స్థూపం వద్ద జరిగిన సభకు సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అధ్యక్షత వహించగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ఏ సంబంధం లేని బిజెపి ఈ ప్రభుత్వాలు చరిత్రను వక్రీకరిస్తుందని శ్రీనివాసరావు విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు మోటపలుకుల రమేష్, జి.సుధాకర్ రెడ్డి, సోతుకు ప్రవీణ్, ఫైండ్ల శాంతి కుమార్, కొరిమి సుగుణ, 24వ వార్డు కౌన్సిలర్ వేముల జ్యోతి, నేరెళ్ల జోసెఫ్, శ్రీకాంత్, అన్నారపు రాజేందర్, ఆసిఫ్ పాషా, తాళ్ల పోశం, రవికుమార్, గోలి లావణ్య, గంప శ్రావణి, గడ్డం స్వరూప, మట్టి నాగమణి, పెద్దమామల సంధ్య, సుభద్ర పాల్గొన్నారు.

**కొణిజర్ల :** తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న గడల సీతారామయ్య పోరాట యోధుడని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. బుధవారం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండల పరిధిలోని తనికెళ్ల గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా గడల సీతారామయ్య స్తూపం వద్ద బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, దొండపాటి రమేష్, పాపగంటి సుదర్శన్, కోటేశ్వరరావు, స్వర్ణ రమేష్, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, గడల భాస్కర్, గడల సీతారామయ్య, చల్లా మోహన్‌రావు, ఉప సర్పంచ్ చల్లా నర్సింహారావు, మిట్టపల్లి శ్రీనివాసరావు, వార్డు సభ్యులు బానోత్ రామయ్య, లేడిబోయిన సైదులు, బాసా వెంకటేశ్వర్లు, విష్ణుమూర్తి, తుప్పతి మల్లికార్జున్, పోట్లపల్లి నర్సింహారావు, గడల చిన్న సూర్యనారాయణ, శ్రీనివాస్, నాగరాజు, బాషా, కృష్ణయ్య, రాములు పాల్గొన్నారు.

**కోరుట్ల :** సెప్టెంబర్ 17న సాయుధ పోరాట దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేణి శంకర్ డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా బుధవారం కోరుట్లలో జరిగిన ముగింపు సభలో కలవేణి శంకర్ పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ తుల రాజేందర్రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, సుతారి రాములు, గణేష్, ములుగురి హనుమంతు, ఎండి.ఉస్మాన్ కిరణ్, శ్రీగాద దేవదాస్, ఏన్నం రాధ, రామిల్ల రాంబాబు, తిప్పర్తి రమేష్, సమీర్, అందే వంశీకృష్ణ, పాల్గొన్నారు.

**కామారెడ్డి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రం మున్సిపల్ కార్యాలయం ఎదుట కామారెడ్డి పట్టణానికి చెందిన సాయుధ పోరాట యోధుడు పణిహారం రంగాచారికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఐ కామారెడ్డి జిల్లా కార్యదర్శి. ఎల్.దశరథ్, రాజిరెడ్డి, రాజేశ్వర్, లక్ష్మణ్, శ్రీనివాస్, బైరమ్మ, పద్మ, రాజమణి, లక్ష్మి , మైపాల్ శ్రీనివాస్, దేవయ్య, గౌతమ్, నర్సింలు, బాబు రాజారాం, జిరాజు పాల్గొన్నారు

**కాప్రా :** తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట చరిత్రను మతపరమైన కోణంలోకి వక్రీకరించటం, కమ్యూనిస్టుల పాత్రను విస్మరించటం చారిత్రక వాస్తవాలను వక్రీకరించటమేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్.బోస్ స్పష్టం చేశారు. ఎఐవైఎఫ్ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో బుధవారం ఇసిఐఎల్‌లోని నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో నారా నర్సింహ, రాజ్‌కుమార్‌ల అధ్యక్షతన తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట చరిత్ర వక్రీకరణ, వాస్తవాలు అన్న అంశంపై జరిగిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్, నాయకులు రిషిత, సతీష్ కుమార్, గిరిబాబు, చంద్రశేఖర్, ఎండి బషీర్ అలీ, మహేష్, రాంనారాయణ పాల్గొన్నారు.

**తొర్రూరు :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలంలోని వెంకటాపురంలో మొగుళ్ల మల్లయ్య, హరిపిరాల గ్రామంలోని వల్లపు కొమురెల్లి, తొర్రూరు పట్టణ కేంద్రంలోని మన్నూరు వెంకటయ్య, అమ్మాపురం గ్రామంలోని తమ్మెర వెంకట్రామనర్సయ్య, పబ్బోజు వీరభద్రయ్య, గూడెల్లి ఎల్లయ్య, జలగం సోమయ్య, తంగిరాల ప్రసాదరావు, గాదరబోయిన కొమురయ్య, బొల్లం వెంకయ్య, పంజాల రామస్వామి, కొత్తూరు నర్సయ్య దొంక రాములు, మూడు రాంరెడ్డి, గుంటుక ఐలయ్య, కొలిపాక సోమన్నల స్థూపాలకు పూలమాలలు వేసి వారి కుటుంబ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి, నాయకులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు, ఓమ బిక్షపతి, తొర్రూరు మండల కార్యదర్శి బందు మహేందర్, గణపురం లక్ష్మణ్, పేరబోయిన కిరణ్‌కుమార్, బూరుగు యాదగిరి, వల్లపు వెంకన్న, ముద్దరబోయిన వెంకన్న, వార్డు సభ్యులు యాకయ్య, కోటగిరి యాకాంతం, కృష్ణ, బొల్లు శ్రీను, మంగళపల్లి బిక్షపతి, కిషన్, పంజాల పాపయ్య, నక్కిరెడ్డి సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

**నాగర్‌కర్నూల్ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట హక్కులు కమ్యూనిస్టులవేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా మున్ననూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సాయుధ పోరాట యోధుడు రాములు స్థూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ, ఫయాజ్, నాయకులు మారేడు శివశంకర్, బలుమాల ప్రేమ్ కుమార్, గోపాల్, నరసింహ, డాక్టర్ శ్రీను, పరుశురాములు, జాజాల శ్రీను, శివకృష్ణ, సయ్యద్, మొగిల్ల శ్రీను, సంతోష్, మల్లయ్య, నరసింహ, రామకృష్ణ సి,యాదగిరి, ఎన్.మధు, బాలాజీ, లోకేష్, శ్రీధర్, బద్రు, అతిరాం, ప్రకాష్ పాల్గొన్నారు.


**మునగాల :** సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రంలో సిపిఐ మండల కార్యదర్శి చిల్లంచర్ల ప్రభాకర్ అధ్యక్షతన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించారు. అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, నాయకులు సారెడ్డి రాఘవరెడ్డి, శ్రీనివాస్, బుర్రి శ్రీనివాస్, చంద్రయ్య, స్టాలిన్, ఉప్పుల యుగేందర్ రెడ్డి, కందిబండ సత్యనారాయణ పాల్గొన్నారు.

**తిమ్మాపూర్ :** తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోలంపల్లి గ్రామంలో సిపిఐ తిమ్మాపూర్ మండల కార్యదర్శి బోయిని తిరుపతి ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, నాయకులు పొనగంటి కేదారి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, నాయకులు న్యాలపట్ల రాజు, బోయిని తిరుపతి, సూరం మల్లేశం, పిట్టల శ్రీనివాస్, కాంతాల తిరుపతిరెడ్డి, ముత్త ఎల్లస్వామి, గూడెపు రమేశ్, మర్రి కొమురయ్య, భద్రయ్య, సత్తయ్య, ఐలయ్య, మేకల శ్రీను, రాజయ్య, రమేశ్ పాల్గొన్నారు.

**హాజీపూర్:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా సెప్టెంబర్ 17న హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, హాజీపూర్ మండల కార్యదర్శి దేవి పోచన్న పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రొంటాల శ్యామ్, జూల మోహన్, జాలిగాపు రాజు, జనగామ బానేష్, రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




కరీంనగర్...తిమ్మాపూర్‌లో...



తొర్రూర్‌లో...



మంచిర్యాల...హాజీపూర్‌లో...



సూర్యాపేట...మునగాలలో...

# తెలంగాణలో సెమీకండక్టర్ల పరిశ్రమ ఏర్పాటుకు సిద్ధం

### సింగపూర్ వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వశాఖకు చెందిన ఇంధన వాణిజ్య విభాగం ప్రకటన - సిఎం రేవంత్ రెడ్డితో ప్రతినిధి బృందం భేటీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో సెమీ కండక్టర్ల పరిశ్రమ ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు సింగపూర్ వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన ఇంధన వాణిజ్య విభాగం ప్రకటించింది. సింగపూర్ మినిస్ట్రీ ఆఫ్ ట్రేడ్, ఇండస్ట్రీ పర్మనెంట్ సెక్రెటరీ ఆగస్టీన్ లీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో సమావేశమైంది. అసెంబ్లీలోని చాంబర్‌లో జరిగిన ఈ సమావేశంలో పారిశ్రామిక పెట్టుబడులపై చర్చలు జరిగాయి. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న సానుకూల అంశాలను ముఖ్యమంత్రి సమగ్రంగా వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ఆర్థిక పరమైన సహకారం అందించాలని కోరారు. పెట్టుబడులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని తెలిపారు. డిసెంబర్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'లో పాల్గొనాలని ఆగస్టీన్ లీని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపిన వివరాల ప్రకారం మూసీ పునరుజ్జీవనం, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రణాళికలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సింగపూర్ ప్రతినిధులకు వివరించారు. తొలిదశలో మూసా, ఈసా నదుల సంగమం గాంధీ సరోవర్ వరకు మూసీ పునరుజ్జీవనం చేపడుతున్నట్టు తెలిపారు. మూసీ రివర్ ఫ్రంట్‌తో పాటు నైట్ ఎకానమీ అభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేసినట్టు తెలిపారు. హైదరాబాద్ నగరాన్ని పర్యాటకంగానే కాకుండా ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిన నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీని నెట్ జీరో సిటీగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించామని వివరించారు. ఇప్పటికే హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, ఎంఐటి, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు అంగీకరించిన విషయాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. పెట్టుబడులపై సానుకూలంగా స్పందించిన సింగపూర్ ప్రతినిధి బృందం సెమీకండక్టర్ల పరిశ్రమ ఏర్పాటు చేయడానికి సానుకూలంగా ఉన్నట్టు ఈ సందర్భంగా వెల్లడించింది. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు కె.రామకృష్ణారావు, సింగపూర్ మినిస్ట్రీ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ, దక్షిణాసియా సీనియర్ డైరెక్టర్ డాక్టర్ ఫ్రాన్సిస్ చోంగ్ గారు, సింగపూర్ కాన్సుల్ జనరల్ విలియం చిక్‌తో పాటు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.



# సింగపూర్ కంపెనీలను తెలంగాణకు రప్పించండి

### ఉన్నతస్థాయి బృందానికి మంత్రి శ్రీధర్‌బాబు పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీకి సింగపూర్ సాంకేతికత, పెట్టుబడులను అనుసంధానించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, గ్రీన్ టెక్నాలజీ, పునరుత్పాదక ఇంధనం తదితర రంగాల్లో సింగపూర్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించాలని ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందాన్ని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఎనర్జీ అండ్ ట్రేడ్ శాశ్వత కార్యదర్శి ఆగస్టిన్ లీ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం బుధవారం సచివాలయంలో శ్రీధర్‌బాబుతో సమావేశమైంది. ఈ సందర్భంగా తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న పారిశ్రామిక మౌలిక వసతులను మంత్రి వివరించారు.ఫ్యూచర్ సిటీని భవిష్యత్ సాంకేతికతలకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నాం.. సింగపూర్ కంపెనీలు భాగస్వాములు కావాలి అన్న దిశగా మంత్రి ప్రతినిధులకు పిలుపునిచ్చారు. సెమీకండక్టర్ రంగంలో సింగపూర్‌కు ఉన్న సాంకేతిక, పారిశ్రామిక అనుభవాన్ని తెలంగాణతో అనుసంధానించి ఫ్యాబ్ పరిశ్రమలు, అనుబంధ యూనిట్లు, సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు సహకరించాలని కోరారు. ఐటి, ఐటిఇఎస్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, లైఫ్‌సైన్సెస్, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్, గ్రీన్ టెక్నాలజీ, రెన్యూవబుల్ ఎనర్జీ, లాజిస్టిక్స్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆర్‌అండ్‌డీ, స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్నోవేషన్ రంగాల్లో పెట్టుబడులకు తెలంగాణలో విస్తృత అవకాశాలున్నాయని శ్రీధర్‌బాబు తెలిపారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో జరిగే 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2026'లో సింగపూర్ ప్రభుత్వం, ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొనేలా సహకరించాలని కూడా మంత్రి కోరారు. తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దే క్రమంలో సింగపూర్‌తో పారిశ్రామిక, సాంకేతిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని సమావేశంలో చర్చించారు.

# నేరేడు చెరువులో పడి ఆరుగురు విద్యార్థులు మృతి

### వినాయక నిమజ్జనంలో అపశ్రుతి..

### సంగారెడ్డి జిల్లా పెద్దకంజర్ల గ్రామంలో విషాద ఘటన



**హైదరాబాద్ : పటాన్‌చెరు :** సంగారెడ్డి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దకంజర్ల గ్రామంలో వినాయక నిమజ్జనానికి వెళ్లిన ఆరుగురు విద్యార్థులు మృత్యువాత పడటంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. గ్రామంలోని వినాయక విగ్రహం నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్లిన వారిలో ఆరుగురు ప్రమాదవశాత్తూ నేరేడు చెరువులో పడిపోయారు. వెంటనే స్పందించిన గ్రామస్థులు.. గల్లంతైన వారిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధరించారు. మృతులను నరసింహ(21), తేజ(17), సిద్దార్థ(17), గణేశ్ (18), సుమంత్‌రెడ్డి (17), ఉదయ్ కిరణ్ (22)గా గుర్తించారు.

**ఘటనపై మంత్రి పొన్నం తీవ్ర దిగ్భ్రాంతి**

గణేశ్ నిమజ్జనం సందర్భంగా శిరీష ఛారిటబుల్ ట్రస్టుకు చెందిన ఆరుగురు విద్యార్థులు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థుల మృతి తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషాద ఘటనలో పిల్లలను కోల్పోయిన కుటుంబాలకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి తెలుసుకున్నారు. సహాయక చర్యలు, ఘటనకు సంబంధించిన పరిస్థితులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గణేష్ నిమజ్జనాలు జరుగుతున్న నేపథ్యంలో అధికారులు, పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేయాలని, ముఖ్యంగా పిల్లలు, విద్యార్థులు నీటిలోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు, రెవెన్యూ తదితర శాఖల అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో ప్రమాదకరమైన, లోతైన ప్రాంతాలను గుర్తించి ప్రజలు అక్కడికి వెళ్లకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. గజ ఈతగాళ్లు, రక్షణ సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

## భూ ఆక్రమణలపై సమగ్ర విచారణ

### జాన్‌వెస్లీ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని ప్రభుత్వ, అసైన్డ్ , భూదాన్, అటవీ, వక్ఫ్ భూముల ఆక్రమణలపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరపాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. బుధవారం శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన 22ఎ భూముల పరిశీలనను కేవలం కెసిఆర్ కుటుంబం, బిఆర్‌ఎస్‌కు పరిమితం చేయకుండా, కాంగ్రెస్, బిజెపి, కార్పొరేట్ సంస్థలు సహా ఎవరైనా అక్రమంగా భూములు ఆక్రమించినట్లు తేలితే చర్యలు తీసుకోవాలని కోరారు. ఆక్రమణకు గురైన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని భూమిలేని పేదలకు పంపిణీ చేయాలని, విచారణ వివరాలను బహిర్గతం చేసి శాసనసభలో చర్చించాలన్నారు. హైదరాబాద్ పరిసరాల్లోని అన్యాక్రాంత భూములను తిరిగి స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలి

### ఎమ్మెల్సీ కోదండరామ్‌కు అంజద్ అలీ ఖాన్ వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** విధి నిర్వహణలో లేదా అనుకోని పరిస్థితుల్లో మృతిచెందిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ బస్తీ దవాఖాన కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజద్ అలీ ఖాన్ కోరారు. ఈ మేరకు బుధవారం తార్నాకలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అనుకోకుండా మృతిచెందిన అనంతరం వారి కుటుంబాలకు అందాల్సిన ఇఎస్ఐ, పిఎఫ్, ఇడిఎల్ఐ ఇన్సూరెన్స్, పెన్షన్, ప్రమాద బీమా తదితర ప్రయోజనాలు సకాలంలో అందడం లేదని అంజద్ అలీ ఖాన్ తెలిపారు. ఇఎస్ఐ, పిఎఫ్, బ్యాంకులు, ఇన్సూరెన్స్ సంస్థలు, కాంట్రాక్ట్ ఏజెన్సీలు, ప్రభుత్వ అధికారుల మధ్య సమన్వయ లోపాలను పరిష్కరించి బాధిత కుటుంబాలకు రావాల్సిన ప్రయోజనాలను త్వరగా అందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే అర్హులైన కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఎక్స్‌గ్రేషియా అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ కోదండరామ్ హామీ ఇచ్చినట్లు అంజద్ అలీ ఖాన్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మంగళపాటి సుమన్, కన్వీనర్ మెతుకు ఉప్పలయ్య, జాయింట్ సెక్రటరీ రౌతు నర్సింహ్మా, కమిటీ సభ్యులు శాంతమ్మ, స్వప్న, అనిత, అఖిల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం

### త్వరలో గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికలు: మంత్రి వివేక్ వెంకటస్వామి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. త్వరలో ఆర్‌టిసి గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహిస్తామని వెల్లడించారు. నాగోల్‌లోని కల్యాణలక్ష్మి గార్డెన్‌లో తెలంగాణ ఆర్‌టిసి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం వేలాదిమంది ఆర్‌టిసి కార్మికులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆర్‌టిసి మజ్దూర్ యూనియన్, తెలంగాణ ఆర్‌టిసి వర్కర్స్ యూనియన్‌లో విలీనమైంది. వర్కర్స్ యూనియన్ నూతన అధ్యక్షుడిగా మొగుళ్ల రాజిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యూనియన్ వ్యవస్థాపక కార్యదర్శి ఇ.అశ్వత్థామరెడ్డి ప్రకటించారు. అనంతరం మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ఆర్‌టిసి డ్రైవర్లు, కండక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధి రెండూ సమాంతరంగా సాగాలని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం విజయవంతంగా అమలు కావడంలో ఆర్‌టిసి డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని మంత్రి అభినందించారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కొదండరాం మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్‌టిసి కార్మికులు తీవ్రంగా నష్టపోయారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వారి సమస్యల పరిష్కారానికి సానుకూలంగా ఉందన్నారు. మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ జలమండలిలో మొగుళ్ల రాజిరెడ్డి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. మొగుళ్ల రాజిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి ఆర్‌టిసి కార్మికుల సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఎపి మిథున్‌రెడ్డి, ఐఎన్‌టియుసి నేతలు ఇందిరారెడ్డి, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, గాయకుడు నల్గొండ గద్దర్ తదితరులు పాల్గొన్నారు.

# హైటెక్ హంగులతో ఆర్‌టిసి బస్‌స్టేషన్‌లు

### రవాణాతో పాటు షాపింగ్, వినోద సదుపాయాలు

### ఇంటిగ్రేటెడ్ ట్రాన్సిట్ విధానంలో అభివృద్ధి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బస్టాండ్ అంటే బస్సు ఎక్కి దిగే ప్రదేశమే కాదు.. ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు ఒకేచోట అందించే ఆధునిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ ఆర్‌టిసి) చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోని 13 ప్రాంతాల్లో (నాగర్‌కర్నూల్, రేగొండ, హుజూర్‌నగర్, కోదాడ, కొడంగల్, కోస్గి, మద్దూరు, కేసముద్రం, హుస్నాబాద్, ములుగు, మధిర, నల్గొండ, కొత్తగూడెం) హైటెక్ బస్ స్టేషన్లను 'ఇంటిగ్రేటెడ్ ట్రాన్సిట్ సిస్టమ్' విధానంలో అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. బస్సు రవాణాతో పాటు ఇతర రవాణా మార్గాల అనుసంధానం, షాపింగ్, వ్యాపారం, ఆహారం, వినోదానికి సంబంధించిన సదుపాయాలను ఈ బస్‌స్టాండ్‌లలో కల్పించనున్నారు. కొత్త బస్ స్టేషన్లు ఆధునిక వసతులతో కార్పొరేట్ తరహాలో రూపుదిద్దుకోనున్నాయి. ప్రయాణికులకు రైల్వేతో పాటు ఇతర రవాణా వ్యవస్థలతో అనుసంధానం కల్పిస్తూ, ఎయిర్‌పోర్ట్ స్థాయి సదుపాయాలతో వీటిని తీర్చిదిద్దబోతున్నారు. తెలంగాణ ప్రభుత్వ సహకారం, టిజిఎస్ ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి వినూత్న ఆలోచనతో రూపొందించిన ఈ బృహత్తర ప్రాజెక్టుకు ప్రభుత్వం, రవాణా శాఖల నుంచి ఇప్పటికే అధికారిక అనుమతులు లభించాయి.

**వ్యాపారులకు అవకాశం.. :** హైటెక్ బస్ స్టాండ్లలో ఏర్పాటు చేయనున్న షాపులు, వాణిజ్య సముదాయాల్లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహించేందుకు ఆసక్తి ఉన్న వ్యాపారులు ఆర్‌టిసి యాజమాన్యాన్ని సంప్రదించవచ్చని సంస్థ తెలిపింది. ప్రభుత్వ సహకారంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు లభించాయని, త్వరలో నిర్మాణ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. ఆధునిక సదుపాయాలతో బస్ స్టేషన్లను అభివృద్ధి చేయడం ద్వారా ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించడంతో పాటు, ప్రజా రవాణా కేంద్రాలను వాణిజ్య, వినోద కార్యకలాపాలకు అనువైన ప్రదేశాలుగా మార్చే దిశగా టిజిఎస్‌ఆర్‌టిసి అడుగులు వేస్తోంది.



## బిఆర్‌ఎస్ భూములపై దండయాత్ర చేస్తాం

### కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

**ప్రజాపక్షం/కరీంనగర్ :** బిఆర్‌ఎస్ దోచుకున్న భూములపై బిజెపి ఆధ్వర్యంలో దండ యాత్ర చేస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రకటించారు. ఆ భూముల్లో కాషాయ జెండా ఎగరేసి పేదలకు పంచి పెడతామన్నారు. అసెంబ్లీలో బిఆర్‌ఎస్ భూదోపిడీని సిఎం ప్రస్తావించడం వెనుక పెద్ద మతలబు ఉందన్నారు. యుపి ఎన్నికల నేపథ్యంలో ఎఐసిసికి ఇఎంఐ కట్టేందుకే అసెంబ్లీలో బిఆర్‌ఎస్ భూదోపిడీని ప్రస్తావించి ఆ పార్టీతో బేరసారాలకు సిద్ధమయ్యారని అన్నారు. బుధవారం మానకొండూరు, చింతకుంట, కొత్తపల్లి ప్రాంతాల్లో పర్యటించి గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను బండి సంజయ్ పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా ఉత్సాహంగా నిమజ్జనోత్సవాలు జరుపుకునేలా గణేష్ నిమజ్జన ఏర్పాట్లను చేయాలని అధికారులను కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. బిఆర్‌ఎస్‌కు సంబంధించి 8 మంది ఎమ్మెల్యేల భూభాగోతం గురించి మాట్లాడటానికి గంట సమయం పట్టిందా... మరి 90 మంది ఎమ్మెల్యేల భూభాగోతం గురించి మాట్లాడాలంటే ఎన్ని రోజులు అసెంబ్లీ నిర్వహించాలని విమర్శించారు. బిఆర్‌ఎస్ నేతలు మాత్రం వేల ఎకరాల భూములను దోచుకున్నారు. అసెంబ్లీ సాక్షిగా సిట్ పేరుతో నియమించిన విచారణ కమిటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. విద్యుత్ కొనుగోళ్లు, ఈ ఫార్ములా రేసు, కాళేశ్వరం, గొర్రెల స్కాం సహా కేసులన్నీ ఏమయ్యాయి? వందల ఎకరాల ఫారెస్ట్ భూములను కబ్జా చేసిన వాళ్లపై చర్యలేవని ప్రశ్నించారు.

## 18న దానం అనర్హత పిటిషన్‌పై తీర్పు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్టీ ఫిరాయింపు వ్యవహారానికి సంబంధించిన రెండు అనర్హత పిటిషన్‌లపై హైకోర్టు తీర్పును ఈనెల 18కి వాయిదా వేసింది. స్పీకర్ అనర్హత పిటిషన్‌లను కొట్టివేయడాన్ని సవాలు చేస్తూ బీఆర్ఎస్, బిజెపి ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, ఎ. మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌లపై చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ డివిజన్ బెంచి గతంలో తీర్పు వాయిదా వేసింది. బుధవారం తీర్పు వెలువడాల్సి ఉండగా తీర్పు సిద్ధం కాకపోవడంతో 18న ప్రకటించనున్నట్లు తెలిపింది. ఇతర ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్‌లను స్పీకర్ కొట్టివేయడాన్ని సవాలు చేసిన కేసుల విచారణను వచ్చేనెల 6కి వాయిదా వేసింది.

## సీసీటీవీ ఫుటేజీ భద్రపరచాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అసెంబ్లీ వద్ద ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకున్న ఘటన రోజున కార్యకర్తలను రెచ్చగొట్టారంటూ నమోదైన కేసు విచారణకు హాజరైన కేటీఆర్ పీఆర్వో మహేష్ మాణిక్య, పీఏ మహేందర్‌రెడ్డిలకు హైకోర్టులో ఊరట లభించింది. పోలీస్ స్టేషన్ కి వెళ్ళినప్పుడు తమపై కొందరు వ్యక్తులు దౌర్జన్యం చేసేందుకు ప్రయత్నిస్తే పోలీసులు అడ్డుకోలేదంటూ వారు హైకోర్టును ఆశ్రయించారు. దీనికి సంబంధించిన సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణలో వారికి రక్షణ కల్పించాలంది. పోలీసులు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించిన హైకోర్టు విచారణను వాయిదా వేసింది.

## నా భూముల్లో ఒక్క ఇంచు కూడా ఇనాం భూములు లేవు

### బిఆర్‌ఎస్ మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తన భూముల్లో ఒక్క ఇంచు కూడా ఇనాం భూములు లేవని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి జి.జగదీష్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 2018, 2023 ఎన్నికల అఫిడవిట్‌లో తన వివరాలన్నీ స్పష్టం చేశానని, కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావు, బిఆర్‌ఎస్ నాయకులపైన సిఎం చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని తెలిపారు. సిఎంరేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా అబద్దాలు చెప్పి సభా హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నారన్నారు. మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ కెసిఆర్ కు ఉన్నదే 67 ఎకరాలు అని చెబుతూనే మరో వైపు 300 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి అని సిఎం చెబుతున్నారని మండిపడ్డారు. జీవితాంతం కాంగ్రెస్‌లోనే ఉన్న రవీందర్ రావుకు ఆయన తాతల కాలం నుంచి వచ్చిన ఆస్తులను ప్రస్తుత సిఎం రేవంత్ రెడ్డి కబ్జా అని చెబుతున్నారన్నారు.

# సామాన్యుల నడ్డి విరిచేలా యుపిఐ చార్జీల భారం

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు




**ప్రజాపక్షం/హనుమకొండ :** సామాన్యుల నడ్డి విరిచేలా కేంద్ర ప్రభుత్వం యుపిఐ చెల్లింపులపై చార్జీల భారం మోపు చున్నదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. బుధవారం హనుమకొండ కాళోజీ సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న యుపిఐ చెల్లింపులపై చార్జీలకు వ్యతిరేకంగా నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భం గా యుపిఐచెల్లింపులపై చార్జీల బాదుడు మానుకోవాలని, కేంద్ర ప్రభు త్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, సామాన్యులపై భారం మోపుతు న్న బిజెపి ప్రభుత్వ వైఖరి నశించాలని ప్లకార్డులతో సిపిఐ కార్యకర్తలు నినాదాలు చేశారు. అనంతరం రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో డిజిటల్ ఇండియా నినాదంతో అధికారంలోకి వచ్చిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ఇప్పుడు సామాన్య ప్రజలు, మధ్యతరగతి వ ర్గాలు, చిన్న వ్యాపారుల నడ్డి విరిచేలా యుపిఐ లావాదేవీలపై పరోక్షంగా ఛా ర్జీల భారాన్ని మోపేందుకు సిద్ధమైందని అన్నారు. గత కొన్ని సంవత్సరాలు గా డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న మోదీ ప్రభుత్వం, తాజాగా రూ. 2,000 మించిన యుపిఐ లావాదేవీలపై ఛా ర్జీలు వసూలు చేసేందుకు మార్గం సుగమం చేయడం అత్యంత దుర్మార్గం అ ని, రోజువారీ చిన్న వ్యాపారాలు, కిరాణా షాపుల్లో జరిగే లావాదేవీలపై ఈ నిబంధనలు తీవ్ర ప్రభావం చూపుతాయని అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు అత్యంత సులువుగా వాడే డిజిటల్ పేమెంట్స్ వ్యవస్థను సంక్లిష్టం చే సి, కార్పొరేట్ సంస్థలకు, విదేశీ పేమెంట్ గేట్‌వేలకు లబ్ధి చేకూర్చేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. యుపిఐని డిజిటల్ ఇండియా కు ప్రతీకగా ప్రధాని మోదీ పదేపదే ప్రొజెక్ట్ చేశారని, అయితే విదేశీ ఒత్తిళ్ల కా రణంగా దాని స్వయంప్రతిపత్తిని వదులుకోవడం మన డిజిటల్ సార్వభౌమత్వానికే ఒక మచ్చ అని, ఇది చివరికి విదేశీ చెల్లింపు కార్పొరేషన్ల వాణిజ్య ప్ర యోజనాలకు సేవ చేస్తూ, వ్యాపారులపై, వినియోగదారులపై భారాన్ని మోపుతుందన్నారు. వాల్‌మార్ట్ యాజమాన్యంలోని ఫోన్‌పే, ఆల్ఫాబెట్ యాజమాన్యంలోని గూగుల్‌పే లు సంయుక్తంగా దాదాపు 80 శాతం యుపిఐ లా వాదేవీలను ప్రాసెస్ చేస్తున్నాయని,మోదీ ప్రభుత్వం ఇప్పటికే భారత దేశ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో సింహభాగాన్ని ఈ సంస్థలకు కట్టబెట్టిందని,ప్రజా డిజిటల్ మౌలిక సదుపాయాలను భారీగా వినియోగిస్తున్నందుకు, వేల కోట్ల ఆదాయాన్ని ఆర్జిస్తున్న ఈ దిగ్గజ కార్పొరేషన్లతో రుసుములు చెల్లించేలా చే యాల్సింది పోయి, ప్రభుత్వం వ్యాపారులపై, వినియోగదారులపై భారం మోపాలని ఎంచుకుందని తెలిపారు. సాధారణ, పరస్పర అనుసంధాన, త క్కువ ఖర్చుతో కూడిన చెల్లింపులను అందించడానికి యుపిఐని పబ్లిక్ డిజిట ల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌గా నిర్మించారని,విదేశీ కార్పొరేట్ ప్రయోజనాల కోసం దీనిని బలహీనపరచకూడదని సూచించారు. మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేకమైన ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని యుపిఐని ఉచితంగా కొనసాగించాలని, యుపిఐ లావాదేవీలపై విధించాలనుకుంటున్న అన్ని రకాల ఛార్జీల ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమా ండ్ చేశారు. డిజిటల్ లావాదేవీలను పూర్తిగా ఉచితంగా కొనసాగించాలని, సామాన్యులకు ఎలాంటి ఆర్థిక భారం పడకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం తన మూర్ఖపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే, ప్రజలను సమీకరించి పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.ఈ కా ర్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆ దరి శ్రీనివాస్, సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, జిల్లా నాయకులు ఎన్. అశోక్ స్టాలిన్, మునిగాల భిక్షపతి, ఏదునూరి వెంకట్రాజం, నేదునూరి రాజమౌళి, బత్తిని సదానందం, కండె నర్సయ్య, గు ంటి రాజేందర్, యాళ్ళ సంజయ్, అలకుంట యాకయ్య, నోముల కిషోర్, స్వామి, శిరీష, రజిత తదితరులు పాల్గొన్నారు.



## మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

### మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అన్నారు.బుధవారం ఒకటవ డివిజన్లోని పానగల్ పచ్చల సోమేశ్వరాలయం లో స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు మేయర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేషన్ కార్డులను స్మార్ట్ కార్డులుగా డిజిటలైజ్ చేసి పంపిణీ చేయడం సంతోషకరమైన విషయమని, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.నల్లగొండ పట్టణంలోని 48 డివిజన్ల పరిధిలో 42,855 స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరయ్యాయని, వాటిని ఆయా వార్డుల్లో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో స్మార్ట్ రేషన్ కార్డుల విధానం అమలు చేస్తున్నామని, దీనివల్ల రేషన్ పంపిణీలో పారదర్శకత పెరిగి అవకతవకలకు అడ్డుకట్ట పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అమీర్ అలీ,ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డి,తహసిల్దార్ పరుశురాములు, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి ,కార్పొరేటర్ నాగరాజు,వేణుగోపాల్ రెడ్డి,వార్డు ఆఫీసర్ అనిల్,లబ్ధిదారులు పాల్గొన్నారు .

## నిరంతరం ప్రజలకు వైద్య సేవలు

### డిఎంహెచ్ఒ డాక్టర్ రాహుల్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** సబ్ సెంటర్ పరిధిలోని ప్రజలకు నిరంతరం నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.రాహుల్ ఆదేశించారు. బుధవారం నల్లగొండ మండలంలోని రాములబండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కథల్‌గూడ సబ్ సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సబ్ సెంటర్‌లోని రికార్డులు,రిజిస్టర్లు,మందుల నిల్వ,అందుబాటులో ఉన్న వైద్య సేవలను పరిశీలించారు.విధుల్లో ఉన్న వైద్యాధికారి,సిబ్బందితో మాట్లాడి డీఎంహెచ్ఓ అన్ని రికార్డులు,రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.అత్యవసర, ముఖ్యమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సబ్ సెంటర్ పరిధిలోని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు నిరంతరం అందించాలని సూచించారు.వారి ఆరోగ్య అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.ఈ తనిఖీలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ నాగేష్,హెచ్ఈఈఓ అంజయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.

## కార్మికుల కుటుంబాలకు అండగా ఇ-శ్రమ్ ఇన్సూరెన్స్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** వివిధ రంగాల్లో పనిచేస్తున్న సంఘటిత, అసంఘటిత కార్మిక కుటుంబాలకు అండగా ఇశ్రమ్ ఇన్సూరెన్స్ నిలుస్తుందని తెలంగాణ రాష్ట్ర రీజనల్ డైరెక్టర్ ఎమ్.ఆర్ దేశ్‌పాండే అన్నారు. బుధవారం పట్టణంలోని పద్మశాలి భవన్‌లో జాతీయ కార్మిక విద్యా దినోత్సవం సందర్భంగా ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈశ్రమ్ ఇన్సూరెన్స్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో హుజూర్‌నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి 100 మంది కార్మికులకు ఈశ్రమ్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేషనల్ వర్కర్స్ ఎడ్యుకేషన్ డే ను ప్రతి కార్మికుడు పండుగల జరుపుకోవాలని, కార్మికుల హక్కుల చట్టాలను రక్షించుకోవడానికి అవగాహన కల్పించడం కోసం 1958 సంవత్సరం సెప్టెంబర్ 16న కార్మిక విద్యాసంస్థ ఇండోర్‌లో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 18 సంవత్సరాల నుండి 59 సంవత్సరాలలోపు వివిధ రంగాలలో పనిచేసే కార్మికులందరూ కూడా ఇశ్రమ్ ఇన్సూరెన్స్ కార్డు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ ఆఫీసర్ డాక్టర్ మహేశ్వర్ బాబు, సీనియర్ ఆఫీసర్లు సంశీర్, అభిలాష్, నరసింహ, సర్పంచ్ రాధా నాగరాజు, కౌన్సిలర్ సుష్మమురళి, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి బంటు చుక్కయ్య, నియోజకవర్గ అధ్యక్షులు బెల్లంకొండ గురువయ్య పాల్గొన్నారు.

## 'వెంటాడే కలాలు' జన్మస్థలి కోదాడ

**ప్రజాపక్షం/కోదాడ :** తెలుగు సాహిత్య చరిత్రలో ఒక అధ్యాయంగా నిలిచిన వెంటాడే కలాలు వెనుకబడిన కులాలు సంకలనానికి కోదాడ జన్మస్థలి కావడం గర్వకారణంగా ఉందని పుస్తక సంపాదకుడు, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలురు గౌరీ శంకర్ అన్నారు. ఓనమాలు దిద్దించి నడక నేర్పిన నడిగూడెం, సామాజిక స్పృహనందించిన కోదాడ మట్టిస్ఫూర్తితోనే వెంటాడే కలాలు సంకలనం తీసుకువచ్చినట్లు తెలిపారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 20న జరిగే బిసి కవుల అలాయ్ బలాయ్ వెంటాడే కలాలు పుస్తక రజతోత్సవ సందర్భంగా కోదాడలో బుధవారం త్రివేణి డిగ్రీ కళాశాలలో రజతోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2001లో పల్లెలు ఛిద్రమై, కులవృత్తులు ధ్వంసమై, బడుగుల బతుకులు అల్లకల్లోలమైపోతున్న ప్రపంచీకరణ నేపథ్యంలో వెంటాడే కలాలు సంకలనం తీసుకురావడం జరిగిందన్నారు. అనంతరం పుస్తక సంపాదకులు కవి జూలూరు గౌరీశంకర్‌ను త్రివేణి, వాగ్దేవి, రేస్ కళాశాలల చైర్మన్ బాణాల వసంత ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రామనర్సయ్య, హరికిషన్, పొట్ట జగన్నాథం, షేక్ మీరా, డివన్ స్వామి, జిఎల్ఎన్‌రెడ్డి, రాయపూడి చిన్ని, వేములు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



# ఒయో రూమ్‌లో గంజాయి దందా!

- అసోం నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలింపు..
- రూ. 17.1 గంజాయి స్వాధీనం.. ఇద్దరు అరెస్టు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇప్పటివరకు ఒయో రూమ్స్‌గా గుర్తింపు పొందిన హోటల్ గదులు గంజాయి విక్రయాలకు కూడా అడ్డాగా మారాయన్న విషయం ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ దాడితో వెలుగులోకి వచ్చింది. కొండాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని ఒయో హైలైట్స్ హోటల్‌లో గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు 17.1 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.9 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ సిఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది నిర్వహించిన ఆపరేషన్‌లో అస్సాంకు చెందిన ధీరజ్‌దాస్ (39), రబాలి అలీ (25) పట్టుబడ్డారు. వీరిద్దరూ కొంతకాలంగా హైదరాబాద్‌లో సెక్యూరిటీ గార్డులుగా పనిచేసినట్లు ఎక్సైజ్ విచారణలో వెల్లడైనట్లు అధికారులు తెలిపారు. సెక్యూరిటీ గార్డులుగా వచ్చే ఆదాయం సరిపోవడం లేదన్న కారణంతో నిందితులు గంజాయి విక్రయాల వైపు మళ్లినట్లు విచారణలో వెల్లడైనట్లు ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు. అస్సాం నుంచి గంజాయిని హైదరాబాద్‌కు తరలించి, కొండాపూర్‌లోని ఒయో హైలైట్స్ హోటల్‌లో గదులు అద్దెకు తీసుకుని అక్కడ చిన్నచిన్న ప్యాకెట్లుగా తయారు చేసి విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలిపారు. గంజాయి రవాణా, నిల్వ, విక్రయాల వెనుక ఇంకా ఎవరెవరున్నారన్న అంశంపై కూడా విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం. అస్సాం నుంచి గంజాయిని హైదరాబాద్‌కు ఎలా తరలించారు? సరుకు ఎవరికి చేరేది? హోటల్ గదులను ఎంతకాలంగా వినియోగిస్తున్నారు? స్థానికంగా మరెవరైనా సహకరించారా? అనే కోణాల్లో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. పట్టుబడిన ఇద్దరు నిందితులను, స్వాధీనం చేసుకున్న గంజాయిని తదుపరి చర్యల కోసం కొండాపూర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు.ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అవినాష్ మహంతి, జాయింట్ కమిషనర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అంజన్‌రావు, డిఎస్‌పి తులా శ్రీనివాసరావు అభినందించారు.

# రూ.25.41 కోట్లతో ఖమ్మం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ

- అమృత్ భారత్ పథకంలో పనులు
- తుది దశకు.. ప్రయాణికులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో కీలకమైన ఖమ్మం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ.25.41 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ పునరాభివృద్ధి పనుల్లో పలు సౌకర్యాలు ఇప్పటికే పూర్తికాగా, మిగిలిన పనులు తుది దశకు చేరుకున్నాయి. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు, సులభమైన రాకపోకలు, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందించడమే లక్ష్యంగా ఆధునిక వసతులను కల్పిస్తున్నారు. కాజీపేట విజయవాడ రైల్వే సెక్షన్‌లో ఉన్న ఖమ్మం స్టేషన్‌ను నాన్‌సబర్బన్ గ్రేడ్3 (ఎన్ఎస్‌జి3) స్టేషన్‌గా వర్గీకరించారు. ప్రతిరోజూ సుమారు 20 వేల మంది ప్రయాణికులు ఈ స్టేషన్ ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. సుమారు 55 రైళ్లు ఇక్కడ నిలుస్తుండగా, న్యూఢిల్లీ, హౌరా, చెన్నై, విజయవాడ, విశాఖపట్నం, సికింద్రాబాద్, తిరుపతి తదితర ప్రధాన నగరాలకు రాకపోకలు సాగించే పలు సూపర్‌ఫాస్ట్ రైళ్లకు కూడా ఖమ్మంలో హాల్ట్ సౌకర్యం ఉంది. స్టేషన్ పునరాభివృద్ధిలో భాగంగా పాదచారుల వంతెన, లిఫ్టులు, ఎస్కలేటర్లు, ప్లాట్‌ఫారామ్‌ల అభివృద్ధి, విశ్రాంతి గదులు, ఆర్‌పిఎఫ్ గదులు, ఎసి లాంజ్ తదితర పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. ప్రస్తుతం నూతన స్టేషన్ భవన నిర్మాణంతో పాటు స్టేషన్ ప్రాంగణంలో పచ్చదనం పెంపు, ముఖభాగం, పరిసరాల అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. అమృత్ భారత్ స్టేషన్ పథకం ద్వారా దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్న నేపథ్యంలో తెలంగాణలోనూ రూ.2 వేల కోట్లకు పైగా వ్యయంతో 40 స్టేషన్లను పునరాభివృద్ధి చేస్తున్నారు. 2023 ఆగస్టు, 2024 ఫిబ్రవరిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రంలోని పలు స్టేషన్ల పునరాభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఢిల్లీ చెన్నై, హైదరాబాద్ విజయవాడ రైల్వే మార్గాల కూడలిలో ఖమ్మం స్టేషన్ కీలకంగా ఉంది. ఖమ్మం జిల్లా కేంద్రంగా ఉండటంతోపాటు చుట్టుపక్కల పట్టణాలు, గ్రామాలకు ప్రధాన రవాణా కేంద్రంగా సేవలందిస్తోంది. విద్యాసంస్థలు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు రాకపోకలు సాగించే ప్రజలకు కూడా ఈ స్టేషన్ కీలకంగా ఉంది. పునరాభివృద్ధి పూర్తయిన తర్వాత ప్రయాణికుల సౌకర్యాలు మరింత మెరుగుపడటంతో పాటు ఖమ్మం ప్రాంతంలో రవాణా, వాణిజ్య కార్యకలాపాలకు కూడా ఊతం లభించనుంది.

## కెసిఆర్ కుటుంబ ఆస్తులను పేదలకు పంచాలి

### 440 ఎకరాలను ప్రజల ఆస్తులుగానే చూడాలి: చనగాని దయాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మాజీ సిఎం కెసిఆర్ కుటుంబానికి సంబంధించిన అక్రమ ఆస్తులను గుర్తించి పేదలకు పంచే వరకు పోరాడుతామని టిపిసిసి జనరల్ సెక్రటరీ, సీనియర్ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు. 440 ఎకరాల భూమిని ప్రజల ఆస్తిగానే చూడాలని, సిఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం విప్లవాత్మక ఆలోచన అని పేర్కొన్నారు. ధరణి పేరుతో గత ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను దగా చేసిందని, ప్రభుత్వ భూములను ఆక్రమించారని దయాకర్ ఆరోపించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని వందల కోట్ల రూపాయలు దోచుకున్నారని విమర్శించారు. 22ఎ భూముల జాబితా ఉమ్మడి రాష్ట్రం నుంచే కొనసాగుతోందని, బిఆర్ఎస్ పదేళ్ల పాలనలోనూ అదే జాబితా కొనసాగిందని తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు 22ఎ జాబితాను కలెక్టర్లు అప్‌డేట్ చేశారని చెప్పారు. రిజిస్ట్రేషన్, పట్టా భూములు పొరపాటున నిషేధిత జాబితాలో చేరితే ఆర్‌డిఓ, సబ్‌కలెక్టర్ స్థాయిలో వాటిని తొలగించే అవకాశం ఉందన్నారు. అసెంబ్లీలో సిఎం రేవంత్‌రెడ్డి 22ఎ భూములపై ప్రజలకు స్పష్టత ఇచ్చారని పేర్కొన్నారు. భూ అక్రమాలు, అవినీతి వ్యవహారాలు బయటపడతాయనే భయంతోనే బిఆర్ఎస్ నేతలు ఆందోళనకు దిగుతున్నారని దయాకర్ విమర్శించారు. కెసిఆర్ కుటుంబ ఆస్తులను పేదలకు పంచే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

## నేటి నుంచి 'సేవా సంకల్ప్ అభియాన్'

### రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్




**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ :** దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం, తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా 'సేవా సంకల్ప్ అభియాన్' పేరిట ఈ నెల 17 నుంచి అక్టోబర్ 17 వరకు పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలని బిజెపి జాతీయ నేత, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బిజెపి గోల్కొండ జిల్లా అధ్యక్షులు టి.ఉమా మహేంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి, మాట్లాడారు. గత కాంగ్రెస్ హయాంలో అవినీతి కేసులు అనేకం వెలుగులోకి వచ్చాయని, ప్రధాని మోదీ పాలనలో ఒక్క అవినీతి మరక లేకుండా సుపరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. మోదీ పాలనలో భారత్ అభివృద్ధిలో ముందుకు సాగుతోందన్నారు. త్వరలోనే ప్రపంచంలో అగ్రస్థానానికి చేరుకొంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మోదీ జన్మదిన వేడుకలను ప్రజలంతా పండుగ వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. పేదలకు సేవ చేయాలని, యువత రక్తదానం చేయాలని కోరారు. మోదీ పాలనలోని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ప్రేమ్ సింగ్ రాథోడ్, మాజీ కార్పొరేటర్లు శశికళ, సురేఖ, నేతలు సంజయ్, పురుషోత్తం, జి.కృష్ణ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## యుపిఐ లావాదేవీలపై చార్జీలు సామాన్య ప్రజలపై దాడి: వలి ఉల్లా ఖాద్రి

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** యుపిఐ లావాదేవీలపై ఛార్జీలు విధించాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దేశంలోని సామాన్య ప్రజలపై ఆర్థిక దాడి అని ఎఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి తీవ్రంగా ఖండించారు.నోట్ల రద్దు (డీమానిటైజేషన్) పేరుతో దేశ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిన కేంద్ర ప్రభుత్వం, అనంతరం డిజిటల్ ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహిస్తూ యుపిఐ వినియోగాన్ని విస్తృతంగా ప్రాచుర్యం చేసిందని, దేశంలో యుపిఐ వినియోగం పెరగడాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, బిజెపి ప్రభుత్వం గొప్ప విజయంగా ప్రచారం చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. అదే ప్రభుత్వం యుపిఐ లావాదేవీలపై ఛార్జీలు విధించడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. ప్రభుత్వం ఈ ఛార్జీలు వ్యాపారుల ఖాతాలకు మాత్రమే వర్తిస్తాయని చెబుతున్నప్పటికీ, చివరికి ఆ భారం వినియోగదారులపైనే పడుతుందని, ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు, ద్రవ్యోల్బణం కారణంగా ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో యుపిఐపై అదనపు ఛార్జీలు విధించడం అమానుషమని డాక్టర్ ఖాద్రి అన్నారు. ఎఐవైఎఫ్ తరపున కేంద్ర బిజెపిప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, దేశ ప్రజలకు యుపిఐ సేవలను పూర్తి గా ఉచితంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

# క్షీణించిన ఉద్యమకారుడు జారంగే ఆరోగ్యం

### ముంబై నిరసన యాత్ర విరమించే అవకాశం



**బీడ్(మహారాష్ట్ర):** మరాఠా రిజర్వేషన్ ఉద్యమకారుడు మనోజ్ జారంగే తలపెట్టిన ముంబై యాత్రను విరమించుకునే అవకాశం ఉంది. ఎందుకంటే ఆయన ఆరోగ్యం బాగా క్షీణించింది. నిర్ణీత ప్రకారం జరాంగే సెప్టెంబరు 19వ తేదీ నాటికి ముంబైలోని ఆజాద్ మైదాన్‌కు చేరాల్సి ఉంది. ప్రస్తుతం ఆయన బీడ్‌జిల్లా వరకూ వచ్చారు. ఇంకా ఆయన యాత్ర అహిల్యానగర్, పూణే, రాయగడ్ జిల్లాలు దాటి ముంబై వెళ్ళాలి. కానీ పోలీసులు ఆయనకు అక్కడ నిరసన చేపట్టేందుకు అనుమతి ఇవ్వలేదు. పైగాగణేశ్ మహోత్సవాలు జరుగుతున్న సమయంలో మైదానాలు ఖాళీగా లేవని, ఈ దశలో ఎందుకు నిరసన చేపడుతున్నారని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రశ్నించారు.ఆయన డిమాండ్లలో చాలావాటిని ప్రభుత్వం ఆమోదించిన తర్వాత గత ఏడాది సెప్టెంబరు రెండో తేదీన ఆందోళన విరమించారు. ఐతే ప్రస్తుతం డిమాండ్ల సాధనకోసం ఆయన తలపెట్టిన నిరాహారదీక్షతో కూడిన ముంబై యాత్ర 19వ రోజుకు చేరుకుంది. ఆయన ఆరోగ్యం విషమస్థాయికి చేరుకుందని, నిరాహారదీక్ష కారణంగా ఆయన శరీరంలో డీహైడ్రేషన్ ఏర్పడిందని, చక్కెరస్థాయిలు కూడా గణనీయంగా పడిపోయాయని బీడ్ జిల్లా సివిల్ సర్జన్ డాక్టర్ సతీష్ సోలంకే నాయకత్వంలోని వైద్యులబృందం బుధవారంనాడు స్పష్టం చేసింది.ఈ దశలో ఆయన ముంబైలోని ఆజాద్ మైదాన్‌కు చేరుకుని దీక్ష కొనసాగించే పరిస్థితులు కనిపించడంలేదు. దీంతో బీడ్‌జిల్లా పటోడాలో మనోజ్ జారంగే పాత్రికేయులతో మాట్లాడుతూ కీలక ప్రకటన చేశారు.తాను దీక్ష విరమిస్తే ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని, ఉద్యమంలో ఉన్నవారు ఆందోళన చెందుతారని, అందువల్ల తాను రిజర్వేషన్లు సాధించడం ముఖ్యంగానీ,యాత్ర చేయడం ముఖ్యం కాదన్నారు. మరాఠాలో కున్బీ కులస్థులకు ఓబిసి రిజర్వేషన్లు ఇవ్వాలని ఆయన ఆందోళన చేస్తున్నారు. ఐతే తనను ఒంటరిగా ముంబై వెళ్ళనివ్వాలని, ఒకవేళ పోలీసులు తనను రానివ్వకపోతే సమాచారం అందిస్తానని, తర్వాత అందరూ తరలిరావాలని ఆయన కోరారు.

# దేశవ్యాప్తంగా ఉల్లి కిలో రూ.53.92

- ఉల్లి కొరత లేదు:ధర తగ్గిందని కేంద్రం ప్రకటన
- గతంకంటే ఈ ఏడాది స్వల్పంగా తగ్గిన ఉత్పత్తి



**న్యూఢిల్లీ:** గడచిన తొమ్మిది రోజుల్లో ఉల్లిపాయల ధర హోల్‌సేల్ మార్కెట్‌లో తొమ్మిదీశాతం మేరకు తగ్గిందని కేంద్ర వినియోగ వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యదర్శి నిధి ఖరే చెప్పారు.మంగళవారంనాటికి చిల్లర మార్కెట్‌లో కేజీ ఉల్లిపాయలు సగటు ధర దేశవ్యాప్తంగా రూ.53.92లుగా నమోదైనట్లు చెప్పారు. ఉల్లిపాయలకు కొరత లేదని చెప్పారు. త్వరలో రిటైల్ మార్కెట్‌లో ఈ ధర గణనీయంగా తగ్గుముఖం పడుతుందన్నారు.నెలరోజుల క్రితంనాటితో పోలిస్తే ఉల్లిపాయల కిలో ధర 48శాతం, ఏడాది క్రితంచూస్తే 94 శాతం ఉందని చెప్పారు. తాజా ప్రభుత్వగణాంకాల ప్రకారం, ఉల్లిపాయల ద్రవ్యోల్బణం జులైనెలలో 22.54 శాతం ఉండగా, ఆగస్టునెలలో 48.27 శాతంగా ఉందని చెప్పారు. ఈ ధరల పెరుగుదలను అదుపు చేయడానికి కేంద్ర ప్రభుత్వం గతనెలలో మార్కెట్ రేట్లకంటే చాలా తక్కువగా కిలో రూ.35లకే విక్రయాలు ప్రారంభించింది. ఎన్‌సిసిఎఫ్,నాఫెడ్,కేంద్రీయ భాండార్ వంటి రిటైల్ కేంద్రాల ద్వారా ఈ విక్రయాలు చేసింది. సామాన్య ప్రజలకు ధరల పెరుగుదల నుండి ఉపశమనం కలిగించేందుకు ఈ ఏర్పాటు చేసినట్లు నిధి ఖరే చెప్పారు. ఉల్లిపాయల లభ్యతకు కొరత లేదని, ధర తగ్గుముఖం పడుతోందని, ధరలు విపరీతంగా పెరిగినప్పటినుండీ ప్రభుత్వం నేరుగా జోక్యం చేసుకుని 48 నగరాలలో విక్రయాలు చేసిందని, దీనివల్ల కేజీ ఉల్లిపాయల ధర రూ.35లకు వినియోగదారులకు ప్రభుత్వ కేంద్రాల ద్వారా అందుబాటులోకి తెచ్చామని పంజాబ్,హర్యానా,ఢిల్లీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నిర్వహించిన కార్యక్రమం సందర్భంగా నిధిఖరే పత్రికాగోష్ఠిలో ఈ విషయం చెప్పారు.''మండి(హోల్‌సేల్ మార్కెట్) ధరలు గడచిన తొమ్మిది రోజులుగా తగ్గుముఖం పడుతున్నాయని నేను చెప్పగలను,తొమ్మిదీశాతం మేరకు ధర తగ్గింది'' అని ఆమె చెప్పారు. ఉల్లి హోల్‌సేల్ ధరల తగ్గుదల ఒక సానుకూల ప్రభావం చూపిస్తోందని,ప్రభుత్వం నిల్వచేసిన ఉల్లిని హైబ్రీడ్ రవాణా విధానం ద్వారా విడుదల చేయడం ప్రారంభించిందని,రైల్వే,రహదారి మార్గాల్లో వీటిని నగరాలకు చేరవేస్తున్నామని ఆమె చెప్పారు. ప్రస్తుత సంవత్సరానికిగాను ప్రభుత్వం 1.21 లక్షల టన్నుల ఉల్లిపాయలను నిల్వ ఉంచిందని చెప్పారు. ఆగస్టు 24వ తేదీ నుండి నాఫెడ్,ఎన్‌సిసిఎఫ్‌ల ద్వారా ఈ నిల్వలను విడుదల చేయడం ప్రారంభించామని,దీంతో మార్కెట్‌లో పరిస్థితులు మెరుగుపడ్డాయని చెప్పారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో దేశంలో 307.37 లక్షల టన్నుల ఉల్లిపాయల ఉత్పత్తి జరిగిందని, అంతకుముందు ఏడాదిలో 307.67 లక్షల టన్నుల ఉత్పత్తితో పోల్చి చూస్తే స్వల్పంగా ఉత్పత్తి తగ్గిందని చెప్పారు.

## ఖజానా చెరువులో మొసలి సంచారం



### వినాయక నిమజ్జనంపై భక్తుల్లో ఆందోళన

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** పట్టణంలోని వెంకటాద్రిపేట ఖజానా చెరువులో మొసలి సంచరిస్తున్నట్లు స్థానికులు చెబుతుండటంతో సమీపంలోని వినాయక సాగర్ చెరువు పరిసర ప్రజల్లో ఆందోళన నెలకొంది. వెంకటాద్రిపేట చెరువుకు కొద్ది దూరంలోనే వినాయక సాగర్ ఉండటంతో మొసలి అటువైపు వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు భ యపడుతున్నారు. వినాయక సాగర్ చుట్టుపక్కల కాలనీలకు చెందిన యువకులు ప్రతి రోజూ ఉ దయం చెరువులో ఈత కొడుతుంటారు. మొసలి సంచారం గురించి తెలియడంతో వారు భయాందోళనకు గురవుతున్నారు. అయినప్పటికీ కొం దరు యువకులు ఈత కొడుతున్నారని, ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని చెరువులోకి దిగాల్సి వ స్తోందని స్థానికులు చెబుతున్నారు. వినాయక సాగర్‌లోనే వినాయక విగ్రహాల నిమజ్జనం నిర్వహిస్తారు. సమీప చెరువులో మొసలి కనిపించిందన్న సమాచారంతో నిమజ్జనానికి వచ్చే భక్తుల్లో నూ భయాందోళన నెలకొంది. పెద్ద సంఖ్యలో భక్తులు, యువత నిమజ్జన కార్యక్రమంలో పా ల్గొనే నేపథ్యంలో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. మొసలిని గుర్తించి సు రక్షితంగా పట్టుకుని, వినాయక సాగర్ సహా పరిసర చెరువుల్లో ప్రజలకు ఎలాంటి ప్రమాదం లే కుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. వినాయక నిమజ్జనం సమీపిస్తున్నందున అధికారులు వెంటనే స్పందించి తగిన భద్రతా చ ర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# చారిత్రక 'బైరాన్‌పల్లి'ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అశోక్



**ప్రజాపక్షం/మద్దూరు/ధూళిమిట్ట :** తెలంగాణ సా యుధ పోరాట స్మృతి చిహ్నాలు బైరాన్‌పల్లి గుండ్రాంపల్లి లాంటి పోరాటాల ఖిల్లాలను కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి, పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ కోరారు. తెలంగాణ సాయుధ పోరాట 78వ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం బైరాన్‌పల్లి గ్రామ నెత్తుటి చరిత్రలో అమరులైన వీరులకు, అమరవీరుల స్థూపం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ , పార్టీ నాయకులతో పూలమాల వేసి నివాలు అర్పించారు.తెలంగాణ ఉద్యమకారులకు పోరాట స్ఫూర్తి బైరాన్‌పల్లి నెత్తుటి చరిత్ర అని, నిజాం నిరకుషత్వం ధన, మాన, ప్రా ణ దోపిడీలను ఎదురించి 118 మంది ప్రాణాలొడ్డిన బైరాన్‌పల్లి పోరాట చరిత్రను భారతదేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లికించదగ్గ గోప్ప చారిత్రాత్మక చరిత్ర అని పేర్కొన్నారు. బైరాన్‌పల్లి చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఇందు కోసం గతంలో అనేక పర్యాయాలు జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ శాసన సభాపక్ష నేత చాడ వెంకట్‌రెడ్డి స్వయంగా లేటర్ల ద్వార కోరినట్లు గుర్తు చేశారు.

హైదరాబాద్
గురువారం
17-09-2026
www.prajapaksham.in

సందీప్ కిషన్ క్రేజీ యాక్షన్-అడ్వెంచర్ చిత్రం 'సిగ్మా' అక్టోబర్ 2న థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. దర్శకుడిగా జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు.





## 'పాటకు ప్రాణం' షూటింగ్ షురూ


హెచ్.టీ సిని మాస్ ఎల్.ఎల్.పి బ్యానర్‌పై హేమల్ తుమ్మపూడి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కనున్న తొలి చిత్రం 'పాటకు ప్రాణం' హైదరాబాద్‌లోని ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్‌లో ఘనంగా ప్రారంభమైంది. హీరో నిఖిల్ క్లాప్ కొత్తగా , సురేందర్ రెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఈ చిత్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ దర్శకులు సురేందర్ రెడ్డి, హీరో నిఖిల్ ముఖ్య అతిథులుగా హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ మ్యూజికల్ ఫిల్మ్‌లో సుదర్శన్, సాత్విక జంటగా నటిస్తున్నారు. సీనియర్ నటుడు తనికెళ్ల భరణి కీలక పాత్రలో కనిపించనున్నారు. వీరితో పాటు రాజీవ్ కనకాల, అనితా చౌదరి, రఘు కారుమంచి, బ్రహ్మాజీ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.ఈ చిత్రానికి సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానుందని దర్శక నిర్మాత హేమల్ తుమ్మపూడి తెలిపారు. అనంతరం తనికెళ్ల భరణి మాట్లాడుతూ ఈ సినిమాకు చాలా ఛాలెంజింగ్ స్క్రిప్ట్. ముఖ్యంగా పాటలకు చాలా ప్రాధాన్యత ఉంది. సాధారణంగా సినిమాలో కథకు తగ్గట్టుగా పాటలు వస్తుంటాయి. కానీ ఈ సినిమాలో మాత్రం కథే పాటల చుట్టూ తిరుగుతుంది. గతంలో ఇలాంటి నేపథ్యంతో వచ్చిన సినిమా 'శంకరాభరణం'. 'పాటకు ప్రాణం' సినిమాను 'శంకరాభరణం'తో పోల్చడం లేదు. అయితే ఆ సినిమాలో ఉన్న సంగీత స్ఫూర్తి ఈ సినిమాలో కూడా కనిపిస్తుంది. ఈ చిత్రంలో ఒక పాత తరం సంప్రదాయ సంగీత విద్వాంసుడికి, ఈ తరం జెన్‌జీ సంగీతకారుడికి మధ్య ఉండే ఆసక్తికరమైన కలయికను చూపించబోతున్నారు. ఈ సినిమా దర్శకుడిపై నాకు పూర్తి నమ్మకం ఉంది అని అన్నారు. రాజీవ్ కనకాల మాట్లాడుతూ ఈ మ్యూజికల్ జర్నీ అందరినీ తప్పకుండా అలరిస్తుందని, స్ఫూర్తినిస్తుందని నమ్ముతున్నాను. ఇక నా పాత్ర విషయానికి వస్తే.. 'లిటిల్ హార్ట్స్ హిట్ సినిమా తర్వాత అనితా చౌదరితో మరోసారి కలిసి నటిస్తున్నాను అన్నారు. హీరో సుధర్శన్ వంగల మాట్లాడుతూ మా దర్శకుడు హేమల్ చాలా చిన్న వయసులోనే ఎంతో ప్యాషన్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇలాంటి మ్యూజికల్ సినిమాలు చాలా అరుదుగా వస్తుంటాయి. ప్రేక్షకులు థియేటర్లలో ఒక అద్భుతమైన అనుభూతిని పొందేలా మంచి సినిమాను అందించగలమనే నమ్మకం మాకు ఉంది అని తెలిపారు. హీరోయిన్ సాత్విక మాట్లాడుతూ అరుణ్ జీవిత ప్రయాణంలో రాధ పాత్ర కూడా ఒక ముఖ్యమైన భాగంగా ఉంటుందని అన్నారు. నిర్మాత శ్రీరామ్ తుమ్మపూడి, డిఓపి సంజీత్ సింగ్ , ఎడిటర్ ప్రభాత్ రెడ్డి మాట్లాడారు.

## వచ్చేనెల 9న 'బాబా బ్లాక్ షీప్'

న్యూ ఏజ్ క్రైమ్ కామెడీ సినిమా 'బా బా బ్లాక్ షీప్'. దోనేపూడి చక్రపాణి సమర్పణలో చిత్రాలయం స్టూడియోపై వేణు దోనేపూడి నిర్మిస్తున్న సినిమా 'బా బా బ్లాక్ షీప్'. గుణి మంచికంటి దర్శకత్వం వహిస్తున్నారు. అక్టోబర్ 9న సినిమా రిలీజ్ అవుతుంది. టిను ఆనంద్, ఉపేంద్ర, జార్జ్ మరియన్, అక్షయ్ , విష్ణు, కార్తికేయ, విస్మయశ్రీ, మాళ్వీ మల్హోత్రా, కశ్యప్, రాజారవీంద్ర తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మేఘాలయా రాష్ట్రంలో పూర్తిగా చిత్రీకరణను జరుపుకున్న తొలి దక్షిణాది సినిమా ఇదే కావటం విశేషం. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్, రీసెంట్‌గా రిలీజైన 'ఆజా మేరీ జాని' సాంగ్‌కు అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఈ సినిమా నుంచి సెకండ్ సాంగ్ 'వెవెలా ఊహలే చూపినా..'ను రిలీజ్ చేశారు. అనిల్ రావిపూడి ఈ పాటను విడుదల చేసి చిత్ర యూనిట్కు అభినందనలు తెలిపారు. 'వెవెలా ఊహలే చూపినా..' సాంగ్ నేపథ్యం విషయానికి వస్తే..తమకు కావాల్సిన ఓ



అరుదైన బాక్స్ కోసం విలన్ గ్యాంగ్ వెతుకుతుంటుంది. అది హీరో, హీరోయిన్ దగ్గర ఉందని వారు భావిస్తుంటారు. అదే సమయంలో వాళ్లు విలన్స్ కంటపడతారు. మరోవైపు హీరో చేతిలో గన్ ఉంటుంది..అది ఊహించని రీతిలో పేలుతుంది. దీంతో హీరోహీరోయిన్‌లోపై గ్యాంగ్ రివర్స్ ఫైరింగ్ స్టార్ట్ చేస్తారు. ఈ నేపథ్యంలో రేట్రో స్టైల్లో 'వెవెలా ఊహలే చూపినా సాంగ్‌ప్లే అవుతుంటుంది. ఈ సాంగ్‌ను కిట్టు విస్సాప్రగడ రాయగా, శ్రీ సాగర్ పాడారు. పాటను మళ్లీ మళ్లీ వినాలనిపించేలా డిఫరెంట్ బ్యాక్ డ్రాప్, మ్యూజిక్తో ఆసాంతం ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగాచిత్ర నిర్మాత వేణు దోనేపూడి మాట్లాడుతూ డిఫరెంట్ స్టైల్లో సాగే పాట ఇది. మేఘాలయాలోనే పూర్తి సినిమాను కంప్లీట్ చేశాం. అక్కడే మొత్తం సినిమా షూటింగ్‌ను పూర్తి చేసుకున్న తొలి సౌత్ మూవీ ఇదే. చిరపుంజి వంటి అద్భుతమైన లొకేషన్స్‌లోనూ చిత్రీకరించాం. పక్కా ప్లానింగ్‌తో సినిమాను కంప్లీట్ చేశాం అన్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: కొండల్ జిన్నా, క్రియేటివ్ ప్రొడ్యూసర్: శ్వేతా దోనేపూడి సంగీతం : స్టీఫెన్, ఆనంద్.



సందీప్ కిషన్ క్రేజీ యాక్షన్‌అడ్వెంచర్ చిత్రం 'సిగ్మా' అక్టోబర్ 2న థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. దర్శకుడిగా జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. తెలంగాణ, కోస్తా ఏరియాల్లో 'సిగ్మా' సినిమాను మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ లిమిటెడ్ విడుదల చేయనుండగా, ఎన్‌వీఆర్ సినిమా సీడెడ్‌లో రిలీజ్ చేస్తోంది.'సిగ్మా'కు ఈ అసోసియేషన్ ఒక పెద్ద అడ్వాంటేజ్‌గా నిలవనుంది. తెలుగు మార్కెట్‌లో బలమైన

## అక్టోబర్ 2న 'సిగ్మా'

మార్కెట్ ప్రెజెన్స్‌తో పాటు డిస్ట్రిబ్యూషన్‌లో మంచి అనుభవం ఉన్న మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ లిమిటెడ్ ఇప్పటికే పలు బ్లాక్‌బస్టర్ చిత్రాలను రిలీజ్ చేసింది. ఈ సినిమాలో సందీప్ కిషన్ సరసన ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటిస్తున్నారు. రాజు సుందరం, సంపత్ రాజ్, శివ పండిట్, అన్బు థాసన్, యోగ్ జపే కీలక పాత్రల్లో కనిపించనున్నారు. థమన్ ఎస్ సంగీతం అందిస్తుండగా, కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. ప్రవీణ్ కేఎల్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. హరిహరసుతన్ విజువల్ ఎఫెక్ట్స్ అందిస్తున్నారు.

## 'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' టీజర్ రిలీజ్



హర్ష చెముడు ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్'. బాబు డెగాల దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని చవాన్, శ్రీధర్ చెని, దీపక్ ముస్త్యాల నిర్మించారు. రాజ్ సుహాస్, ప్రమదేశ్వి వి క్రియేటివ్ ప్రొడ్యూసర్లుగా వ్యవహరించారు.సెప్టెంబర్ 30 నుంచి ప్రముఖ తెలుగు ఒటిటి వేదిక ఇటివి విన్‌లో 'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' స్ట్రీమింగ్ కానుంది. తాజాగా మేకర్స్ టీజర్ రిలీజ్ చేశారు. హర్ష ఫాదర్ ఎవరినైనా ప్రేమించమని చెప్పే సన్నివేశంతో మొదలైన టీజర్ ఆద్యంతం ఆకట్టుకుంది. టీజర్‌లో ఫన్ అలరించింది. హర్ష టైమింగ్ అదిరిపోయింది. హైపర్ ఆది పంచులు మరో హైలైట్‌గా నిలిచాయి.జీవన్ కుమార్, ఐశ్వర్య హోలక్కల్, శ్రావ్య చౌదరి ఇతర కీలక పాత్రల్లో ఆకట్టుకున్నారు. అజయ్ అరసాడ సంగీతం, శక్తి అరవింద్ సినిమాటోగ్రఫీ,. జానీ షేక్ ప్రొడక్షన్ డిజైనర్‌గా, లిఖిత్ లీ ఎడిటర్‌గా, సాయి ప్రావలిక కాస్ట్యూమ్ డిజైనర్‌గా, పీవీజీ విశ్వనాథ్ లైన్ ప్రొడ్యూసర్‌గా పనిచేశారు.హర్ష చెముడు, హైపర్ ఆది, జీవన్ కుమార్, ఐశ్వర్య హోలక్కల్, రూప శ్రావ్య, శ్రీ విద్యా, ప్రేమ్ సాగర్, వాసు ఇంటూరి, మహేందర్, జబర్దస్త్ గోపి తదితరులు నటించారు.

## 'నీ నానుండి దూరంగా' పాట ఆవిష్కరణ



ఎం ఎస్ ఎం ప్రొడక్షన్ నిర్మాణంలో రూపొందిన 'నీ నానుండి దూరంగా' పాట ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సంగీత దర్శకుడు శ్రీ చరణ్ పాకాల, ప్రముఖ నటుడు వికాస్ వశిష్ఠ ముఖ్య అతిథులుగా హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.'నీ నానుండి దూరంగా' పాటను జ్ఞానానంద దర్శకత్వంలో రూపొందించారు .చిత్రానికి రామ్ చరణ్ మాటూరి సంగీతాన్ని అందించారు. ప్రేమ, భావోద్వేగాలకు ప్రాధాన్యతనిస్తూ తెరకెక్కిన ఈ సాంగ్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుందని చిత్ర బృందం తెలిపింది.ఈ సాంగులో హీరోగా అభిరామ్ పాత్రలో గిరిధర్ నటిస్తుండగా, హీరోయిన్‌గా జానకి పాత్రలో మధు కనిపించనున్నారు.

## అక్టోబర్ 30న వస్తున్న 'కిల్లర్'



జ్యోతి పూర్వజ్, పూర్వాజ్, లీడ్ రోల్స్‌లో నటిస్తున్న సెన్సేషనల్ సై ఫై థ్రిల్లర్ మూవీ 'కిల్లర్'. మనీష్ గిలాడా, చంద్రకాంత్ కొల్లు, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను ధ్యానం నాన్న ఆశీస్సులతో థింక్ సినిమా, ఎయూ అండ్ ఐ స్టూడియోస్ బ్యానర్స్‌పై పూర్వాజ్ , పద్మనాభ రెడ్డి.ఎ. నిర్మిస్తున్నారు. ఉర్వీశ్ పూర్వజ్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. పూర్వాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. 'కిల్లర్' సినిమా అక్టోబర్ 30న వరల్ వైడ్ థియేట్రికల్ రిలీజ్ రాబోతోంది. మహిళల కోసం 'కిల్లర్' సినిమా మేకర్స్ సూపర్ షీ ఛాలెంజ్ ను అనౌన్స్ చేశారు. రాత్రికి రాత్రే మీకు సూపర్ పవర్ వస్తే ఏం చేస్తారో చెబుతూ రీల్స్ చేసి పంపితే వారిలో బెస్ట్ రీల్స్ చేసిన పది మందికి ఒక్కొక్కరికి 10 వేల రూపాయల చొప్పున క్యాష్ ప్రైజ్ ఇవ్వబోతున్నట్లు ప్రకటించారు. అలాగే తమ ఆన్సర్స్‌ను టెక్స్ట్ మెసేజ్ పంపిన వారిలో బెస్ట్ ఆన్సర్స్ పంపిన 20 మంది ఒక్కొక్కరు 2 వేల రూపాయల చొప్పున క్యాష్ ప్రైజ్ అందుకోవచ్చు. త్వరలో జరగనున్న కిల్లర్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ లో విజేతలను వేదిక మీదకు పిలిచి ఈ క్యాష్ ప్రైజ్ అందిస్తారు. ఔత్సాహికులు తమ రీల్స్, టెక్స్ట్ మెసేజ్‌లు హీరోయిన్ జ్యోతి పూర్వజ్ ఇన్‌స్టాగ్రామ్ అక్కౌంట్ కు ట్యాగ్ చేయాలి. ఈ వివరాలను వెల్లడిస్తూ హీరోయిన్ జ్యోతి పూర్వజ్ ఓ స్పెషల్ వీడియో రిలీజ్ చేశారు.ఓవర్సీస్ లో 'కిల్లర్' మూవీ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఒఎంజి పిక్చర్స్ ఈ సినిమాను ఓవర్సీస్ డిస్ట్రిబ్యూట్ చేస్తోంది. ఈ సంస్థ 'కిల్లర్' సినిమాను అమెరికా, యూరప్, కెనడా, అరబ్ దేశాలు, మలేషియా, న్యూజిలాండ్, రష్యా వంటి దేశాల్లో విడుదల చేయబోతోంది.

## 'యుపిఐ'పై చార్జీలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయాన్ని తీవ్రంగా తప్పు పట్టింది. తక్కువ ఖర్చుతో కూడిన చెల్లింపులను అందించడానికి యుపిఐని ప్రభుత్వమే గతంలో ప్రజా డిజిటల్ మౌలిక సదుపాయంగా నిర్మించిన విషయాన్ని సిపిఐ గుర్తుచేసింది. వినియోగదారులపై చార్జీలు విధించబోమని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, వ్యాపారులు ఎల్లప్పుడూ ఆ ఖర్చులను వినియోగదారులపై మోపడానికి మార్గాలను కనుగొంటారని అనుభవం చెబుతోందని. యుపిఐ వినియోగంపై చార్జీలు విధించడం అనే మోదీ ప్రభుత్వం చర్య ఏ మాత్రం సహేతుకం కాదని సిపిఐ మండిపడింది. కేవలం చెల్లింపు రూ.10,000అయినంత మాత్రాన అదనపు ప్రాసెసింగ్ ఖర్చు ఏమీ ఉండదని స్పష్టం చేసింది.ఎన్‌పిసిఐ అనేది గణనీయమైన నగదు, పెట్టుబడులతో ఉన్న నగదు సమృద్ధిగా కలిగిన ఒక సంస్థ మాత్రమే కాకుండా ప్రభుత్వానికి రూ.కోట్ల నగదు చెల్లించిన సంస్థ అని సిపిఐ పేర్కొంది. ప్రభుత్వ డిజిటల్ చెల్లింపు వ్యవస్థను, చివరికి వినియోగదారులపై భారం మోపే రుసుములను వసూలు చేసే యంత్రాంగంగామార్చడాన్ని ఎవరూ సమర్థించబోరని గట్టిగా నొక్కిచెప్పింది. ఈ నిర్ణయం వెనక ఉన్న సందర్భాన్ని విస్మరించలేమని తెలియజేసింది. అమెరికా వాణిజ్య ప్రతినిధి భారతదేశపు యుపిఐ, జీరో ఎండిఆర్ ఫ్రేమ్‌వర్క్‌ను స్పష్టంగా వ్యతిరేకించారని గుర్తుచేసింది. భారతదేశపు డిజిటల్ చెల్లింపు విధానాలు దేశీయ చెల్లింపు వ్యవస్థలకు అనుకూలంగా ఉండి, అమెరికన్ చెల్లింపు కంపెనీలకు ప్రతికూలంగా ఉన్నందున వాటిని వాణిజ్య అవరోధంగా గుర్తించారని, వీసా, మాస్టర్‌కార్డు వంటి కంపెనీలకు చెల్లింపులను విస్తరించడంలోనూ యుపిఐ, రూపేలను తక్కువ ఆకర్షణీయంగా చేయడంలోనూ ప్రత్యక్ష ప్రయోజనం ఉందని, యుఎస్ వర్తకుల లావాదేవీల మొత్తం విలువలో సుమారు 65శాతం వాటా రూ.22,000కు పైబడిన లావాదేవీలదేనని, సరిగ్గా ఇదే విధానంపై ఇప్పుడు ఛార్జీలు విధించడం వెనక మోదీ ప్రభుత్వం భారతదేశం ప్రయోజనాలను తాకట్టుపెట్టిందని సిపిఐ ఆరోపించింది. యుపిఐని ప్రధాని మోదీ డిజిటల్ ఇండియాకు చిహ్నంగా పదేపదే ప్రచారం చేశారని, విదేశీ ఒత్తిడికి లొంగి దాని స్వయం ప్రతిపత్తిని వదులుకోవడం మన డిజిటల్ సార్వభౌమాధికారంపై ఒక మాయని మచ్చ అని విమర్శించింది. ఇది చివరికి వ్యాపారులపై, వినియోగదారులపై భారం మోపుతూ విదేశీ చెల్లింపు సంస్థల వాణిజ్య ప్రయోజనాలకు ఉపయోగపడుతున్నదని మండిపడింది. మోదీ ప్రభుత్వం ఇప్పటికే భారతదేశపు డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో భారీ వాటాను వాల్‌మార్ట్ యాజమాన్యంలోని ఫోన్ పే, ఆల్ఫాబెట్ యాజమాన్యంలోని గూగుల్ పేలకు అప్పగించిందని, ఈ రెండు సంస్థలు కలిసి దాదాపు 80శాతం యుపిఐ లావాదేవీలను నిర్వహిస్తున్నాయని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం ఆరోపించింది. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ ప్రజా వ్యతిరేక నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, యుపిఐని ఉచితంగా ఉంచాలని డిమాండ్‌చేసింది.

## 'ఢీ' కొట్టిన పాక్ నౌక

(మొదటి పేజీ తరువాయి)

తెలిపింది. సముద్రంలో పాకిస్థాన్ నావికా దళాలు ఆమోదయోగ్యం కాని, వృత్తి విరుద్ధమైన రీతిలో ప్రవర్తించడం వల్ల భారత నావికాదళానికి చెందిన ఒక దళంతో ఢీకొనడం జరిగింది. ఈ విషయంపై సిడిఎను ఈ రోజు విదేశాంగ మంత్రిత్వ శాఖకు పిలిపించి, ఆయనకు తీవ్ర నిరసన తెలియడం జరిగింది' అని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.అంతర్జాతీయ జలాల్లో జరిగిన ఈ సంఘటన వల్ల పెద్ద నష్టం జరగనప్పటికీ పాకిస్థాన్ నౌకదళ ప్రవర్తన, సైనిక విన్యాసాలు, కసరత్తులు, దళాల కదలికలపై ముందస్తు నోటీసుకు సంబంధించి ఏప్రిల్ 1991లో భారత్, పాకిస్థాన్‌ల మధ్య కుదిరిన ఒప్పందంలోని ఆర్టికల్ 10కు పూర్తిగా విరుద్ధంగాఉంది' అని అది పేర్కొంది. ఇస్లామాబాద్‌లోని భారత తాత్కాలిక రాయబారికి (ఛార్జి డి అఫైర్స్) కూడా పాకిస్థాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ వద్ద ఇదే తరహా నిరసనను తెలియజేయాలని ఆదేశించినట్లు విదేశాంగ శాఖ (ఎంఇఎ) తెలిపింది.

## ఆకట్టుకున్న వీరయోధుల ఛాయాచిత్ర ప్రదర్శన

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రైతాం గ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా 'దున్నే వానిదే భూమి' అని నినదిస్తూ భూమి కోసం, భుక్తి కోసం, తెలంగాణ విముక్తి కోసం సాగిన చరిత్రలో రక్తాక్షరాలతో లిఖించబడ్డ మహోత్తర చరిత్ర కలిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వీర యోధుల ఛాయాచిత్ర ప్రదర్శనను ఆకట్టుకుంది. సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశారు. "బాంచన్ దోర.. కాళ్లు మొక్తా.. అన్న మట్టి మనుషులే కమ్యూనిస్టు పార్టీ అందించిన ధైర్యంతో అందిన వస్తువులనే ఆయుధాలుగా చేసుకుని భూస్వాముల గుండాలను, కూడిన ఛాయాచిత్రాలు ప్రదర్శనను తిలకించిన వారికి స్ఫూర్తిని కలిగించాయి. మరోవైపు ఉద్యమాన్ని ముం దుండి నడిపిన రావి నారాయణరెడ్డి, మగ్ధూం మొహియుద్దీన్, బొమ్మగాని ధర్మ భిక్షం ఆరుట్ల కమలాదేవి, ఆరుట్ల రామచంద్రారెడ్డి లాంటి యోధుల చిత్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అమాయక గ్రామ ప్రజలను క్రూరంగా హింసించిన రజకార్ల అధ్యక్షుడు కాశీం రజ్వీ, ఉపాధ్యక్షుడు విసూరు రామచంద్రారెడ్డిల చరిత్రను ప్రజలకు తెలియజేస్తూ ఛాయాచిత్రాలను ఏర్పాటు చేశారు. మరోవైపు హైదరాబాద్ సంస్థానం చీకటి ఒప్పందంలో భాగంగా నాటి కేంద్ర హోంశాఖమంత్రి సర్దార్ వల్లబాయ్ పటేల్, నిజాంల మధ్య ఛాయాచిత్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఛాయాచిత్ర ప్రదర్శనను సిపిఐ శ్రేణులతో పాటు తిలకించిన ప్రజలు పలువురు భావోద్వేగానికి గురయ్యారు. ఈ ఛాయ చిత్ర ప్రదర్శనను ప్రత్యేక చొరవ తీసుకుని ఏర్పాటు చేయించిన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహా, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్‌లను పలువురు సిపిఐ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

## తెలంగాణ చరిత్రలో 'సెప్టెంబర్ 17' మరపురాని రోజు

### ప్రజాస్వామ్యం, స్వేచ్ఛకు నాంది పలికిన మహత్తర ఘట్టం: మహేష్‌కుమార్ గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17 అత్యంత కీలకమైన, మరపురాని రోజని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావడంతో ప్రజాస్వామ్య పాలనకు మార్గం సుగమమైందని పేర్కొన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన రైతులు, కార్మికులు, విద్యార్థులు, మహిళలు, సామాన్య ప్రజలు చేసిన త్యాగాలను స్మరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజల స్వేచ్ఛ కోసం జరిగిన పోరాటం ఏ ఒక్క రాజకీయ పార్టీ, వర్గం లేదా ప్రాంతానికి పరిమితమైనది కాదని, కోసం సాగిన చారిత్రక పోరాటమని తెలిపారు. ఈ పోరాటంలో ప్రాణ త్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులు అర్పిస్తున్నట్లు మహేష్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవడమే వారికి అందించే నిజమైన నివాళి అని అన్నారు.

## రూ.25 వేలకు పెంపు

(మొదటి పేజీ తరువాయి)

పెంచినట్టు కేబినెట్ భేటీ తర్వాత సమాచారశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పిఎఫ్ పరిధిని విస్తరించడం ద్వారా ఉద్యోగులకు మరింత సామాజిక భద్రత, ఆర్థిక స్థిరత్వం లభిస్తుందని అశ్వినీ వైష్ణవ్ వివరించారు. కంపెనీలు, యాజమాన్యాలు తమ సిబ్బందిని దీర్ఘకాలం పాటు తమవద్దే కొనసాగించే అవకాశం ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 17 (గురువారం) నుంచే నూతన విధానం అమల్లోకి వస్తుందని కేంద్రమంత్రి తెలిపారు. 'గురువారం విశ్వకర్మ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న ఉద్యోగుల కోసం ప్రధాని నరేంద్ర మోదీ కేబినెట్ సమావేశంలో ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న పిఎఫ్ నిబంధనల ప్రకారం వేతన పరిమితి రూ. 15,000గా ఉండేది. ఈ పరిమితిని 2014లో సవరించారు. ఇప్పుడు దీనిని నెలకు రూ. 25,000 వేతనానికి పెంచాం. ఇకపై పిఎఫ్ కోతల కోసం నెలకు రూ. 25,000 అనేది కొత్త పరిమితిగా ఉంటుంది. రూ. 15,000 నుంచి రూ. 25,000 వేతన పరిధిలో ఉన్న సుమారు 51 లక్షల మంది ఉద్యోగులకు దీనివల్ల ప్రయోజనం చేకూరుతుంది. వీరంతా ఇప్పుడు కొత్త పిఎఫ్ నిబంధనల పరిధిలోకి వస్తారు. దీనివల్ల భారత ప్రభుత్వంపై ఏటా సుమారు రూ. 11,339 కోట్ల అదనపు భారం పడుతుందని అంచనా' అని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. కేంద్రం తాజా నిర్ణయంతో అదనంగా 51 లక్షల మంది ఇపిఎఫ్ఓ పరిధిలోకి వచ్చే అవకాశం ఉంది. ఇపిఎఫ్‌కు సంబంధించి ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఏటా సుమారు రూ. 10వేల 250 కోట్లను వెచ్చిస్తోంది. తాజా నిర్ణయంతో ఈ వార్షిక వ్యయం రూ. 11వేల 339 కోట్లకు చేరనుందని అంచనా. అయితే, ఇపిఎఫ్ వేతన పరిమితి పెంచాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది. 2004 నుంచి 2014 ఆగస్టు వరకు ఇపిఎఫ్ఓ వేతన పరిమితిలో ఎలాంటి మార్పు చేయలేదు. ఆ తర్వాత 2014 సెప్టెంబర్‌లో వేతన పరిమితిని రూ. 15వేలకు పెంచారు. వేతనాల్లో వృద్ధి, పెరిగిన ఆదాయాలు, ఉపాధి విస్తరణను దృష్టిలో ఉంచుకుని పరిమితిని రూ. 15వేల నుంచి 25వేలకు పెంచినట్లు ప్రభుత్వం తెలిపింది.

## చరిత్రను చెరపలేరు

(మొదటి పేజీ తరువాయి)

సీనియర్ నాయకురాలు పి.ప్రేమ్ పావని తదితరులు పాల్గొన్నారు.

**సాయుధ పోరాటమే లేకపోతే హైదరాబాద్ సంస్థానం విముక్తి అయ్యేదికాదు : పల్లావెంకటరెడ్డి**

కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సాగిన రైతాంగ సాయుధ పోరాటం జరిగకపోయి ఉంటే హైదరాబాద్ సంస్థానం విముక్తే కాకపోయేదని పల్లా వెంకట రెడ్డి అన్నారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కాకపోవడంతోనే కమ్యూనిస్టుల సారధ్యంలో 1947 సెప్టెంబర్ 11న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి అంకురార్పణ జరిగిందన్నారు. ఈ పోరాటం ద్వారా కేవలం ఏడాది కాలం లోపే సుమారు 3 వేల గ్రామాలను విముక్తి చేయడంతో పాటు 10 లక్షల ఎకరాల భూమునలను పేదలకు పంచడం జరిగిందన్నారు. దీంతో గ్రామాల్లో ఉన్న నిజాం ఎజెంట్లు బెంబేలెత్తి భారత దేశంలో విలీనం కాకపోతే హైదరాబాద్ సంస్థానం కమ్యూనిస్టుల వశం కానుందని మొర పెట్టుకోవడంతో నిజాం భారత ప్రభుత్వంతో విలీనం ఒప్పందానికి వచ్చారని చెప్పారు. అందులో భాగంగా హైదరాబాద్ సంస్థానం విలీనం పేరుతో అప్పటి కేంద్ర హోంమంత్రి, సర్దార్ వల్లబాయ్ పటేల్, నిజాంలకు మధ్య జరిగిన ఆ ఒప్పందం 'చీకటి ఒప్పందం'గా ఆయన అభివర్ణించారు. ప్రజలను క్రూరంగా హింసించిన నిజాం రాజుతో పాటు రజకార్లను శిక్షించాల్సిందిపోయి అప్పటి భారత ప్రభుత్వం నిజాంకు రాజ్ ప్రముఖ్ (గవర్నర్) స్థాయి హోదా కల్పించడంతో పాటు రాజభరణం చెల్లించడం ఇందుకు నిదర్శమని పేర్కొన్నారు. ఈ పోరాటం తెలంగాణ సమాజంలో సామాజిక, రాజకీయ మార్పునకు ఒక ముఖ్యమైన దశగా నిలిచిందన్నారు. ఆనాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్న ఒక్కో వీరుడి వెనుక ఒక్కో పోరాట చరిత్ర ఉందని, ఆ వీరోచిత సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించిన వీరుల త్యాగాలు, పోరాటస్ఫూర్తిని నేటి తరానికి అందించేందుకే ఛాయాచిత్రాలతో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశామని చెప్పారు.



**ఎర్రజెండాలన్నీ ఏకం కావాలి : కూనంనేని సాంబశివరావు**

కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకం కావాలని కలిసికట్టుగా ముందుకు సాగాలని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల వేదికగా కూనంనేని సాంబశివరావు మరోసారి పిలుపునిచ్చారు. పార్టీల మధ్య సిద్ధాంతపరమైన, ఇతర భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండాలన్నీ ఏకం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. సమాజంలో దందాలు, మాఫియా, రౌడీయిజం వంటి పరిణామాల నేపథ్యంలో ప్రత్యామ్నాయ ప్రజా రాజకీయాల అవసరం ఉందని పేర్కొన్నారు. నాడు రజాకార్ల అండతో గ్రామాల్లో భూస్వాములు కొనసాగించిన అరాచకాలను ఎదుర్కొనేందుకు రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి , మగ్దూం మొహియుద్దీన్ నాయకత్వంలో 1947 సెప్టెంబర్ 11న సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను రాజకీయ కోణంలో కాకుండా తెలంగాణ సమాజ చరిత్రలో ఒక ముఖ్యమైన అధ్యాయంగా చూడాలని అన్నారు. పోరాటంలో పాల్గొన్న నాయకులు, అమరులైన యోధుల త్యాగాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

**విమోచన పేరుతో బిజెపి వక్రీకరణ : ఈ.టి.నరసింహా**

హైదరాబాద్ సంస్థానం విలీనాన్ని బిజెపి 'విమోచన దినం' పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తోందని ఈ.టి.నరసింహా విమర్శించారు. తెలంగాణ సాయుధ పోరాటం హిందూ–ముస్లిం ఘర్షణ కాదని, భూమి, బతుకు, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా సాగిన ప్రజా పోరాటమని స్పష్టం చేశారు. సాయుధ పోరాటంలో ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర లేనేలేదన్నారు. అమరవీరుల చరిత్రను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవద్దని ఆయన హెచ్చరించారు.

**అమరవీరుల రక్తతర్పణంతో సాగిన సాయుధ రైతాంగ పోరాట చరిత్రను ఎవరూ చెరిపివేయలేరు : నెల్లికంటి సత్యం**

4,500 మంది అమరవీరుల రక్తతర్పణంతో సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను బిజెపి ఎన్ని కుట్రలు చేసి చెరిపేయాలనుకున్నా చెరగదని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం స్పష్టం చేశారు. తెలంగాణ నేలపై స్థూపాలుగా, ప్రజల జ్ఞాపకాల్లో నిలిచిన ఈ చరిత్రను చెరిపేయడం ఎవరి వల్లా కాదని ఆయన పేర్కొన్నారు. సాయుధ పోరాట అమరవీరుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి, ప్రభుత్వం అధికారికంగా గుర్తించి నిర్వహించాలని డిమాండ్ చేశారు. రావి నారాయణరెడ్డి, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య తదితర యోధుల చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com